
నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్' ఏర్పాటులో.. ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్రే కీలకం

దేశ నేర రాజధానిగా బీహార్

ఎఫ్‌-35 యుద్ధ విమానానికి మరమ్మతులు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 217 | సోమవారం | 07-07-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


రాష్ట్రంలో ఐదురోజులు

# భారీ నుంచి అతిభారీ వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, తరువాయి 2లో



పాశమైలారం ఘటన...

# 42కు చేరిన మృతులు

లభించని మరో 8 మంది ఆచూకీ

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మతుల సంఖ్య 42కు చేరింది. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడుతో పాటు మరొకరు మృతిచెందారు. ఈ ఘటనలో మరో 8 మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ తరువాయి 2లో





02

పోక్సో చట్టం ఒక మైలురాయి

- పిల్లల రక్షణలో పునరావాసం కీలక పాత్ర
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్




05

న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడండి

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ హితవు
- బాంబే హైకోర్టు సన్మాన కార్యక్రమంలో సందేశం

# సొంతింటి కల నెరవేరుస్తున్నాం

- పేదలు ఆత్మ గౌరవంతో జీవించాలి
- పారదర్శకంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ
- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ మధిర




పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని ప్రతి పేదవాడు సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించి మధిర ట్యాంక్‌బండ్ వద్ద రూ. 6.45 కోట్లతో చేపట్టిన పర్యాటక సౌకర్యాల కల్పన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ తరువాయి 2లో

చెంచులకు 13,266

# ఇందిరమ్మ ఇండ్లు

- సచ్యురేషన్ పద్ధతిలో మంజూరు చేస్తున్నాం
- నేడు మున్ననూర్‌లో పత్రాలు అందజేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) పరిధిలోని 21 నియోజక వర్గాలలో సచ్యురేషన్ పద్ధతిలో 13,266 చెంచు కుటుంబాలకు 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం కూడా చెంచులకు పక్కా గృహాలను ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన చెంచులు దశాబ్దాల పాటు సొంత ఇండ్లకు నోచుకోలేదని, వారి సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి సూచనలు, సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో భాగంగా సోమవారం నాడు అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో స్థానిక ఎంఎల్‌ఎ డాక్టర్ వంశీకృష్ణతో కలిసి చెంచులకు 'ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను' స్వయంగా తానే అందజేస్తానని పేర్కొన్నారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని. వీరు అడవుల్లో తరువాయి 2లో

పని ప్రదేశంలో మహిళలపై..

# లైంగిక వేధింపులు తిప్పికొట్టాలి

- ధైర్యంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదే
- 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ' సదస్సులో వక్తలు




ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై మహిళా ఉద్యోగులు అవగాహనను పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో, పని ప్రదేశాలలో వారిపై జరుగుతున్న లైంగిక వైధింపులను తిప్పకొట్టాలని పలువురు వక్తలు అన్నారు. పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగులు ధైర్యంగా పనిచేసే పరిస్థితులను, వాతావరణాన్ని కల్పించే బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉందన్నారు. రాజ్యాంగం, చట్టాల ప్రకారం ప్రజలందరికీ సమాన హక్కులు ఉన్నాయని, ఎవరి పరిమితుల్లో వారు ఉండాలని, సమాజంలో ఎవరిని అవమానించే హక్కు ఎవరికీ లేదని వక్తలు స్పష్టం చేశారు. 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ' అంశంపై సదస్సు ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐబిఇయు– ఎపి, టిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. సదస్సుకు ఐబిఇయు (ఎపి, టిఎస్) చైర్మన్ కె.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బిఎస్. రాంబాబు, ఇండియన్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణీష్ కుమార్, ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఐబిఇయు (ఎపి, టిఎస్) ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, ఇండియన్ బ్యాంక్ మల్కాజ్‌గిరి జోనల్ మేనేజర్ స్వర్ణ ప్రవ సుందరే, ఎపిటిబిఇఎఫ్ మహిళా విభాగం కన్వీనర్ కె.వి.స్వాతి, ఐబిఇయు (ఎపి,టిఎస్) మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలని అవగాహన గోడపత్రికను వారు ఆవిష్కరించారు. సదస్సును బి.ఎస్.రాంబాబు ప్రారంభిస్తూ బ్యాంకింగ్ రంగంలో లైంగిక వైధింపులు లేకుండా మహిళా ఉద్యోగులకు ఎఐబిఇఎ వెన్నుదన్నుగా నిలబడుతుందన్నారు. మహిళా ఉద్యోగుల హక్కులు, భద్రత అంశాలను ఎఐబిఇఎ బ్యాంకింగ్ యాజమాన్యాల వద్ద ప్రధాన అంశంగా చర్చించి వారికి అనేక రక్షణలను వేతన ఒప్పందాలలో పొందుపర్చినట్లు వివరించారు. బ్యాంకులలో మహిళా ఉద్యోగులకు గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు బ్యాంకుల యాజమాన్యాలతో పాటు ఎఐబిఇఎ కూడా కృషి చేస్తుందన్నారు. జాతీయ బ్యాంకులలో ఉన్న రూ.210 లక్షల కోట్ల సంపదపై ప్రైవేటు, కార్పొరేట్, పెట్టుబడీదారుల కన్ను పడిందన్నారు. ఈ నేపథ్యంలో అనేక పోరాటాలు చేసి సాధించుకున్న బ్యాంకుల జాతీయకరణను, బ్యాంకింగ్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బ్యాంకింగ్ రంగంపై జరుగుతున్న దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ప్రైవేటు రంగం చేతుల్లో పడితే దేశం, ప్రజలు, ఉద్యోగుల పరిస్థితి అధోగతి పాలవుతుందన్నారు. బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని, అందుకు అనుగుణంగా బ్యాంకుల అధికారులు, ఉద్యోగుల యూనియన్ పనిచేస్తేనే ఉద్యోగులకు తరువాయి 2లో




# దళారులను నమ్మొద్దు

- పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక
- దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగానే జరిగిందని, దశలవారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల తొలివిడతలో భాగంగా లబ్ధిదారులకు హక్కుపత్రాలు, నిర్వాసితులకు ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. తాము ఇళ్ళిప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు వెంటనే పోలీస్ కేసులు పెట్టాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి మాటిచ్చారని, ఇక్కడే ముగ్గురు మంత్రులు ఉండటంతో అనుకున్నట్లుగా అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుందని, ఉద్యోగులకు కూడా హెచ్‌ఆర్‌ఎస్ పెరుగుతుందని, అదే విధంగా ట్యాక్స్‌లు పెరుగుతాయని ప్రజలు భయపడుతున్నారని, ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెరిగే ప్రసక్తే లేదన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రజలకు మేలు చేసేందుకు కలిసిమెలిసి పనిచేద్దామని అనడంతో ఇప్పుడే కాదు రాబోయే రోజుల్లో సైతం కలిసిమెలిసే ఉంటామని మంత్రి అనడంతో సభాప్రాంగణంలో నవ్వులు పూశాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో కొన్ని సమస్యలున్నాయని, వాటిని మంత్రి పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో చొరవచూపాలని, బిపిఎల్ కోటా క్రింది సాధరణ ధరలకు వారికి స్థలాలు కేటాయిస్తే మేలన్నారు. ఒకే ఇంట్లో తరువాయి 2లో

జమిలి ఎన్నికల బిల్లులో ఇసికి

## అడ్డూ అదుపూలేని అధికారాలు ఎలా ఇస్తారు?

జెపిసికి అభిప్రాయ సేకరణలో నిలదీసిన చంద్రచూడ్



**న్యూఢిల్లీ :** దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ బిల్లులో కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన అధికారాలను భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రశ్నించారు. ఈ మేరకు తన అభిప్రాయాలను కమిటీకి సమర్పించారు. ఈ బిల్లుపై అభిప్రాయసేకరణలో భాగంగా సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తన అభిప్రాయాలను సమర్పించారు. ఐదేళ్ళ పాలనాకాలానికి గాను ఎన్నుకున్న అసెంబ్లీల కాలపరిమితికి విరుద్ధంగా వాటిని రద్దు చేసేందుకు లేదా పొడిగించేందుకు ఎన్నికల సంఘానికి అడ్డూ అదుపూలేని అధికారాలు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ఐదేళ్ళ గడువుకు విరుద్ధంగా చట్టసభ పదవీకాలాన్ని పొడిగించడం సాధ్యం కాదని చంద్రచూడ్ పేర్కొన్నారు. ఇ.సికి కొన్ని మార్గదర్శక సూత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తరువాయి 2లో

జిఎస్‌టికి సవరణలు

# చేయాల్సిందే



- కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తిచెప్పాలి
- కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్
- దేశంలో పేదరికం, అసమానతలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రపంచబ్యాంకు నివేదికలపై ఆందోళన

**న్యూఢిల్లీ:** పేదరికం–అసమానతలు భారతదేశంలో చాలా ఎక్కువగా ఉన్నాయని ఇటీవల ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొనడంపై కాంగ్రెస్‌పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో కార్పొరేట్ అనుకూల విధానాలను స్వస్తిచెప్పాలని, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దేశఃలో పెరుగుతున్న పేదరికంపై అవగాహన కొరవడిందనీ, ఈ విషయంలో కేంద్రం దాపరికంలేని బాహాటత్వ విధానం పాటించడంలేదని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ ప్రపంచ బ్యాంకు నివేదికలోని ప్రధానాంశాలను పత్రికలకు వివరించారు. భారత్‌లో పేదరికం–అసమానతలు భారత్‌లో చాలా ఎక్కువగా ఉన్నాయని ఈ ఏడాది ఏప్రిల్ నెల 27వ తేదీన ప్రపంచబ్యాంకు విడుదల చేసిన నివేదిక వెల్లడించిందనీ, ఈ నివేదిక విడుదలైన మూడు నెలల తర్వాత మోదీ భజనబృందం దీనిని తారుమారు చేసి ప్రపంచంలో సమానత్వం సాధించిన దేశాలలో భారత్ చోటు తరువాయి 12లో

# గొంతు కోసి ఐదేళ్ల బాలిక దారుణ హత్య

జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన

ప్రజాపక్షం/కోరుట్ల



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లోని ఆకుల రాములు–నవీన దంపతుల ఐదేళ్ల కుమార్తెను గొంతుకోసి అతి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళ్లితే... శనివారం రోజున సాయంత్రం 6 గంటల సమయంలో హితిక్ష సాయంత్రం ఆడుకునేందుకు ఇంటినుంచి బయటకు వెళ్లిన బాలిక కనబడకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు చుట్టు పక్కలు ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే అదే కాలనీలోని తరువాయి 12లో

# ఎలాన్ మస్క్ కొత్త పార్టీ

- 'అమెరికన్ పార్టీ'గా ఆవిర్భావం!
- వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికల నాటికి ఆచరణలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది
- ప్రాథమికంగా కేవలం కొంతమందిపైనే దృష్టి
- 'ఎక్స్' వేదికగా మస్క్ ప్రకటన



**న్యూయార్క్ :** ద్వంద్వపార్టీల వ్యవస్థకు పేరుగాంచిన అమెరికా ప్రజాస్వామ్యంలో ఇప్పుడు అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కొత్త పార్టీ ఆవిర్భవించింది. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికల నాటికి తన ''అమెరికన్ పార్టీ'' ఆచరణలో క్రియాశీల రాజకీయశక్తిగా పాత్ర పోషిస్తుందని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు. ప్రాథమికంగా తమ పార్టీ కేవలం కొంతమందిపై మాత్రమే దృష్టిపెట్టి ప్రతినిధులసభ–సెనేట్ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. గడచిన 100 సంవత్సరాల అమెరికా చరిత్రలో మూడో రాజకీయపార్టీ ఆవిర్భావానికి జరిగిన ప్రయత్నాలు పెద్దగా విజయం సాధించలేదు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లను ముందుగా హెచ్చరించిన విధంగానే, కొత్త రాజకీయపార్టీ ఏర్పాటు చేసినట్లు ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఐతే తన పార్టీని ఎక్కడ రిజిస్టర్ చేశారన్న విషయాన్ని ఆయన చెప్పలేదు. ఒక పార్టీ ఆవిర్భవించాలంటే చట్టబద్ధంగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ (ఎఫ్ఇసి) వద్ద రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇటీవలి ఎఫ్ఇసి సమాచారం ప్రకారం ఎలాంటిపార్టీ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ దాడుల్లో 33 మంది మృతి



**డెర్ అల్ బలాహ్ :** గాజాలో ఆదివారంనాడు ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో 33 మంది పాలస్తీనియన్లు మరణించారు. 100 లక్ష్యాలపై ఇజ్రాయెల సైన్యం దాడులు చేసినట్లు గాజా ఆసుపత్రి అధికారులు తెలియజేశారు. గాజా సిటీలో రెండు నివాసిత ప్రాంతాలపై చేసిన దాడుల్లో 20 మంది మరణించగా, మరో 25 మంది గాయపడ్డారని సైఫా ఆసుపత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సేల్మియా చెప్పారు. దక్షిణగాజాలో మువాసీలో చేసిన దాడుల్లో 13 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ విధంగా నివాసిత ప్రాంతాలపై దాడుల గురించి ఐ డి ఎఫ్ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. గడచిన 24 గంటల్లో 130 లక్ష్యాలపై ఐడిఎఫ్ దాడులు చేసింది.

# బందీలు–ఖైదీల మార్పిడిపై చర్చలు

### దోహాకు ఇజ్రాయెల్ ప్రతినిధి బృందం



**టెల్అవీవ్ :** గాజాలో పరిస్థితులను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఒక కీలక ప్రక్రియ ప్రారంభమైంది. బందీలు–ఖైదీల పరస్పర మార్పిడికి సంబంధించి మధ్యవర్తి దేశం ఖతార్ ఏర్పాటు చేసిన చర్చల్లో పాల్గొనేందుకు ఒక బృందాన్ని దోహాకు పంపాలని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ ఆదివారంనాడు నిర్ణయించారు. చర్చలకు వెళ్ళేందుకు ఆహ్వానాన్ని సమ్మతించామనీ, కానీ హమాస్ చేస్తున్న డిమాండ్లు ఎంతమాత్రం సమ్మతింపరానివిగా ఉన్నాయని ఇజ్రాయెల్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి. అంతర్గతంగా ప్రజలనుండి వస్తున్న తీవ్ర ఒత్తిడిని ప్రభుత్వం తట్టుకోలేకపోతున్నది. గాజాలో హమాస్ పరిపాలనను పూర్తిగా నిర్మూలించిన తర్వాతే శాశ్వత శాంతి ఒప్పందం జరగాలని ఇజ్రాయెల్ కోరుకుంటున్నది. గాజాలో హమాస్ పరిపాలన కొనసాగించేవిధంగా శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ సుముఖంగా లేదు. ఈ పరిస్థితుల్లో రెండో విడత 60 రోజుల కాల్పుల విరమణకు, బందీలు,ఖైదీల పరస్పర మార్పిడికి మధ్యవర్తుల ప్రభావం కారణంగా చర్చలకు రంగం సిద్ధమవుతోంది.

చర్చలకు ఇప్పటికిప్పుడే సిద్ధంగా ఉన్నామని శనివారం నాడు హమాస్ ప్రకటించడంతో ఇజ్రాయెల్ ప్రజలు వేలాదిమంది దేశవ్యాప్తంగా గతరాత్రి పొద్దుపోయాక వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. వాయిదా పద్ధతుల ప్రస్తావన లేకుండా బందీలందరి విడుదలకు హమాస్‌తో సమగ్ర ఒప్పందం చేసుకోవాలని బందీల కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, సామాన్య ప్రజలు డిమాండ్ చేశారు. టెల్అవీవ్ నగరం హోస్టేజస్ స్క్వేర్ వద్ద భారీ ప్రదర్శన,బహిరంగ సభ జరిగింది. బందీల కుటుంబీకులు మాట్లాడుతూ తమ బిడ్డలను విడుదల చేసేందుకు తక్షణం ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. హమాస్ ఉగ్రవాదులవద్ద ఇప్పటికీ ఇంకా 50 మంది బందీలుగా ఉన్నారు. ఐతే వీరిలో 28 మంది మరణించారనీ, కేవలం 20 మంది మాత్రమే సజీవంగా ఉన్నారనీ రూఢీగా తెలిసింది. హమాస్–ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం కుదిరితే విడతల వారీగా 10 మంది సజీవులైన బందీలను, మరో 18 మృతదేహాలను స్వాధీనం చేసేందుకు హమాస్ సుముఖత వ్యక్తం చేసింది. బందీల విడుదలకు హమాస్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా సుముఖంగా ఉన్నప్పటికీ హమాస్ చేస్తున్న మానవసహాయపరమైన డిమాండ్లు ఆయనకు నచ్చడంలేదు. హమాస్ చేస్తున్న డిమాండ్లను "సమ్మతింరానివి"గా ఆయన తిరస్కరిస్తున్నారు. గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యం ఖాళీచేసి వెళ్ళిపోవాలని, శాశ్వతంగా గాజాలో యుద్ధం ఆగిపోవాలని, ఐక్యరాజ్యసమితి, దాని భాగస్వామ్య సంస్థల అధీనంలో మాత్రమే పాలస్తినా ప్రజలకు ఆహారం, ఇతర అంతర్జాతీయ మానవతాసహాయాన్ని పంపిణీ చేయాలని హమాస్ కోరుతున్నది. అందుకు నెతన్యాహూ తిరస్కరిస్తున్నారు. ఒప్పందం కుదిరినా కుదరకపోయినా గాజాలో యుద్ధం వెంటనే ఆపేయాలని హమాస్ సంస్థ ప్రధానంగా డిమాండ్ చేస్తున్నది. ఈ విషయాలను శనివారం రాత్రి పొద్దుపోయాక ఇజ్రాయెల్ మంత్రివర్గం కూడా చర్చించింది. ఒకవైపు దోహాకు తన బృందాన్ని పంపిన నెతన్యాహూ మరోవైపు తమకు అనుకూలమైన విధంగా వాతావరణాన్ని, ఒప్పందాలను మార్చుకునేందుకు వీలుగా ఆలోచనలు చేసుకుని ఈ వారంలోనే వాషింగ్టన్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మూడురోజులక్రితం ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా, "గాజా శాంతికి చేరువ అవుతోంది" అని పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్–హమాస్ చర్చలు కోరుకుంటున్నాయని ప్రకటించారు. ఈ వారంలోనే 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరిగే అవకాశం ఉందని కూడా ప్రకటించారు. ఆ తర్వాత హమాస్ కూడా సానుకూల సంకేతాలు ఇచ్చింది.

# ట్రంప్ టారిఫ్‌లపై సర్వత్రా ఉత్కంఠ

### అమెరికా–యూరప్ రెంటికీ తీవ్ర నష్టదాయకం



**ఫ్రాంక్‌ఫర్ట్ :** పెంచిన టారిఫ్‌ల అమలుకు పొడిగించిన గడువుతేదీ జులై తొమ్మిదో తేదీతో ముగుస్తూ ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ ఏర్పడింది. సోమవారంనాడు 12 దేశాలకు టారిఫ్ లేఖలు పంపేందుకు సిద్ధమైనట్లు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అమెరికాలో భారీ ఎత్తున వాణిజ్యం చేస్తున్న దేశాలలో తీవ్ర ఆందోళన రేగింది. ముఖ్యంగా అమెరికా–యూరప్‌లోని దేశాలమధ్య జరిగే వాణిజ్యం ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 2024లో అమెరికా–యూరప్ మధ్య 1.7 ట్రిలియన్ యూరోలు (2 ట్రిలియన్ డాలర్లు) మేరకు వస్తు సేవల వ్యాపారం జరిగింది. సగటున రోజుకు 4.6 బిలియన్ యూరోల వ్యాపారం జరుగుతుంది. ఈ రెండింటి మధ్యా ఏర్పడే ఒడిదొడుకులు అనేక కంపెనీలకు, వినియోగదారులకు అందరికీ నష్టం కలిగిస్తాయి. పెంచిన టారిఫ్‌ల వల్ల ముఖ్యంగా యూరప్ దేశాలకే కాకుండా, అమెరికాకు కూడా తీవ్ర నష్టం కలుగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాతో వ్యాపారం చేస్తున్న యూరప్‌లోని అనేక కంపెనీలు పెంచిన టారిఫ్‌ల గురించే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మొదటివారంలో ట్రంప్ అన్ని యూరప్ దేశాలనుండి అమెరికాకు దిగుమతయ్యే వస్తువులపై 20 శాతం దిగుమతి సుంకాలను విధించారు. ఆ తర్వాత అనేక దేశాలు చేసిన విజ్ఞప్తుల మేరకు వీటి అమలును జులై 9 వరకూ వాయిదా వేశారు. కానీ యూరోపియన్ దేశాల బ్లాక్ కూడా పట్టుదలతోనే ఉంది. తాము కూడా ప్రతీకార సుంకాలతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. బీఫ్ దగ్గర నుండి ఆటో ఉత్పత్తుల వరకూ, బీర్ నుండి బోయింగ్ విమానాల వరకూ వందలాది అమెరికన్ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలకు యూరప్ బ్లాక్ సిద్ధంగా ఉంది. ముడి చమురును యూరప్‌కు అమెరికా ప్రధానంగా ఎగుమతి చేస్తుంది. తర్వాత ఫార్మా ఉత్పత్తు, ఎయిర్‌క్రాఫ్ట్, ఆటోమొబైల్స్, మెడికల్, డయాగ్నోస్టిక్ పరికరాలను చాలా ఎక్కువగా యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తుంది. ఐతే యూరప్ దేశాలే చాలా ఎక్కువ వ్యాపారం చేస్తాయి. అమెరికా చేసే వ్యాపారం తక్కువే. ఒకేసారి 10 శాతం దండనాత్మక టారిఫ్‌లు విధించారు. ఇతరదేశాలు తమను దోచుకుంటున్నాయనీ, అమెరికా నుండి ఎగుమతయ్యే వస్తువులపై భారీగా పన్నులు వారు వసూలు చేస్తుంటే, అమెరికాకు దిగుమతయ్యే వస్తువులపై చాలా తక్కువ టారిఫ్‌లతో ప్రపంచదేశాలన్నీ అనేక దశాబ్దాలుగా బాగా లాభపడుతున్నాయని ప్రకటించిన ట్రంప్ ఈ వాణిజ్యలోను భర్తీచేసి అమెరికాను తిరిగి సంపన్నదేశంగా మారుస్తానని శపథం చేశారు. ఇందులోభాగంగానే టారిఫ్‌ల యుద్ధం మొదలైంది. దాదాపు 50 దేశాలు దిగి వచ్చాయని, తమతో బేరసారాలకు వచ్చాయని ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఐతే వాణిజ్య చర్చల్లో యూరోపియన్ యూనియన్ వైఖరిపట్ల ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యూరప్ నుండి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై సుంకాలను భారీగా 50 శాతానికి పెంచుతున్నట్లు ఆయన చెప్పారు. ఫ్రెంచ్ చీజ్, ఇటాఇయన్ తోలు వస్తువులు దగ్గర నుండి జర్మనీ ఎలక్ట్రానిక్స్ గూడ్స్, స్పెయిన్ ఫార్మాస్యూటికల్స్ వరకూ అన్ని వస్తువుల ధరలూ ఈ సుంకాలపెంపువల్ల అమెరికాలో పెరిగిపోతాయి. అందువల్ల ఈ సుంకాలవల్ల అమెరికా–యూరప్ రెండింటికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిక చేస్తున్నారు.

# టెక్సాస్‌ను ముంచెత్తిన ప్రమాదకర వరద

### 51కి చేరిన మృతులు



**ఆస్టిన్ :** గడచిన వంద సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేనంత దారుణమైన వరద విలయం అమెరికా టెక్సాస్ హిల్ కౌంటీని ధ్వంసం చేసింది. సహాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు వందలమంది రంగంలోకి దిగారు. ఆకస్మికంగా మొదలైన వర్షాలు, వరద విలయం కొనసాగుతోంది. నదీ పరీవాహకప్రాంతంలో అత్యాధునిక వార్నింగ్ వ్యవస్థలు కొంతకాలంగా పనిచేయకపోవడంవల్ల మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మొదట శుక్రవారం తెల్లారుజామున 12.7 నుండి 17.8 సెంటీమీటర్ల భీకర వర్షం కురిసి ఉంటుందని అధికారులు అంచనావేస్తున్నారు. దీనివల్లే ఈ ప్రాంతంలో వర్షపాతం కొత్తచరిత్ర సృష్టించింది. ఈ వారంలో మరిన్ని భారీ వర్షాలు టెక్సాస్ ప్రాంతంలో పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఒక్క శనివారంనాడే 5 నుండి 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆకస్మికంగా ప్రారంభమైన భారీ వర్షాలు, నిమిషాల వ్యవధిలో అనూహ్యస్థాయిలో పెరిగిన నదీ నీటిమట్టం కారణంగా అడ్డూ అదుపూలేని గ్వాడాలుపే వరద టెక్సాస్‌ను ముంచెత్తడంతో గడచిన మూడు రోజుల్లో ఇప్పటివరకూ 51 మంది మరణించారు. వీరిలో 15 మంది పిల్లలు ఉన్నారు. లెక్కలేనంతమంది గల్లంతయ్యారు. ఒక్క కెర్ కౌంటీలోనే 43 మంది మరణించారు. మరో 29 మంది గల్లంతయ్యారని ఊహిస్తున్నామని, ఎంతమంది జాడ తెలియకుండా వరదలో కొట్టుకుపోయారో ఖచ్చితంగా తెలియని కౌంటీ అధికారులు చెప్పారు. జాడ తెలియకుండాపోయిన నివాసితులకోసం సహాయబృందాలు ముమ్మర గాలింపు చర్యలు ఆపకుండా కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే గ్వాడాలుపే నది ఒడ్డున సమ్మర్ క్యాంప్‌కు వచ్చి వరదలో కొట్టుకుపోయిన 27 మంది బాలికల జాడ ఇంతవరకూ తెలియకపోగా గల్లంతైనవారి సంఖ్య ఇంకా పెరిగింది. గల్లంతైన బాలికలు అందరూ 12 ఏళ్ళ లోపు వయసువారేనని టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నర్ డాన్ పాట్రిక్ చెప్పారు. గల్లంతైనవారికోసం హెలికాప్టర్ల ద్వారా గాలిస్తున్నారు. ఇప్పటివరకూ 850 మందిని వరద ప్రమాదం నుండి కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఈ వరద విలయాన్ని చూసిన శాస్త్రవేత్తలు రాబోయేకాలంలో ప్రపంచవ్యాప్తంగా సంభవించబోయే ప్రకృతి వైపరీత్యాలను తలచుకుని తీవ్ర ఆందోళన వ్యవక్తం చేస్తున్నారు. వాతావరణంలో ఏటి కేడాది తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయని వారు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గడచిన మూడు రోజులుగా దేశాధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు. సన్నిహితంగా గమనిస్తూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

# ఇరాన్‌లో పేలిన ఇజ్రాయెల్ బాంబులు

### ఇద్దరు ఐఆర్‌జిసి సైనికులు మృతి



**టెహ్రాన్ :** గతనెలలో ఇజ్రాయెల్ చేసిన దాడుల తర్వాత చిందరవందరగా పడిన లైవ్ బాంబులను పేలకుండా నిర్వీర్యం చేసేందుకు జరిగిన ప్రయత్నంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్(ఐఆర్‌జిసి)కు చెందిన ఇద్దరు సైనికులు ఆదివారంనాడు మరణించారు. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలో ఇజ్రాయెల్ జూన్ 13న యుద్ధం ప్రారంభించింది. 12 రోజులు ఈ యుద్ధం జరిగింది. ఇరాన్‌లో పడిన పేలని బాంబులను నిర్వీర్యం చేసి వాటిని తొలగించేందుకు ఐఆర్‌జిసి ప్రయత్నం చేసినప్పుడు ఖొర్రమాబాద్‌లో ఈ మరణాలు సంభవించాయి.

# పోక్సో చట్టం ఒక మైలురాయి : జస్టిస్ విక్రమ్ నాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోక్సో చట్టం ఒక మైలురాయి అని, పిల్లల రక్షణలో పునరావాసం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు మహిళా భద్రతా విభాగం, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, యునిసెఫ్ సహకారంతో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన "వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్ హక్కులు లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ"అనే అంశంపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి జస్టిస్ విక్రమ్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూరి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీకి ప్రధాన పోషకుడు జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ పాఠశాల పిల్లలు ఉపాధ్యాయులతో ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఒక నైతిక కథను వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం తరగతి గదిలో విద్యార్థితో ఉపాధ్యాయురాలిగా కాకుండా తల్లిలా ప్రవర్తించాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషి మాట్లాడుతూ.. పిల్లలపై వేధింపులకు సంబంధించిన అన్ని అంశాలను సమావేశంలోని అన్ని సాంకేతిక సెషన్లలో విస్తృతంగా కవర్ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపు హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల పిల్లలకు నాటకాలు, స్కిట్లు, వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా బాలల హక్కుల గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షించడంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలను వివరించారు. యునిసెఫ్ ఇండియాలో చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోనీకుట్టి జార్జ్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల నుండి పిల్లలను రక్షించడానికి ముందుకు సాగడానికి వ్యూహం అవసరమన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాసరావు పోక్సో చట్టం కింద నేరాలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమల దేవి ఈడ మాట్లాడుతూ..లైంగిక వేధింపులకు గురైన బాలల హక్కులు, రక్షణ గురించి వివరించారు. తెలంగాణ బాధితుల పరిహార పథకం కింద బాధితులకు సకాలంలో పరిహారం చెల్లించడానికి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ చేసిన కృషిని ఆమె ప్రశంసించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పిల్లలకు భద్రతా స్థలాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ లోని ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి డి. రామకాంత్, హైదరాబాద్‌లోని యునిసెఫ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మురళీ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్, హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సుధ, సిఐడి అదనపు డిజి చారుసిన్హాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్లు'

(మొదటి పేజీ తరువాయి)

వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి,వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని వివరించారు. చెంచులకు చిన్న చిన్న గుడిసెలు తప్ప పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు కూడా అందని విషయమని, అలాంటి ఆ అడవి ప్రాంతాలను వారు వదిలి బతక లేరని, అందుకే వారు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలోని (10, 836ఇండ్లు) మంచిర్యాల 157, నిర్మల్ 153, ఆసిఫాబాద్ 3371, బోథ్ 163, ఖానాపూర్ 2257, సిర్పూర్ 227, అదిలాబాద్ 2848, బెల్లంపల్లి 223, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 274, ఇండ్లను మంజూరు చేయగా, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్ ( 2156) పరిధిలోని అచ్చంపేట్ 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174, కొల్లాపూర్ 105, కల్వకుర్తి 120, వికారాబాద్ 63, దేవరకద్ర 64, నాగార్జునసాగర్ 17, మొత్తంగా 13,266 ఇండ్లను చెంచులకు మంజూరు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లును మంజూరు చేస్తున్నామని, ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్ల చొప్పున 8750 ఇండ్లను మంజూరు చేసినట్లు వివరించారు. గిరిజన ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## అధికారాలు ఎలా ఇస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించారు. చంద్రచూడ్‌తోపాటు మరో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.కేహార్ కూడా ఈ పార్లమెంటరీ కమిటీ ఎదుట ఈనెల 11న హాజరుకావాల్సి ఉంది. బిజెపి ఎంపి పి.పి.చౌధరి నాయకత్వాన ఈ పార్లమెంటరీ కమిటీ అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నది. 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' ఆలోచనను ఆయన సమర్థించినప్పటికీ ఎన్నికల సంఘానికి ఇచ్చిన ప్రతిపాదిత అధికారాలు, బిల్లులోని అనేక అంశాలపట్ల చంద్రచూడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో మార్పులు చేర్పులు చేసేందుకు అనేక సలహాలు సమర్పించారు. లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడంపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న భయాలను, సంబంధిత విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు చెప్పడాన్ని ఆయన తిరస్కరించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను వేరు వేరుగా నిర్వహించాలని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదని ఆయన అన్నారు. ఐనప్పటికీ కూడా మరో మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఏకీభవించారు. ఎన్నికల సంఘానికి ప్రతిపాదిత బిల్లులో తిరుగులేని అధికారాలను గొగోయ్ ప్రశ్నించారు. చంద్రచూడ్ కూడా ఎన్నికల సంఘానికి తిరుగులేని అధికారాలు ఇవ్వడాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తన విచక్షణను ఉపయోగించడానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శక సూత్రాలు విధించకుండా తిరుగులేని అధికారాలు ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు.

## భారీ నుంచి అతిభారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

## 42కు చేరిన మృతులు

(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు. ప్రమాదం సంభవించి ఏడురోజులైనా కార్మికులను గుర్తించడంలో పురోగతి లేదంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. కాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ధృవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 9 మందిలో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు 40 నుంచి 80 శాతానికిపైగా కాలిన గాయాలతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం భీం రావు అనే కార్మికుడు మృతిచెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్ చౌదరి చనిపోయారు. తాజాగా మరో ఇద్దరు మరణించడంతో మరణాల సంఖ్య 42కి పెరిగింది.

## లైంగిక వేధింపులు తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం జరుగుతుందన్నారు. ప్రణీష్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకులో మంచి పని వాతావరణాన్ని కల్పించామని, మహిళా ఉద్యోగులపై వైధింపులు పూర్తిగా లేకుండా కృషి చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎఫ్‌జిఎం పరిధిలోని 490 ఇండియన్ బ్యాంకు శాఖలు, 8 జోనల్ కార్యాలయాల్లో ఎక్కడా మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మహిళా ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. టి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సమస్యలపై చర్చించడం, ప్రతిఘటించడం ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందు కోసం ఉద్యోగులు చేసే ఉద్యమాలకు ఎఐబిఇఎ మద్దతుగా ఉంటుందన్నారు. స్వర్ణ ప్రవ సందరే మాట్లాడుతూ మహిళలు కేవలం సమస్యలు, లైంగిక వేధింపులకు గురైనప్పుడే కాకుండా అన్ని అంశాలలో మహిళలు ఐక్యంగా ఉండాలన్నారు. మహిళల రక్షణ, భద్రతకు బ్యాంకింగ్ రంగంలో అనేక చట్టాలు, విధానాలు ఉన్నాయని, సమస్యలు వచ్చినప్పుడు వాటి ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తొలుత సభకు ఐబిఇయుఎపి, టిఎస్ సంయుక్త కార్యదర్శి జి.నల్లపరెడ్డి స్వాగతం పలికారు.

## దళారులను నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రెండుమూడు కుటుంబాలవారు ఉంటున్నారని, స్లాబ్ ఉన్న ఇళ్లకు మరో ఇంటిని ఇచ్చే అవకాశం లేదనే నిబంధన ఉందని, కానీ కొడుకులకు వివాహం అయితే ఈ నిబంధనల వల్ల ఇబ్బంది ఉందని, దీనిని పరిగణలోనికి తీసుకుని వివాహమైన కుమారులుంటే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరీచేయాలన్నారు. ఇది సంగరేణి ఏరియా అని, సింగరేణి భూముల్లో చాలా కాలంగా పేదలు నివాసలు ఏర్పాటు చేసుకుని ఉన్నారని, కొందరు స్థలాలు ఆపుకున్నారని, అలాంటి వారు ఇల్లు నిర్మించుకోవాలంటే క్రమబద్ధీకరణ కావాలని అంటున్నారని, అలాంటివారు కూడా ఇందిరమ్మ ఇళ్లను కట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాల్వంచలో జీవో 76 వలన ప్రతీ సారి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఇది ఇబ్బందిగా మారిందన్నారు. ఎన్నికల వచ్చినప్పుడు దానిని మ్యూట్‌లో పెడుతున్నారని, ఎన్నికల తర్వాత అన్‌మ్యూట్ చేస్తున్నారని చెప్పారు. దీనిపైప్రత్యేక చర్యలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటిని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వేదికపై నుండే హామీ ఇచ్చారు. సభా సమావేశం ప్రారంభానికి ముందు ఎంఎల్‌ఏ హాజరైన ప్రజల మధ్యలో కలియ తిరుగుతూ అందరినీ అప్యాయంగా పలుకరించి కరచాలనం చేశారు. ముందుగా ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ మేలు చేకూరుతుందని, ఎవ్వరూ ఎలాంటి నిరాశకు గురికావాల్సిన పనిలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలన్నీ విడతల వారిగా అందుతాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, టిపిసిసి సభ్యులు నాగసీతారాములు, కోనేరు చిన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పేదల సొంతింటి కల సాకారం కావాలంటే ఇందిరమ్మ ప్రభుత్వం రావాలని నమ్మి అవకాశం అందించారని ఆయన తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం తొలి విడతలో రూ. 22,500 కోట్లు ఖర్చు చేస్తూ 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. గతంలో చేసిన పాదయాత్రలో ప్రజల బాధలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 93 లక్షల రేషన్‌కార్డు లబ్దిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, రూ. 500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వృద్దులు, దివ్యాంగులకు పింఛన్, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం, నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం చేపట్టామన్నారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ అందించామన్నారు. రెండు లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం పథకం క్రింద ఎకరానికి రూ. 12వేలు అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం క్రింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ ఒక్కొక్క కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మధిర ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన 1544 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి దశల వారీగా ఐదు లక్షల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, టూరిజం ఎస్ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, హౌజింగ్ పిడి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా డెయిరీ ఏర్పాటుకు కార్యాచరణ**

మధిర నియోజక వర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించి కార్యాచరణను వేగవంతంగా చేయాలని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆదివారం మధిర క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఇందిరా డెయిరీ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. డెయిరీకి సంబంధించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల పురోగతి వివరాలను డిప్యూటీ సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇందిరా డెయిరీ పథకంలో నిర్దేశించిన పథకం మేరకు పశువుల యూనిట్ గ్రౌండింగ్‌కు కార్యాచరణ అమలు చేయాలన్నారు. ప్రతి లబ్దిదారునికి రెండు గేదెలు అందజేయాలన్నారు. రెండు గేదెలతో పాటు నాలుగు పాడి పశువులకు సరిపడ షెడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరా డెయిరీ సభ్యులకు, అసలు గేదెలు లేని వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాబోయే 20 రోజుల్లో నియోజక వర్గ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఇందిరా డెయిరీ పథకం ప్రారంభం కావాలన్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను కూడా పారదర్శకంగా చేపట్టాలన్నారు. పాడి పశువుల కొనుగోలు బృందంలో ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గేదెల కొనుగోలు కమిటీ పారదర్శకంగా పనిచేయాలని ఎలాంటి అవకతవకలు జరిగిన ఉపేక్షించేది లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవిధంగా గడ్డి సరఫరాకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. యువతకు ఉపాధితో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్‌డివో సన్యాసయ్య, ఇడి ఎస్‌ఇ కార్పోరేషన్ నవీన్‌బాబు, మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి పురందర్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, మధిర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయచంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లోకేష్‌తో కెటిఆర్ రహస్య మంతనాలు

నేడు అమరవీరుల స్థూపం వద్దకు వస్తే చర్చిద్దాం.. : టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏపి సిఎం చంద్రబాబు కుమారుడు, ఏపి మంత్రి నారా లోకేష్‌తో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. కెటిఆర్, నారా లోకేష్‌లు పలు మార్లు కలిశారని, ఆ రహస్య మంతనాలు ఎవరికి లబ్ది చేయడానికో సమాధానం చెప్పాలని కెటిఆర్‌ను డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు ప్రతిసవాళ్లు విసురుతున్న కెటిఆర్, అన్ని అంశాలపైన సోమవారం అమరవీరుల స్థూపం వద్దకు వస్తే చర్చిద్దామని సవాల్ విసిరారు. కెటిఆర్ సవాల్‌కు తాను సరిపోతానని, సిఎంతో పోల్చుకోవద్దని సూచించారు. కెటిఆర్ గతంలో రేవంత్ రెడ్డి అంటే ఎవరో అని అన్నారని, కానీ ప్రస్తుతం రేవంత్ పేరు పక్కన కెటిఆర్ పేరు వస్తే చాలని తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు

జిల్లా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మహబూబాబాద్ జిల్లా మహాసభ రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పార్టీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలు అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని బడా బాబుల చేతుల్లో పెట్టి వ్యవసాయ భూములను కార్పొరేట్లకు అప్పగించాలనే కుటిల బుద్ధితో దేశంలో మూడు రైతు చట్టాలను తీసుకువస్తే దేశంలో యావత్ రైతులు ఒకతాటిపైకి వచ్చి కదం తొక్కితే ప్రధాని మోదీ తోక ముడిచి నూతన వ్యవసాయ చట్టాన్ని వెనక్కి తీసుకున్నారన్నారు. అలాగే కార్మికులను కార్పొరేట్ల జీతగాళ్ళుగా మార్చి, కార్మిక హక్కులను కాలరాసే విధానాలకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, కోట్లాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని ఆయన తెలిపారు. గత కేంద్ర ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టపోయినట్లు దేశ ప్రజలు బిజెపికి గుణపాఠం చెప్పారని, సోషలిస్ట్ అని చెప్పుకుంటున్న నితీష్, సెక్యులరిస్ట్ అని చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడు మద్దతుతోనే దేశంలో బిజెపి నిలబడిందని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. రైతులు, పేదలకు ఇచ్చిన రుణాలను బ్యాంకులు ముక్కు పిండి వసూలు చేస్తున్నాయని, లక్షల కోట్లు రుణాలు తీసుకుని బ్యాంకులను మోసం చేసి దేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, లలిత్ మోడీ లాంటి బడా బాబులను వదిలేసి పేదలను రాక్షసుల్లా పీడిస్తున్నారని ఆయన విమర్శించారు. అటవీ సంపద దోచుకోవాలనే దుష్ట ఆలోచనతో దొంగ ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టులను అంతం చేస్తామని ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటోందని బిజెపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చి హామీలు నెరవేర్చడంలో విఫలమవుతోందని, రైతుల రుణమాఫీ అనేక కారణాలతో కొద్దిమందికి మాత్రమే మాఫీ అయిందని పూర్తిగా అమలు కాలేదన్నారు. అలాగే రూ.15 వేలు రైతు భరోసా గత ఎండాకాలంలోనే ఇస్తామని చెప్పిన అధికార కాంగ్రెస్ పార్టీ నేటికీ అది అమలు కాలేదన్నారు. పేదల సమస్యలు పరిష్కరించని పక్షంలో అధికా కాంగ్రెస్ నైనా వదిలిపెట్టేది లేదని అన్నారు. పేదలకు అన్యాయం జరిగితే సిపిఐ చూస్తూ ఊరుకోదని, ఎంతటి వారినైనా ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాలో నిరంతరం పేదల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటం చేస్తున్న చరిత్ర సిపిఐకి ఉందని, కురవిలో జరుగుతున్న జిల్లా మూడవ మహాసభల్లో సరైన నిర్ణయాలు తీసుకుని భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ప్రతినిధుల మహాసభలో తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి స్వాగతోపాన్యాసం చేయగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. రేషపల్లి నవీన్, తుర్క రమేష్, మామిండ్ల సాంబలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ప్రతినిధుల సభలో సిపిఐ జిల్లా సహా య కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, రాష్ట్ర కంట్రో ల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరావు, కట్టెబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరావు, కరణం రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, బాలకృష్ణ, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, పాండురంగాచారి పాల్గొన్నారు.

## ‘ఎర్రపార్టీల’ అంతం ఆలోచనలను విరమించుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ‘‘ఎర్రజెండా పార్టీలను’’ అంతం చేయాలనే ఆలోచలను తక్షణమే విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజున నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో జరిగిన 4వ సిపిఐ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్బంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘‘ఆపరేషన్ కగార్’’ ప్రకటన కేంద్రం ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పట్ల అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర ఆందోళనను తెలియజేస్తోందని శంకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవాలను జరుపుకుంటోందని, 1925లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో సిపిఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. దేశంలోని 32 రాష్ట్రాలలో పేదల పక్షాన, కార్మికుల పక్షాన వారి సమస్యల సాధన కోసం సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవే టు వ్యాపారస్తులకు అప్పగించి, ప్రజలను నిరుద్యోగులను చేస్తున్నారని కలవేని శంకర్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నిర్మల్ జిల్లాలోని 1000 ఊడలమర్రి, రాంజీగోండు చరిత్ర గల గడ్డను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అక్కడే కొనసాగించాలని, డిప్యుటేషన్‌పై పంపకూడదని కోరారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలని, లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలను కూడా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని సూచించారు. ఈ మహాసభలో సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి, భుక్య రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రవి, పద్మకుమారి, కైలాస్, సాయి, బి.శివాజీ, లచ్చన్న, అబ్దుల్ మసీద్, జి.గోపి, టీ ప్రకాష్, ఎస్.కుమార్‌తోపాటు సిపిఐ అనుబంధ సంఘ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పిజి కాలేజీ కోసం ఉధృత పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్

అనంతరం సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలో గతంలో పిజి కాలేజీ ఉండేదని, అది ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందించేదని తెలిపారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో దానిని వరంగల్‌కు తరలించారని ఆరోపించారు. మళ్లీ పిజి కాలేజీ కోసం సిపిఐ పార్టీ తరపున ఉధృత పోరాటం చేపడతామని, కళాశాలను సాధించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యారంగ అభివృద్ధికి వెనుకబడిన నిర్మల్ జిల్లాను మరింత అభివృద్ధి పరచాలని, విద్యా సంబంధిత కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల త్యాగాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను, స్థలమున్న వారికి ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దిలావర్‌పూర్ మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీని శాశ్వతంగా తొలగించాలని, తాత్కాలికంగా పనులు నిలిపివేయడం కాదని అన్నారు. దేశంలో కార్మిక వ్యతిరేక పోరాటం జరుగుతోందని, అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీని నమ్ముకున్న వారిని ఎప్పుడు వమ్ము చేయదని, రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులదే భవిష్యత్తు అని వారు అన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారు


మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, తొలివిడతలో భాగంగా ఆడపడుచులకు తొలి ఏకాదశి కానుకగా ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు, ఇంటి పట్టాలు అందిస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, చుంచుపల్లి మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 2490 హక్కుపత్రాలు, ఎస్‌టిఆర్, మాయాబజార్ నిర్వాసితులకు 600 ఇండ్ల స్థలాల పట్టాలను ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తొలి ఏకాదశి నాడు ఆడ పడుచులకు ఇండ్ల మంజూరీ పత్రాలు అందజేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమకు ఇళ్లు రాలేదని ఏ ఒక్కరూ నిరాశ చెందనవసరం లేదని, అర్హతున్న ప్రతీ ఒక్కరికీ ఇంటిని నిర్మించిన ఇచ్చే బాధ్యత మాదే అన్నారు. తొలివిడతగా రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇల్లు మంజూరు చేశామని, అందులో 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, 1 లక్ష ఇళ్లకు లబ్దిదారుల ఎంపిక పూర్తయిందని, మరికొన్నింటికి ఎంపిక జరగాల్సి ఉందన్నారు. భవిష్యత్‌లో గడిలేని గ్రామం ఉంటుందేమోగానీ ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదన్నారు. ప్రతీ సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వనిబంధనల ప్రకారం వారివారి ఖాతాల్లో నగదు జమవుతోందన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే దళారులను నమ్మొద్దని, ఎవ్వరికీ ఒక్క పైసా కూడా ఇవ్వొద్దని చెప్పారు. ఆ నాటి బిఆర్ఎస్ పాలన స్వప్రయోజనాల కోసం సాగిందని, ప్రజలు, రైతుల ప్రయోజనాలు తాకట్టుపెట్టిందని మండిపడ్డారు. తెలంగాణ నీటి నిల్వలను పక్క రాష్ట్రానికి అప్పనంగా కట్టబెట్టే కుట్రకు శ్రీకారం చుట్టిందే బిఆర్ఎస్ పాలకులన్నారు.అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం రూప్లా తండా వద్ద, చింతపెంటిగూడెం గ్రామాల్లో రూ.5 కోట్ల అంచనాలతో నిర్మించతలపెట్టిన రెండు హైలెవల్ వంతెలను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, టిపిసిసి సభ్యులు నాగసీతారాములు, కోనేరు చిన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## ‘ఎరుకల కార్పొరేషన్’ను ఏర్పాటు చేయండి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు పోటీ చేసే అవకాశాన్ని కల్పించడంతో పాటు వారిని గెలిపించుకోవాలని సూచించారు. ‘ఏకలవ్యుడి జయంతి’ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీమ్ విగ్రహం వద్ద ఏకలవ్యుడి చిత్రపటానికి కవిత ఆదివారం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏకలవ్య భవనాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన ‘ఎరుకల సాధికారత పథకాన్ని మరింత మెరుగుపర్చి, కాంగ్రెస్ ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణకు ఎంఎల్‌సిగా అవకాశం కల్పిస్తే అప్పటి గవర్నర్ అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రూప్‌సింగ్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్ పాల్గొన్నారు. జియాగూడ సబ్జీమండిలోని గోల్కొండ శ్రీ జగదాంబ ఎల్లమ్మ ఆలయ 51వ వార్షికోత్సవం, బోనాల పండగ ఉత్సవాల్లో కూడా కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.

## రూ.2500 హామీ ఏమైంది?

బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేద మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందో ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 9వ మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. బికెఎంయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలు ముగిశాయి. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి పలు తీర్మాణాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా అమోదం పొందింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య మాట్లాడుతూ తీర్మాణాలపై భవిష్యత్తు ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత రంగారెడ్డి జిల్లా సమితిపై ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.2500 నేటికి ఇవ్వడం లేదని మండిపడ్డారు. జిల్లా మహాసభలో జిల్లా కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి 25 కౌన్సిల్, 13కార్యవర్గం, 9మంది ఆఫీస్ బేరర్స్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసిందని వివరించారు. అధ్యక్షులుగా జె.అంజయ్య, జిల్లా ప్రధా న కార్యదర్శిగా బుద్దుల జంగయ్యలకు తిరిగి అవకాశం ఇచ్చారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా శివాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల జంగయ్య, శ్రీశైలం యాదవ్, జిల్లెల వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా రమేష్ యాదవ్, స్వరూప, జిల్లా కోశాధికారిగా ఎం.కృష్ణలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మికులు పేదల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించి సంఘాన్ని విస్తృతపరచాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఎం.రాములు, కె.రాజునాయక్, లింగమయ్య, సి.యాదయ్య, సిబి చంద్రయ్య, బాలకృష్ణయ్య, యశోద, యాదమ్మలు పాల్గొన్నారు.

## రైతులందరితో ‘చలో’ కన్నెపల్లి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లను తక్షణమే ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే కెసిఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి కన్నెపల్లికి కదులుతామని, మోటర్లను ఆన్ చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం గేట్లు తెరచి ఉన్నప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లు ఆన్ చేసి నీళ్లు తీసుకునే అవకాశం ఉందని, రోజుకు రెండు టిఎంసిల నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి తెచ్చుకునే అవకాశం ఉందని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత మదుసూధనాచారి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, గొంగిడి సునీతతో ఆదివారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం మోటర్లను ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు కోసం 65 టిఎంసిలను సిఎం రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేశారని ఆరోపించారు. కృష్ణ నీళ్లను ఆంధ్రకు వదిలిపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ జిల్లాలో క్రాప్ హాలిడే ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్లు వదిలారని, ఈసారి కూడా ఆంధ్రకు నీళ్ళొదిలే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి ప్రాజెక్టు మోటర్లు ప్రారంభించకపోతే వేలాదిమంది రైతులతో ప్రాజెక్టు వద్దకి వెళ్లి మోటర్లు ఆన్ చేసే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. కాళేశ్వరాన్ని పక్కకు పెట్టి రాజకీయాలు చేయాలని అనుకుంటే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించబోరని హరీశ్‌రావు హెచ్చరించారు.

## నిరాశా నిస్పృహలతోనే బిఆర్ఎస్ నేతల వాఖ్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నాయకులు పోటీపడి ప్రెస్ మీట్‌లు పెట్టి మాట్లడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల సంక్షేమ లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నేతల నిరాధార ఆరోణలు చేయడం చూస్తుంటే వారు పూర్తిగా నిరాశ నిస్పృహకు లోనైనట్లు స్పష్టమవుతోందన్నారు. బిఆర్ఎస్ నేతలు చేసిన పలు ఆరోపణలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తిప్పి కొట్టారు. బిఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శిక్షలు వేస్తున్నారని ఆపార్టీ నేతలు పేర్కొన్నడం సిగ్గుచేట్టాన్నారు. మా ప్రభుత్వం అధికారం చేపట్టిన ఒకటిన్నర సంవత్సరంలోనే రూ.1.03లక్షల కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేసి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలించిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతులకు దిగుబడులు పెరగడమే కాకుండా అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని, దీనితో పల్లెల్లో సంతోషం వెల్లివిరుస్తుంటే బిఆర్ఎస్ కళ్ళల్లో నాయకులకు కళ్ళల్లో కారం కొట్టినట్లుందని మంత్రి పేర్కొన్నారు. దానితో వారు అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమం పట్టని, కనీసం ఆలోచన చేయని నాయకులు కూడా ఈ రోజు వ్యవసాయం, రైతులు, ఎరువులు, నీళ్లు అని మాట్లాడడం చూస్తుంటే వారంతా నిస్పృహలో ఉన్నారో తెలంగాణ సమాజం ఈపాటికి అర్థమైందన్నారు. ధనిక రాష్ట్రంగా వున్న సమయంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని 4 దఫాలుగా, చేయడంతో అది కాస్త వడ్డీలకు కూడ సరిపోలేదని, అలాంటింది తమ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల వరకు ఏకమొత్తంగా చెల్లించి రైతులను రుణాల నుంచి విముక్తి చేసిందన్నారు. గతంలో బిఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతు బంధుతో పాటు గత రెండు పంట కాలాలలో రూ.13500 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని, ఈసారి 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుభరోసా నిధులు జమ చేయడంతో తమ రాజకీయ జీవితానికి తెలంగాణ సమాజం ఎక్కడ చరమగీతం పాడతారో అని నోటికి వచ్చిన తీరున బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సామాజిక న్యాయసమరభేరి విజయవంతం

# రాష్ట్ర కాంగి‘రేస్’లో జోష్

ఇ.చంద్రశేఖర్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెండు రోజుల కింద నిర్వహించిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం ‘సామాజిక న్యాయసమరభేరి’ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నయా జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణను చేపట్టడం, బిసి రిజర్వేషన్‌పై అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి రాష్ట్రపతికి పంపించడం, ఇవే అంశాలు ఎజెండాగా ఎల్‌బి స్టేడియంలో జరిగిన సభ ద్వారా ‘సామాజిక న్యాయం’ నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ సక్సెస్ అయిందని చెప్పవచ్చు. దాదాపు పదేళ్ల పాటు అనేక ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి, క్షేత్రస్థాయి నాయకత్వానికి సమరభేరి సభ జవసత్వాలను కలిగించింది. పార్టీ శ్రేణుల్లో మానసిక ధైర్యం పెంపొందించిందనిపిస్తోంది. సామాజిక న్యాయం అంశంపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రజలలో చర్చ జరుగుతున్నప్పటికీ కాంగ్రెస్ సభతో ఆ చర్చ తారాస్థాయికి చేరింది. చివరకు ఒక రాజకీయ పార్టీలో అంతర్గత పదవి అయిన పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బిసిలకు ఇవ్వలేదని, ఉన్నత వర్గాలకు చెందిన వారికి కట్టబెట్టారని తీవ్రస్థాయిలో విమర్శలు చేసే స్థాయికి ఈ ‘సామాజిక న్యాయం’ చర్చ చేరింది.

కాంగ్రెస్ శ్రేణుల విషయానికి వస్తే ‘సామాజిక న్యాయ సమర భేరి’ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో కాంగ్రెస్ నూతనోత్సాహాన్ని కలిగించింది. సుమారు 15 వేల మందితో సభ నిర్వహించాలని టిపిసిసి భావించినప్పటికీ, 50 వేలకు పైగా కాంగ్రెస్ గ్రామ స్థాయి నేతలు తరలిరావడం గమనార్హం. సభలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉపన్యాసాలు పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉత్తేజపరిచాయి. ప్రజల సమస్యలు, సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ నిబద్ధతను వారు స్పష్టంగా వ్యక్తీకరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను మానసికంగా సన్నద్ధం చేసింది. ఈ సభ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని, నైతిక బలాన్ని మరోసారి రుజువు చేసినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు.

ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రసంగంతో పార్టీ నేతలను, కార్యకర్తలను ఉర్రూతలూగించారు. ‘‘వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపి సీట్లు పెరగబోతున్నాయి. వచ్చే ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. అందులో ఒక్క సీటు తక్కువ వచ్చినా నాదే బాధ్యత. లోక్‌సభ ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు తప్పకుండా గెలుస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల పోరులో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నేను తీసుకుంటాను. ప్రజాసంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రభుత్వం తరపున ప్రచారకర్తలుగా మారాలి’’ అని స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో దాదాపు పదేళ్ల పాటు అనేక ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి, క్షేత్రస్థాయి నాయకత్వానికి మానసిక ధైర్యం మరింత పెరిగింది. సిఎం ప్రసంగం వారికి తమ రాజకీయ భవిష్యత్‌పై ఆశలను చిగురింపజేశాయి. సభలో సిఎం రేవంత్‌రెడ్డి మాటలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఒక్కసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గుర్తుకొచ్చారు. 2004కు ముందు సుమారు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడును అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన సందర్భాలను పార్టీ శ్రేణులు గుర్తు చేసుకున్నారు. అప్పుడు కూడా ‘ఏపిలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసకువచ్చే బాధ్యత నాదే’ అని ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీకి స్పష్టంగా చెప్పడమే కాకుండా, ఆచరణ సాధ్యం చేసిన వై.ఎస్ పట్టుదలను తిరిగి రేవంత్‌రెడ్డిలో చూస్తున్నామని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

‘జై బాపు, జై భీం, జై సంవిధాన్’ పేరుతో ప్రజల వద్దకు వెళ్లాలని ఎఐసిసి అగ్రనేత మల్లిఖార్జున్ ఖర్గే పిలుపునివ్వడం ద్వారా దళితులు, బడుగు బలహీనవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం పార్టీ కార్యకర్తలేనని, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితర నాయకులందరూ కలిసి కట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని పార్టీ అధిష్టానం పెద్దాయన ఖర్గే ప్రశంసించడం పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలలో సంతోషాన్ని కలిగించింది.


‘‘దేశంలో ప్రస్తుతం ఒక సైద్ధాంతిక పోరాటం జరుగుతుంది. రాజ్యాంగాన్ని రక్షించాలని కాంగ్రెస్, ఇండియా కూటమి ఒక పక్కన, రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఎన్‌డిఎ కూటమి మరో పక్కన పోరాటం చేస్తున్నాయి’’ అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించి వచ్చే ఎన్నికల్లో బిజెపితో సైద్ధాంతిక యుద్దానికి ఇప్పటి నుంచే కాంగ్రెస్ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ ‘సామాజిక సమర భేరి సభ’ ఒక వైపు రాష్ట్రంలో సామాజిక న్యాయంపై చర్చను తారాస్థాయికి తీసుకుపోవడంతో పాటు పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉండి నిరుత్సాహంలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు ఊతమిచ్చిందని చెప్పవచ్చు.




# సాహితీ విహారి

# పాలస్తీనియన్ల కన్నీళ్లే కనాఫానీ సిరా!

కేవలం 36 సంవత్సరాల వయసులోనే పాలస్తీనా ప్రజల తరఫున పోరాడుతూ హత్యకు గురైన ఘసన్ కనాఫానీ గ్రాఫితి గొప్ప నాయకుడేకాదు... ప్రతిభావంతుడైన రచయిత కూడా. 1936, ఏప్రిల్ 9న జన్మించిన కనాఫానీ జర్నలిస్టుగా, ఉద్యమకారుడిగా అతను ప్రజాగొంతుకై, పాలస్తీనా విమోచనం కోసం పరితపించాడు. 1972 జులై 8న, ఇజ్రాయెలీ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్ అతనిని బీరూట్‌లో ఓ కారు బాంబు పేల్చి హత్యచేయించింది. 'పాపులర్ ఫ్రంట్ ఫర్ ద లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా' పేరుతో అతను నడిపించిన ఉద్యమం స్ఫూర్తిని మాత్రం ఇజ్రాయెల్ అణచివేయలేకపోయింది. ఇప్పటికీ స్వేచ్ఛకోసం.. అణచివేత నుంచి విముక్తికోసం పాలస్తీనా అలుపెరుగని పోరాటం సాగిస్తునే ఉంది. పాలస్తీనా ప్రజల ప్రతినిధిగా, విప్లవ రచయితగా, జర్నలిస్ట్‌గా, ఉద్యమకారుడిగా 20వ శతాబ్దపు అరబ్–ఇజ్రాయెల్ సంక్షోభ సమయంలో కీలక పాత్ర పోషించిన ప్రగతిశీల సాహితీవేత్తగా కనాఫానీ శతాబ్దాలకు సరపడా కీర్తిని ఆర్జించాడు. కనాఫానీ పేరు విన్న వెంటనే, రెండు భావాలు మెదడులో మెరుస్తాయి. ఒకటి పాలస్తీనా బాధ.. మరొకటి ప్రతిఘటన హోరు. రచయితగా అతని స్వరాలు మౌనంగా వినిపించినవే అయినా, ప్రపంచాన్ని కదిలించాయి. కాల్పుల నుంచి కళకు, నిరాశ నుంచి నిరూపణకు, ఆయన కథలు పాలస్తీనా ప్రజల జీవించి ఉన్న పోరాటాలను విశ్వమానవ గాథలుగా మలిచాయి. బ్రిటిష్ పాలస్తీన్ (ఇప్పటి ఇజ్రాయెల్)లో బలవంతపు తరలింపు కాలం (నక్బా)లో జన్మించిన కనాఫానీ విద్య సిరియా, బీరూట్‌లలో కొనసాగింది. వ్యవసాయ ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా ఎదిగిన అతను, పాలస్తీనా ప్రజల గొంతుకై ప్రపంచానికి వినిపించాడు. కనాఫానీ రచనలు పాలస్తీనా నిరాశ, దేశచ్యుత, ప్రవాస జీవిత దుఃఖాలు మరియు తిరుగుబాటును ప్రతిబింబిస్తాయి. అతని కథలు మార్మికంగా, అభివ్యక్తిపూర్వకంగా సామాన్య పాలస్తీనా జీవిని ప్రపంచానికి పరిచయం చేస్తాయి. కనాఫాని రచనలు ఎక్కువగా కథలు, నవలలు అయినా, అవి కవిత్వంతో కూడిన రాజకీయ పదబంధాలుగా గోచరిస్తాయి. వాటిలో, లౌకిక ఉదాహరణలతో లోతైన సందేశాలు ఉంటాయి. ప్రత్యక్షంగా రాజకీయ ప్రసంగం కాక, పరోక్షంగా పాత్రల మార్పు ద్వారా సిద్ధాంత బోధ కనిపిస్తుంది. మార్మిక ముగింపులు, మానవ సంబంధాల భిన్న కోణాలు, జ్ఞాపకాల రాజకీయ శాస్త్రం, అనుభవాల ఆధారంగా రాజకీయ తీర్మానాల విశ్లేషణలు అతనిని ప్రపంచ మేటి రచయితల జాబితాలో చేర్చాయి. కనాఫానీ రచనలు కేవలం పాఠకుల మానసికోల్లాసానికికాక, ఉద్యమానికి ఆయుధంగా ఉండాలన్న తపనతో రాసినవే. అతడు అభివృద్ధి చేసిన 'ప్రతిఘటన సాహిత్యం' (రెసిస్టెన్స్ లిటరేచర్) అనే భావన, పాలస్తీనా రచనలను విశ్వవేదికపై ప్రత్యేక స్థానంలో నిలబెట్టింది. అందుకే అతని రచనలు బాధను కవిత్వంగా, నిరాశను ప్రేరణగా మలిచాయి. కొందరు విమర్శకుల అభిప్రాయం ప్రకారం కనాఫానీ కథల్లో కొన్నిసార్లు భావోద్వేగం రాజకీయ ప్రకటనకంటే ఎక్కువగా మారుతుంది. కానీ అతడి రచనల విలువ, సాహిత్య సామర్థ్యం కాలంతో ముడిపడి, పాఠకుల్ని మౌనంగా తిరుగుబాటుకు ప్రేరేపించగలిగింది. అరబ్ సాహిత్య ప్రపంచంలో నగ్న నిజాలు రాసిన మొదటి విప్లవ రచయిత కనాఫానీ. అతని రచనలు పాలస్తీనా భూమి కన్నా ఎక్కువగా పాలస్తీనా హృదయాన్ని ప్రతిబింబించాయి. కనాఫానీని కలుషిత గాలుల్లోకి బలవంతంగా నెట్టివేసిన ఆధిపత్య రాజకీయాలు, ఆయన రచనలు మాత్రం నేటికీ స్వేచ్ఛ కోసం శ్వాస తీసుకుంటున్నాయి. కనాఫానీ రచనలు పాలస్తీనా భవిష్యత్తు కోసం సాగిన సాహిత్య విప్లవానికి ప్రతీకలు. ఆయన అత్యంత ప్రఖ్యాత కథ 'మెన్ ఇన్ ది సన్' (1963)లో ప్రచురితమైంది. దీనిని 'ఒక దహించే మౌనం'గా పేర్కొంటారు. ఈ కథలో ముగ్గురు పాలస్తీనా శరణార్థులు, తమ భవిష్యత్తు కోసం బస్రా (ఇరాక్) నుండి కువైట్ (ఆర్థిక వనరుల రాష్ట్రం)కి అక్రమంగా ప్రయాణించాలనుకుంటారు. వారిని డ్రైవర్ ట్యాంకర్‌లో దాచి తీసుకెళతాడు. గమ్యం చేరేలోపే ముగ్గురూ హీట్‌స్ట్రోక్ వల్ల చనిపోతారు.






ఈ కథ మానవ స్వభావాన్ని, నిరాశను, ఉద్యమంలో తమకంటూ ప్రత్యేక గళంలేని ప్రజల వ్యథను తేటతెల్లం చేస్తుంది. శరణార్థుల అనుభవాలు, దేశంలో చోటు కోల్పోయిన వారి జీవన పరిస్థితులు, చైతన్యం లేకపోతే ఎదురయ్యే సమస్యలను కనాఫానీ ఈ కథలో నర్మగర్భంగా వివరిస్తాడు. ట్యాంకర్‌లో ఊపిరి ఆడనప్పుడు, లోపలి నుంచి కనీసం ఎందుకు శబ్దాలు చేయలేదు? ఎందుకు డ్రైవర్ దృష్టిని తమవైపు తిప్పుకోలేదు? అనే ప్రశ్నలతో కథను ముగించడం ద్వారా, మౌనం పాలస్తీనా ప్రజలకు మరణ శాసనమైందన్న వాస్తవాన్ని వెల్లడిస్తాడు. అతను ఈ కథ రాసి 60 సంవత్సరాలు గడిచినా, పాలస్తీనియన్ల జీవిత ట్యాంక్ ఇంకా వేడిగా ఉంది. ప్రజలు ఇంకా శోధనలో ఉన్నారు. మరణమంటే శరీర మరణం ఒక్కటేకాదు.. ఆశలు, కలలు, స్వరాలను నశింపజేసే మౌనం కూడా. 'మెన్ ఇన్ ది సన్' ఒక రాజకీయ దస్తావేజుగా కాకుండా, ఒక విలాప గీతంలా ఉంది. కనాఫానీ తన ప్రజల జీవన సత్యాన్ని ప్రపంచానికి వినిపించేందుకు సాహిత్యాన్ని మాధ్యమంగా ఎంచుకున్నాడు. కష్టాలకు అక్షర రూపమిచ్చాడు. అతని 'రిటర్న్ టు హైఫా' (1969) అనే నవల పాలస్తీనా ప్రజల నిరాశ, బాధ, శరణార్థ జీవితం మీద అత్యంత సంక్లిష్టమైన రాజకీయ, మానవీయ, తాత్త్విక స్థాయిలలో స్పందించగలిగే శక్తివంతమైన రచన. ఈ కథ పునరాగమనం అనే ఆలోచనను కేవలం భౌగోళికంగా కాకుండా మానసికంగా, మానవ సంబంధాల పరంగా, చారిత్రికమైన గాయాల పరంగా అన్వయిస్తుంది. ఈ రచనలో ప్రధానంగా వ్యక్తిగత బాధ, సామూహిక వ్యథ మధ్య ఉన్న సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించాడు. కథలో సయీద్, సఫియా అనే దంపతులు 1948 లో 'నక్బా' సమయంలో హైఫా నుండి తరలిపోవాల్సి వచ్చి, తమ చిన్నారి కుమారుడు ఖల్దూన్‌ను నిర్బంధిత స్థితిలో వదిలిపెట్టి వెళ్ళిపోతారు. 20 ఏళ్ల తర్వాత ఇజ్రాయిల్ అధికారుల అనుమతితో తిరిగి హైఫాకు వస్తారు. ఆ ఇంట్లో ఇప్పుడు మిరియం అనే యూదు మహిళ నివసిస్తోంది. ఖల్దూన్‌ను ఆమె పెంచుతుంది. ఖల్దూన్ పేరు ఇప్పుడు డోవ్, అతను ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్నాడు. ఇక్కడే కథ న్యూట్రల్ గుండా భౌగోళిక స్థలాన్ని అల్లుకొని, మానవ సంబంధాలలోని దుర్విద్రోహాన్ని మానవతా శూన్యతగా చూపిస్తుంది. సయీద్, సఫియా అనుభవించే వ్యక్తిగత వేదన అత్యంత హృదయవిదారకమైనది. తాము వదిలిపెట్టిన బిడ్డ ఇప్పుడు తమను గుర్తించకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతారు. తాము మానవత్వం కోల్పోయామని, బిడ్డను మళ్ళీ సంపాదించలేమని, కాలం దాని దారి ఎంచుకుంటుందని అంగీకరించాల్సి వస్తుంది. చరిత్ర వీరికి, అంతకు మించిన ఎంపికలు లేకుండా నియంత్రిస్తుంది. ఇది వ్యక్తిగత బాధ. అదే సమయంలో నక్బా (పాలస్తీనా ప్రజల భూములనుండి బలవంతపు తరలింపు) తరం పాలస్తీనా శరణార్థుల గాయాలకు అద్దం పడుతుంది. ఈ కథలో సయీద్ దంపతుల వేదనను వేదనగా మాత్రమే కాక, పాలస్తీనా ప్రజల సామూహిక బాధగా కూడా చూడాలి. డోవ్ (ఖల్దూన్) దృష్టిలో తల్లిదండ్రులు తనను వితడిచిపెట్టారు. ఏమైపోయాడోనని కూడా చూడలేదు. ఇప్పుడు తిరిగి వచ్చే అధికారం వారికి లేదు. సయీద్ దంపతులు ఒకవైపు, బిడ్డపై మమకారాన్ని చంపుకోలేకపోతారు. మరోవైపు ఆ బిడ్డపై అధికారాన్ని ప్రకటించుకోలేకపోతారు. 'కుమారుడ్ని నిందించాలా? మేము తిరిగి రావడం సరైనదేనా?' అనే సందిగ్ధం సయీద్‌ను వెంటాడుతుంది. ఎవరి దృష్టికోణం వారిది. అయితే, వారిని విడదీసింది పాలస్తీనా అనుభవిస్తున్న హృదయవిదారక పరిస్థితులే అన్నది నిజం. పాలస్తీనా తరం తమ బాధను ఎలా నిర్వచించాలి? నైతికంగా ఎవరు బాధ్యులు? అని రచయిత కనాఫానీ ప్రపంచాన్ని నిలదీస్తాడు. బాధకు ఒకే ఒక రూపం అంటూ ఏదీ ఉండదు. అది తరతరాల వారసత్వం. సయీద్ చివరికి గమ్యానికి చేరుకోడు. అతడి తిరిగి రావడం అనేది ఒక శారీరక ప్రయాణం కాదు, ఆత్మగౌరవానికి పునర్మూల్యాంకనం. అతడి పునరాగమనం యుద్ధంలో పోరాడే తన రెండవ కొడుకుపై ఆశతో ముగుస్తుంది. 'గతాన్ని తిరిగి పొందలేం. కానీ బాధతో జీవించి, భవిష్యత్తును మలచవచ్చు' అనే సంకేతాన్ని పాఠకులకు రచయిత ఇస్తాడు. కనాఫానీ రచించిన అత్యంత ప్రాచుర్యం పొందిన శక్తివంతమైన చిన్న కథలలో 'ది లాండ్ ఆఫ్ శాడ్ ఆరెంజెస్' (1958) ఒకటి. ఈ కథ 1948 నక్బా తరువాత ఒక పాలస్తీనా కుటుంబం జీవితాన్ని చూపిస్తుంది. స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్ల జ్ఞాపకశక్తిని కోల్పోతుండగా, మగవారు తమ బాధను అణచుకుంటూ గర్వంగా జీవించాలా, లేక భయంగా పారిపోవాలా? అనే తాత్వికమైన చర్చలతో నిండిన కథ ఇది. ఇది ఒక బాలుడి గుర్తుల రూపంలో మనముందుకు వస్తుంది. కథలో 'ఆరెంజ్' (నారింజ) పండు ఒక సస్యశ్యామలమైన భూమికి ప్రతీక. కానీ, అదే పండు విషాదాన్ని మోస్తూ, పాలస్తీనా గ్రామాల బలవంతపు విడిపోయే దుస్థితిని సూచిస్తుంది. ఇది నక్బా సమయంలో ప్రజలు తమ భూములను ఎలా కోల్పోయారో వివరిస్తుంది. ఒక బాలుడి కళ్ల ఆధారంగానే రచయిత కథను ముందుకు నడిపిస్తాడు. అందుకే, ప్రజల తపన, భయం, గౌరవం, అవమానం అన్నీ శబ్దాలూ, దృశ్యాల రూపంలో వస్తాయి. ఆ బాలుడి కళ్లు అప్పుడే వయసు మీరిన వారి మాదిరి భయంతో నిండిపోతాయి. ఈ బాలుడు పాలస్తీనా తరం భవిష్యత్తుకే ప్రతీక. ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కుటుంబాలు క్రమంగా పతనం కావడంతో, ఆయా కుటుంబాల్లోని పెద్దలు, తాతలు, తండ్రులు భవిష్యత్తులో పిల్లలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితిని ఎదుర్కొంటారు. ఇది బాధను మౌనంగా మోసుకుంటున్న తరం అనుభవించే శూన్యత.. అంత ర్లీనంగా దాగివుండే రోదన. నారింజ పండ్లను అవి పండే భూమికి ప్రాణంగా చూపిస్తాడు రచయిత. కానీ, అవి ఇప్పుడు పండిన పళ్ళు కాదు, తల్లడిల్లే ప్రాణాల గుర్తులు. ఆ తోటలు తేనెలాంటి గంధాన్ని కాదు.. శోకంతో అల్లాడుతున్న ప్రజల నెత్తుటి వాసనను వెదజల్లుతున్నది. ఈ భూములు పండించే ఆరెంజ్‌లు ఇక పండ్లుగాకాక, ఒక జాతి భవిష్యత్తుకు గుర్తుగా నిలుస్తాయి. పాలస్తీనా కుటుంబాలు, పక్క దేశాలలో శరణార్థులుగా ఆశ్రయం పొందే ప్రయాణాన్ని ఈ కథ సున్నితంగా చిత్రిస్తుంది. పారిపోవడమా? లేక అణచివేతను ఎదుర్కొని పోరాడడమా? తేల్చుకోవాలంటూ, రక్తం కక్కిన నిజాలను మౌనంగా వినిపించేలా నవల సాగుతుంది. మధురమైన ఊహల్ని, పూర్వ జ్ఞాపకాలను ఒకవైపు, విచారాలను, విషాదాలను, వ్యధలను మరోవైపు ఉపమానంగా 'ఆరెంజ్'లు నిలుస్తాయి. 'ది లాండ్ ఆఫ్ శాడ్ ఆరెంజెస్' కథ చిన్నదే. అయితేనేం, పాలస్తీనా దుర్గతి, నిరాశ, పరవశత్వాన్ని ఆలోచింపజేస్తుంది. ఇది వ్యక్తిగత బాధలేగాక, సామూహిక ఆత్మగౌరవం పరిస్థితుల ఉచ్చులో చిక్కుకొని ఎలా బిగుసుకుపోయిందో తెలిపే కథ. మౌనం నెత్తిన వేసిన పొగమంచుగా ఉండి, కథ అంతా చీకటిలో ప్రయాణం చేసేలా చేస్తుంది. కనాఫానీ ఈ కథ ద్వారా 'మేము ఎక్కడికి వెళ్లాం?', 'మేము ఎందుకు, ఎలా వెళ్లాం?' అని ప్రశ్నిస్తాడు. ఇలా ఏ కథ చదవినా, అందులో పాలస్తీనియన్ల వేదనాభరితమైన జీవితాలే పాత్రలై కళ్ల ముందు కదలాడుతాయి. జనం జీవితాలనే కథావస్తువులుగా మలచుకొని కనాఫానీ చెక్కిన ప్రతి కథా ఒక జీవితమే.

– సత్యశ్రీ


## కాలాతీత కవిత

### 'ఇన్‌విక్టస్'



విలియమ్ ఎర్నెస్ట్ హెన్లీ రచించిన 'ఇన్‌విక్టస్' (Invictus) అనే లాటిన్ పదానికి 'అజేయుడు' లేదా 'ఓడించడానికి సాధ్యంకాని వాడు' అని అర్థం. స్వీయానుభవాల నేపథ్యంలో హెన్లీ రాసిన ఈ కవిత ఓ అజేయ వ్యక్తి ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. బ్రిటన్ దేశానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు, సంపాదకుడు హెన్లీ (1849–1903) చిన్న వయసులోనే హెన్లీ తండ్రిని కోల్పోయాడు. ఎముకకు సోకిన క్షయవ్యాధి కారణంగా వైద్యులు హెన్రీ ఒక కాలును తొలగించారు. తీవ్రమైన శారీరక, మానసిక బాధల మధ్య, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు అతను రాసిన 'ఇన్‌విక్టస్' కవిత, సమాజంలోని అణగారిన గొంతుకలకు ధైర్యాన్నిచ్చిన మంత్రం. ఇందులోని నాలుగు స్టాంజాలు లేదా చరణాలు అంతులేని ఆత్మవిశ్వాసానికి ప్రతీకలు. మొదటి పంక్తిలోనే ప్రయోగించిన 'రాత్రి' అనే పదం జీవితంలోని అంధకార దశలకు, నిరాశకు, శోకానికి సంకేతం.

Out of the night that covers me,
Black as the Pit from pole to pole,
I thank whatever gods may be
For my unconquerable soul.


INVICTUS

Out of the night that covers me,
Black as the Pit from pole to pole,
I thank whatever gods may be
For my unconquerable soul.

In the fell clutch of circumstance
I have not winced nor cried aloud.
Under the bludgeonings of chance
My head is bloody, but unbowed.

Beyond this place of wrath and tears
Looms but the Horror of the shade,
And yet the menace of the years
Finds, and shall find, me unafraid.

It matters not how strait the gate,
How charged with punishments the scroll,
I am the master of my fate:
I am the captain of my soul.

William Ernest Henley

అంటాడు కవి. చుట్టూ ఆవరించిన చీకటిని ప్రస్తావిస్తూ, అతను వాడిన 'Black as the Pit' అనే ఉపమానం దారుణమైన బాధను సూచిస్తుంది. అయినప్పటికీ కవి తన అజేయ ఆత్మశక్తిని కృతజ్ఞతలు చెప్పడం అతనికి దేవం మీద కాదు.. ఆత్మసాక్షి పైనే విశ్వాసం ఎక్కువనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. అతని ఆత్మనిశ్చయానికి ఇది ప్రతీక. రెండో చరణంలో..

In the fell clutch of circumstance
I have not winced nor cried aloud.
Under the bludgeonings of chance
My head is bloody, but unbowed

అంటూ, జీవితంలో పరిస్థితులు ఎన్ని దెబ్బలు కొట్టినా, తాను బాధను వ్యక్తం చేయలేదని అనడం ద్వారా, ఎలాంటి దుస్థితిలో చిక్కుకున్నప్పటికీ, ఆత్మస్థైర్యాన్ని వీడేది లేదని స్పష్టం చేస్తాడు. ఇందులో 'My head is bloody, but unbowed' (నా తల రక్తం కారుతుండవచ్చు... కానీ వంచలేదు) అనేది ఎంతో ప్రాచుర్యం పొందిన, సాహసాన్ని చాటే నానుడిగా మారింది. ఇది మనం ఎన్ని కష్టాలకైనా తల వంచకుండా నిలబడవచ్చుననే పరిస్థితులపై మనిషి ఆధిపత్యానికి సంకేతం.
ఇక మూడో చరణంలో..

Beyond this place of wrath and tears
Looms but the Horror of the shade,
And yet the menace of the years
Finds and shall find me unafraid

అంటాడు హెన్లీ. ఇక్కడ 'place of wrath and tears' అంటే భూమిలోని బాధలు, కష్టాలు. 'Horror of the shade' అనేది మరణ భయాన్ని సూచిస్తుంది. అయినా కూడా కవి భవిష్యత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేస్తాడు. తాను నిర్భయుడినని చాటుకుంటాడు. భయం లేని జీవన దృక్పథాన్ని ఈ చరణం మనకు గుర్తుచేస్తుంది. ఇక చివరిదైన నాలుగో చరణంలో..

It matters not how strait the gate,
How charged with punishments the scroll,
I am the master of my fate
I am the captain of my soul


అంటూ, తన నిర్భీతిని మరోసారి చాటుకుంటాడు. 'I am the master of my fate.. I am the captain of my soul' అనడం ద్వారా, విధిరాతను, విధాత ఉనికిని ప్రశ్నిస్తాడు. తన రాతను తానే రాసుకుంటానని, తన జీవితాన్ని తానే నడిపించుకుంటానని తెగేసి చెప్తాడు. మన జీవితానికి మనమే నాయకులం... మన బతుకుపై ఇతరుల అధికారం ఉండకూడదని ప్రకటిస్తాడు. బాధలోనూ తల వంచని వికసిత మనోభావం అతని కవితలో ఆవిష్కృతమవుతుంది. ఈ కవిత నైతిక తాత్వికత (Moral Philosophy), నైతిక బాధ్యత (Moral Responsibility), జీవితం మీద వ్యక్తిగత హక్కు (Existential Choice) వంటి అంశాలను ప్రస్తావిస్తుంది. ఎలాంటి కష్టాలు ఎదురైనా, ధైర్యాన్ని వీడనని, తలవంచి బానిసగా ఉండబోనని హెన్లీ స్పష్టం చేసిన తీరు ఆంగ్ల సాహిత్యంలో పెనుతుపాను రేపింది. జాత్యహంకారానికి వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో ఆందోళన చేసిన నెల్సన్ మండేలాను అక్కడి ప్రభుత్వం సంవత్సరాల తరబడి జైల్లో ఉంచారు. కారాగారంలో ఉన్నప్పుడు ఆయన 'ఇన్‌విక్టస్' కవితను పలుమార్లు చెదివేవాడని అంటారు. ముఖ్యంగా చివరి రెండు పంక్తులు మండేలాలో ఆత్మవిశ్వాసాన్ని, లక్ష్యం చేరాలన్న పట్టుదలను పెంచాయని చెప్తారు. ఈ కవితను సైనికులు, వీరులు తమలో ధైర్యాన్ని నూరుకునేందుకు వినేవారు. దీని భావం వారికి ఆయుధమైంది. ఈ కవితకు ఆధునిక కాలంలో కూడా ఎంతో ప్రాసంగిత ఉంది. విద్యార్థులకు పరీక్షలు, ఒత్తిడులు మధ్యలో తల వంచకుండా నిలబడే శక్తినిస్తుంది. వ్యాపారులకు అనుకోని నష్టాలు, అపజయాలు ఎదురైనా, తమ ప్రయత్నాలను విరమించకుండా ముందుకెళ్లే ఉద్దీపనగా నిలుస్తుంది. రొజువారీ సమస్యలు ఎదురైనప్పటికీ, ఆత్మ ధైర్యాన్ని నమ్మిన ప్రతి ఒక్కరూ ఈ కవితను చవిదితీరాలి. ఇంగ్లీష్ కవితల పాశ్చాత్య భావజాలాన్ని తెలుగు లోకి తర్జుమా చేయటం సవాలుగా మారుతుంది. అయినా ఇందులోని ప్రధాన ఉద్దేశం 'జీవితం ఎలాంటి దెబ్బలు కొట్టినా మనం మానకూడదు' అన్ని భాషల్లో సామాన్య మానవునికి వర్తిస్తుంది. తన జీవిత మార్గాన్ని, గమ్యాన్ని తానే నిర్ధారించుకుంటానని చివరిలో చేసిన వ్యాఖ్య ఎంతటి పిరికివారిలోనైనా, అంతులేని ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. పరిస్థితులతో పోరాడే శక్తిని అందిస్తుంది. అందుకే, 'ఇన్‌విక్టస్' ఒక సాధారణ కవిత కాదు. ఒక జీవితం... .ఒక స్ఫూర్తి.... ఒక విప్లవం. అందులోని ప్రతి పంక్తి మానవ అజేయతకు చిహ్నం. హెన్లీ తన జీవితంలో ఎదురైన నరకానుభవాలపై మనిషి ఎలా గెలవగలడో తన కవిత ద్వారా చూపించాడు. I am the captain of my soul అన్నది చిరస్థాయిగా నిలిచిపోయే వాక్యం. ఈ ఒక్క పంక్తి మానవ చరిత్రలో వేలమంది జీవితాల్లో వెలుగునిచ్చిన దీపంలా నిలిచింది. జీవితంలో ఏదైనా అడ్డంకిగా నిలిచినా, ఓ దారుణమైన చీకటి దశలో ఉన్నా... ఈ కవితను చదివితేచాలు.. ఇది ఒక దీపంలా మార్గం చూపుతుంది. ఒక బలవంతమైన ఆయుధంగా మారి, భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. అందుకే ఇది కలాతీత కవిత్వమైంది.

## చదవాల్సిన పుస్తకం

### వీర తెలంగాణా

### నా అనుభవాలు... జ్ఞాపకాలు

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ పోరాట ప్రముఖుడు, ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా సేవలు అందించిన మానవతావాది రావి నారాయణ రెడ్డి జీవన యాత్రను గుర్తుచేసే పుస్తకం. ఆయన రచయిత కావడంతో, ఊహాగానాలకు, అతిశయోక్తులకు తావులేకుండా, సమాచారం ముక్కుసూటిగా ఉంటుంది. 1908 జూన్ 5న జన్మించిన రావి నారాయణ రెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంగానీ, పరిచయం చేయాల్సిన ఆగత్యంగానీ ఉండవు. నిజాం ప్రభుత్వం మీద ఆయన చేసిన సాయుధ పోరాటం చిరస్మరణీయం. 1946–48 కాలంలో హైదరాబాదు సంస్థానంలో నిజాం పోలీసుల దాష్టీకానికి, మతదురహంకారులైన రజాకార్ల ఆగడాలను అరికట్టడ్డడానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటుచేసినారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌పై పోటీచేసి నెహ్రూకన్నా అధిక ఓట్లతో గెలిచి పార్లమెంటరీ రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన ఖ్యాతి ఆయనకే దక్కింది. గాంధీ, మావో, హోచిమిన్, కృశ్చేవ్‌లను స్వయంగా కలిసిన సమరశీలి. 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరకముందు సుమారు 11 ఏళ్లపాటు ఆయన 'సామాజిక న్యాయం' సాధించడానికి శ్రమించారు. 23 ఏళ్ల వయసులో హరిజన సేవాసంఘాన్ని నెలకొల్పి దాని ప్రధాన కార్య దర్శి హోదాలో హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలలు ప్రారంభించారు. రెండు వసతి గృహాలను నిర్వహించారు. నల్లగొండ జిల్లా భువనగిరి పట్టణ సమీపంలోని బొల్లేపల్లి గ్రామంలో 1908 జూన్ 5న భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రావి నారాయణరెడ్డి ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజాపోరాటానికి చూపునిచ్చిన జననేతగా ప్రసిద్ధుడు. భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాటు ఉద్యమంలో నిజామాంధ్ర మహాసభలోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టుగా ఆయన ఆచరణ అతి విశిష్టమైనది. ప్రజాజీవితంలో ఉన్న నాయకులు ఒక కీలకమైన చారిత్రక సన్నివేశంలో సిద్ధాంతపరంగా విభేదించే శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరచి ఏకతాటిపై ఉద్యమాన్ని ఎలా నిర్మించవచ్చో తన ఆచరణ ద్వారా నిరూపించిన ప్రజాస్వామికవాది 'రావి'. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌పై పోటీచేసి నెహ్రూకన్నా అధిక ఓట్లతో గెలిచి పార్లమెంటరీ రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన ఖ్యాతి ఆయనకే దక్కింది. తెలంగాణపై తనదంటూ ఒక బలమైన ముద్ర వేసిన రావి నారాయణ రెడ్డి అనుభవాల చిట్టాను ప్రతి ఒక్కరూ చదవాలి. ఆయన జీవన ప్రస్థానాన్ని, తెలంగాణ పోరాటంలో పోషించిన పాత్రను లోతుగా తెలుసుకోవాలి. 'రావి' గురించి ఇతరులు రాసిన పుస్తకాలతో పోలిస్తే, ఆయనే స్వయంగా గ్రంథస్థం చేసిన అనుభవాలు, జ్ఞాపకాలను చదివడం మంచిది. హైదరాబాద్ సంస్థానం, దాని తీరుతెన్నులు... ప్రజలు ఎదుర్కొన్న అణచివేతల నుంచి వీర తెలంగాణ మాదేనంటూ ప్రజలు నినదించడం వరకూ చోటు చేసుకున్న అనేక పరిణామాల్లో ఆయన ప్రయాణం, అనుభవాలు ఈ పుస్తకంలో మనకు లభిస్తాయి. పోలీస్ చర్య.. తదనంతర పరిస్థితులను ఆయన నెమరువేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాట సిద్ధాంతాలను 'రావి' చేసిన సమీక్ష కూడా ఇందులో ఉంది. తన సోవియట్ యాత్రానుభవాలను కూడా ఆ యన పంచుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితుల నుంచి, ప్రత్యేక తెలంగాణ నినాదం ఉవ్వెత్తున ఎగసిపడుతూ, నిరంతరం ఓ శిఖలా వెలుగుతునే ఉండడానికి కారణాలు ఈ పుస్తకం చదివితేనే తెలుస్తాయి. 'వీర తెలంగాణా నా అనుభవాలు... జ్ఞాపకాలు' పుస్తకం కేవలం 'రావి' స్వగతం మాత్రమేకాదు.. తెలంగాణ చరిత్ర లో ఒక భాగం. 'రావి'ని స్మరించుకోని తెలంగాణ లేదు. తెలంగాణతో మమేకం కాని ఆయన అడుగులు లేవు. ఒక మహా పోరాటయోధుడి అనుభవాల సారమైన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చదవాలి.




### పుస్తకం పేరు

పుస్తకం: రావి నారాయణ రెడ్డి
వీర తెలంగాణ..
నా అనుభవాలు – జ్ఞాపకాలు
వెల: రూ. 110
ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ
(నాగోల్)జిఎస్ఐ (పోస్ట్),
హైదరాబాద్: 500068.
(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్,
సుల్తాన్ బజార్, బండ్లగూడ
(నాగోల్) హైదరాబాద్,
హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ,
ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

ఈ వారం కవితలు

## గువ్వ ఎగిరిపోయింది!!



సందె వేళకు ఎర్రబడ్డ పొద్దు
ఉరిమి ఉరిమి చూస్తుంటే
ప్రళయం ముంగిట్లో వాలినట్టయింది
వేలాడే తీగల మధ్యనే ప్రయాణం
కలుషితమైన గాలిని చీల్చుంకుంటూ
రోజూ తిండికై అన్వేషణ చేయాలి

ఎండిన మోడుతో మొర పెట్టుకుని
కాలిన కట్టెను దాటుకుంటూనే
ఎండిన గింజకై వెంపర్లాడాలి
వస్తూ పోతూ ఎన్ని చిత్రాల్ని చూడాలో
ఎంత ఎత్తుకు ఎగిరి కిందికి చూసినా

శూన్య గోళంలో ఒక్క పచ్చని మొక్క
జాడ కానరాదు
పెద్ద పెద్ద ఇంటి పైకప్పులు
ఆకాశాన్ని నెట్టివేసే లాగా కానొస్తుంటే
వనాల జాడ అన్వేషణకు
ఆయువు సరిపోవడం
లేదు

ధ్వని తరంగాలు రెక్కలకు తగిలి
గమ్యాన్ని ఏమార్చుతున్నాయి
కాంతి కిరణాలు విరుచుకుపడి
కళ్ళను కప్పేస్తున్నాయి

సాంకేతిక నేలపైన ఇమడలేని గువ్వ
ఎప్పుడో ఎగిరిపోయింది
ఉష్ణ మండలం బద్దలు చేస్తూ
ఇనుప కంచెలు నింగిని తాకుతుంటే
వెంటాడే సౌర తుఫాను మధ్యలో
రెక్కలు కాలిన పిట్ట రాలిపోయింది
గువ్వ జాడ కనుమరుగైంది

– నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

## ఓ మనిషీ ఆలోచించు!

ఎప్పుడైనా ఆలోచించావా
మట్టి రేణువుల మధ్యలో వున్నామని
ఏ రోజైనా మననం చేసుకున్నావా
ఏడారి నగరంలో జీవిస్తున్నామని
ఏ పొద్దైనా మనసులో అనుకున్నావా
ప్లాస్టిక్ పేపర్ చుట్టుకుని నిద్రిస్తున్నామని

ఏ సమయమైనా క్షణం ఆగి చూసావా
పొగ గొట్టాలకు వేగం పెంచుతున్నామని
ఏ క్షణమైనా యోచన చేసావా
కాలుష్యాన్ని కౌగిలించుకుంటున్నామని
ఏ ఒక్కసారైనా తల పైకెత్తి చూసావా
చిల్లలు పడిన జల్లెడ పొర కింద వున్నామని

ఏ మనిషినైనా తట్టి లేపావా
ధూళి నిండిన స్థలాన్ని బాగు చేసుకోమని
ఏ దినమైనా అంగలార్చుకున్నావా
చేతులారా గాలిని కలుషితం చేసామని

ఏనాడైనా కనుగొన్నావా
ప్లాస్టిక్ పేపర్‌లో భోంచేస్తున్నామని

ఒక పర్యాయమైనా గుర్తు చేసుకున్నావా
చెట్టు లేని నేల కన్నీటికి కారణం మనమేనని
ఒక్క గడియైనా గమనించగలిగావా
అంతరిస్తున్న అరణ్యానికి సాక్ష్యం మనమని
ఒక్క రాత్రైనా కలగన్నావా
పర్యావరణానికి రక్షణ కరువైపోయిందని

ఒక్క అడుగైనా ముందుకు కదిపినావా
అవగాహన కల్పించే పాఠం నేర్పుదామని
ఒక్క మనిషికైనా బోధన చేసావా
గొడ్డలి పెట్టుకు వృక్షం ఆయువు తీస్తే
స్వచ్ఛమైన ఆక్సిజన్ అందక
నువ్వు కూడా అకాల మరణం పొందుతావని

ఒక్క విద్యార్థికైనా హితబోధ చేసావా
ప్లాస్టిక్ పేపరు వాడకంతో
ఆరోగ్యం ప్రమాదపు అంచుకెళ్ళుతుందని
ఒక్కమారైనా వెనక్కి తిరిగి చూసుకున్నావా
కాలుష్యంలో కాలు కదుపుతున్నామని
ఒక్కసారైనా విలాసాన్ని పక్కకు నెట్టి

వ్యసనాలను ఆవల తోచి
నిద్రావస్థను తట్టి లేపి ఆలోచించినావా
వ్యర్థ పదార్థాల మధ్యలో జీవిస్తూ
రబ్బరు పూలతో ఇళ్లు అలంకరించుకుంటూ
కవరు చుట్టిన ఆహారాన్ని మెక్కుతున్నామని
పొగతో గాలిని కలుషితం చేస్తున్నామని

ఒక్కతూరైనా ఆలోచించుకున్నావా
వాతావరణ స్వచ్ఛతకు భంగం తలపెడితే
మనుగడ సాగించలేమని
భూమిపై చాన్నాళ్ళు జీవించలేమని
ఓ మనిషీ ఒక్కసారి ఆలోచించు

– నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

## ఓపిక

లోకమన్నది
సాగమన్నది
ఓపికన్నది
ఆగమన్నది!

ఓపికతో సాగితే
ఆగేదేమున్నది!
ఓపిక ఆశల చిరు
మొలక
ఆశయాలకు ప్రతీక


సహనాల అమరిక
శాంత చిత్తం చీరు
దీపిక!
ఆశల ఆశయాలు తీర్చు
ఓర్పు నేర్పు నేనున్నాన్నది!
ఓపిక పట్టండంటే
ఓపినది నెరవేరబోతున్నట్లే

ఓపికతో ఉండండంటే
ఓర్చుకొని
ఎదురుచూడమన్నట్లే!

ఓపిక పట్టి
ఎదురు చూస్తే
నెరవేరనిదేమున్నది!
ఓపిక లేని నాడు
అలుసై పోతావు

ఓపికతో ఉన్న నాడు
అజేయుడవవుతావు!
ఓపిక వెనుకబాటు కాదు
విజయానికి వెసులు
బాటు!

– పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## దలైలామాకు మోదీ, మార్కో శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా శాంతికి రూపమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దలైలామా జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'పవిత్ర ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా 140 కోట్ల మందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన బలమైన చిహ్నం. మతాలకు అతీతంగా ఆయనిచ్చే సందేశం ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దలైలామాకు 90వ జన్మదిన శుభాకాంక్ష లు. సమైక్యత, శాంతి, కరుణ సందేశాలతో ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలి' అని తన సందేశంలో ఆకాంక్షించారు. మరోవైపు 9 0 వ పుట్టిన రోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ 'మానవతా విలువ లు, మత శాంతి ప్రచారం చేయడానికి నేను కట్టుబడి ఉంటాను. టిబెట్ సంస్కృతి ప్రపంచానికి మానసిక ప్రశాంతత, కరుణ అందిస్తుంది' అని పేర్కొన్నారు.

### కొందరు జడ్జిల ప్రవర్తనపై ఫిర్యాదులొస్తున్నయ్...

## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడండి

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ హితవు

### బాంబే హైకోర్టు సన్మాన కార్యక్రమంలో సందేశం



**ముంబయి :** చట్టం లేదా రాజ్యాంగం యొక్క వివరణ 'ఆచరణాత్మకమైనది' సమాజ అవసరాలకు తగిన విధంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) భూషణ్ రామక్రిష్ణ (బిఆర్) గవాయ్ అన్నారు. శనివారం ఇక్కడ బాంబే హైకోర్ట్ ఆయనకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగిస్తూ కొంతమంది సహోద్యోగుల దురుసు ప్రవర్తన గురించి తనకు ఇటీవల ఫిర్యాదులు అందాయని, సంస్థ ప్రతిష్ఠను కాపాడాలని బిఆర్.గవాయ్ న్యాయమూర్తులను అభ్యర్థించారు.గతంలో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును ఆయన ఈ సందర్భంగా ఉటంకిస్తూ ఏదైనా చట్టం లేదా రాజ్యాంగాన్ని ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల సందర్భంలో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. అర్థం ఆచరణాత్మకంగా ఉండాలి. అది సమాజ అవసరాలకు తగినట్లుగా ఉండాలి అని సిజెఐ సూచించారు. జడ్జిలు తమ మనస్సాక్షి, ప్రమాణ స్వీకారం, చట్టం ప్రకారం పనిచేయాలని భావిస్తున్నారు. కానీ విషయం నిర్ణయించబడిన తర్వాత ఎప్పుడూ కలవరపడకూడదని ఆయన చెప్పారు. ఒక న్యాయమూర్తి ఆ విషయం నుంచి తన మనసును దూరం చేసుకుని ఆ తర్వాత ఏమి జరుగుతుందనే విషయాన్ని మర్చిపోవాలని సిజెఐ గవాయ్ సూచించారు.న్యాయమూర్తుల నియమాకం గురించి మాట్లాడుతూ 'న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు ఎటువంటి హాని జరుగకూడదు' అని గవాయ్ నొక్కిచెప్పారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టులకు నియామకాలు జరిగేటప్పుడు వైవిధ్యం, సమ్మిళితత్వం ఉన్నప్పుడే యోగ్యతను కొనసాగించేలా కొలీజియం నిర్ధారిస్తుందని అన్నారు. సిజెఐ బిఆర్.గవాయ్ ఒకప్పుడు తాను న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పనిచేసిన బాంబే హైకోర్ట్‌ను అభినందించారు. ప్రజలు బాంబే హైకోర్ట్ తీర్పును ప్రశంసించినప్పుడు తాను గర్వంగాఅనుభూతిచెందుతానన్నారు. అయితే, ఇటీవల తనకు సహోద్యోగుల దురుసు ప్రవర్తన గురించి కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన చెప్పారు. 'జడ్జిగా ఉండటం అంటే ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు చేసే ఉద్యోగం కాదని,సమాజానికి,దేశానికిసేవచేసేది'అని ఆయననొక్కిచెప్పారు.న్యాయమూర్తులువారిప్రమాణం,నిబద్ధతకుకట్టుబడిఉండాలి'అని గవాయ్ కోరారు. దయచేసి ఈ గౌరవనీయ సంస్థకు అపఖ్యాతి తీసుకువచ్చే ఏపనీ చేయకండి. ఈ సంస్థ ఖ్యాతి తరతరాలుగా న్యాయవాదులు, న్యాయమూర్తులు అంకితభావంతో పనిచేసి నిర్మించినదని సిజెఐ చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన మరొక కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్యాంగం ఈ దేశంలోని ప్రతీ చివరి పౌరుడి కోసం, అది న్యాయమూర్తి లేదా న్యాయవాది, లేదా ఒక కార్యనిర్వాహకుడు లేదా పార్లమెంటేరియన్ అయినప్పటికీ పనిచేస్తుంది' అని సిజెఐ తెలియజేశారు. 'అన్ని వివక్షతల నిర్మూలనకు మన జీవితాలను అంకితం చేద్దాం. రాజ్యాంగ విలువలను నిలబెట్టడానికి మనలను మనం అంకితం చేద్దాం. మన రాజ్యాంగ వాగ్దానాల నేరవేర్చడానికి మనలను మనం అంకితం చేద్దాం' అని గవాయ్ ఉద్ఘాటించారు.

### 'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్' ఏర్పాటులో...

## ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్రే కీలకం

### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్

### బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ బ్రెజిల్‌లో ఉండగా.. కాంగ్రెస్ విజ్ఞప్తి



**ముంబయి :** బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రెజిల్‌లో ఉన్న నేపథ్యంలో బ్రిక్స్ ఆవిర్భావంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కీలక పాత్రను ఆదివారం కాంగ్రెస్ పార్టీ గుర్తు చేసింది. బ్రిక్స్ ఏర్పాటుకు దారితీసిన సంఘటనలను, 2012 సంవత్సరంలో భారతదేశం నిర్వహించిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ జ్ఞప్తి చేసింది. ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పాటును ప్రతిపాదించారని తెలియజేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ఘనా, ట్రినిడాడ్ మరియు టొబాగో, అర్జెంటీనాలో పర్యటించిన తర్వాత విమానాలలో తరచూ ప్రయాణించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రెజిల్ చేరుకున్నారు. 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం రియో డి జెనీరోలో ప్రారంభం అవుతోంది. 1998లోనే అరబిక్ మాట్లాడుతూ ఆసియావైపు మొగ్గుచూపే రష్యా ప్రధానమంత్రి యెవ్‌గేనీ ప్రిమకోవ్ ఆర్‌ఐసి (రిక్) రష్యా, భారతదేశం, చైనా అనే త్రైపాక్షిక వేదిక ఆలోచనను ముందుకు తెచ్చారని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. అమెరికా విజయం సాధించినప్పుడు ప్రపంచ విజయాలలో బహుళ ధ్రువణతను ప్రోత్సహించడానికి ఇది జరిగిందని జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. 2001 నవంబర్‌లో జిమ్ ఓ నీల్, అతడి పరిశోధనా బృందం న్యూయార్క్‌లోని గోల్డ్‌మన్ సాచ్స్ వద్ద టైటిల్‌తో బెట్టర్ గ్లోబల్ ఎకనామిక్ బ్రిక్స్ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా అనే శీర్షికతో ఒక నివేదికను అందజేశారు. ఇవి భవిష్యత్తు కోసం నాలుగు శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలుగా గుర్తించబడ్డాయి' అని ఆయన చెప్పారు. ఆ నివేదిక ఇప్పటికీ చదవడానికి చాలా ఆసక్తిగా ఉందని రమేశ్ తెలిపారు. ఆ తర్వాత జులైలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన జి8 శిఖరాగ్ర సమావేశంలో (రష్యా అప్పుడు 7వ సభ్య దేశంగా ఉండి 2014తర్వాత మినహాయించబడింది) అని ఆయన చెప్పారు. రష్యా, చైనా, బ్రెజిల్, భారత ప్రధానమంత్రి సమావేశమై బ్రిక్స్ ఏర్పాటుకు వారి అంగీకారం తెలిపారని జైరామ్ రమేశ్ చెప్పారు. బ్రిక్ దేశాల మొట్టమొదటి శిఖరాగ్ర సమావేశం బ్రెజిల్, ఇండియా, చైనాతో 2009 జూన్‌లో రష్యాలో జరిగిందని, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఈ సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. 2010లో సౌత్ ఆఫ్రికా బ్రిక్స్ అనే చతుష్టయంలో చేరిందని, ఆ తర్వాత 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యుఏఇ చేరాయని, ఈ ఏడాది ఇండోనేషియా కూడా బ్రిక్స్‌లో చేరిందని జైరామ్ రమేశ్ వివరించారు. భారతదేశం మొట్టమొదటిసారిగా 2012మార్చిలో బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిందని రమేశ్ తెలిపారు. డాక్టర్ మన్మోమన్ సింగ్ బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పాటును ప్రతిపాదించిన ఆ సమావేశం న్యూఢిల్లీలో జరిగిందని చెప్పారు. ఇదిలాఉంటే నాలుగురోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడం కోసం రియోడీజెనీరోకు చేరుకున్నారు, ఆతర్వాత ఆయన ఒక రాష్ట్ర పర్యటనకు వెళ్లనున్నారు. శనివారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి న్యూయార్క్‌లోని గలేయో అంతర్జాతీయ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఇది ఆయన ఐదు దేశాల పర్యటనలో నాలుగవది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాతో ప్రాతినిధ్యం వహించిన బ్రిక్స్‌లో ప్రస్తుతం అదనంగా మరో ఐదుగురు సభ్యులు తోడయ్యారు. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఇ) దేశాలు అదనపు సభ్యదేశాలతో మరింత విస్తరించింది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘనా, ట్రినిడాడ్ మరియు టొబాగో, అర్జెంటీనాలను సందర్శించారు. ఆయన చివరగా నమీబియా పర్యటన కోసం వెళ్లనున్నారు.

## జస్టిస్ చంద్రచూడ్ ఇంటిని స్వాధీనం చేసుకోండి

### కేంద్రానికి సుప్రీంకోర్టు లేఖ

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్... గడువు ముగిసినా అధికారిక నివాసాన్ని ఖాళీ చేయకపోవడంతో ఆ బంగ్లాను స్వాధీనం చేసుకోవాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు యంత్రాంగం లేఖ రాసింది. ఢిల్లీలోని కృష్ణా మీనన్ మార్గ్‌లో ఉన్న 5వ నంబర్ బంగ్లాను సీజేఐకి కేటాయించడం ఆనవాయితీగా వస్తున్నది. జస్టిస్ చంద్రచూడ్ గతేడాది నవంబరులో సీజేఐగా పదవీ విరమణ చేశారు. ఇప్పటికీ ఆయన అదే బంగ్లాలో నివాసం ఉంటూ వస్తున్నారు. నిబంధనల మేరు పదవీ విరమణ తర్వాత భవనంలో ఉంటేందుకు ఆరు నెలల గడువు ఉంటుంది. అయితే, ఆయనకు మే 10తో గడువు ముగిసింది. ప్రత్యేక అనుమతితో మే 31 వరకు పొడిగించినా బంగ్లాను ఖాళీ చేయలేదు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు యంత్రాంగం ఈ నెల ఒకటిన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. జస్టిస్ చంద్రచూడ్ నుంచి బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని... ఆయనకు ఇచ్చిన గడువు ముగిసిందని సుప్రీంకోర్టు లేఖలో స్పష్టం చేసింది. అయితే, దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. తప్పనిసరి వ్యక్తిగత కారణాలతో ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విషయం సైతం యంత్రాంగానికి తెలుసునన్న ఆయన... ప్రత్యేక అవసరాలున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారని చెప్పారు. వారి ఆరోగ్య పరిస్థితి (నెమాలిన్ మయోపతి) నేపథ్యంలో వారి కోసం అనువుగా ఉండే ఇల్లు చూసుకునేందుకు కొంత సమయం పట్టిందన్నారు. ప్రభుత్వం తనకు ప్రత్యామ్నాయ వసతి కేటాయించిందని... అయితే, ఆ ఇల్లు చాలాకాలం మూసి ఉండడంతో కొన్ని మరమ్మతులు జరుగుతున్నాయని.. పూర్తయిన వెంటనే అందులోకి మారిపోతానని స్పష్టం చేశారు. తాను అత్యున్నత పదవిలో పని చేశానని... బాధ్యతలు తనకు తెలుసునన్నారు. కొద్దిరోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేశారు. అయితే, సుప్రీం కోర్టు యంత్రాంగం ఓ మాజీ సీజేఐని అధికారిక నివాసం ఖాళీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాయడం ఇదే తొలిసారి.

## సవరణ (ఎస్ఐఆర్) మీ ఆదేశాల ప్రకారమే జరుగుతోంది:ఇసి

**పాట్నా :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్) తమ ఆదేశాల ప్రకారం జరుగుతోందని, ముసాయిదా జాబితాలో గణన ఫారాలు అందిన ప్రస్తుత ఓటర్ల పేర్లు ఉంటాయని ఎన్నికల సంఘం ఆదివారం తెలిపింది. విపక్ష పార్టీల నిరసనల నేపథ్యంలో బిహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ఓటర్ల జాబితాలలో మార్పుపై సోషల్ మీడియా పోస్టల మధ్య ఇసిపై విధంగా వ్యాఖ్యలు చేసింది. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నోటిఫికేషన్ ప్రకారం ఈ ప్రక్రియ కచ్చితంగా జరుగుతోందని బిహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) సోషల్ మీడియా పోస్ట్ స్పష్టం చేసింది. జూన్ 24, 2025 నాటి ఇసిఐ ఆదేశాల మేరకు బిహార్‌లో ఎస్ఐఆర్‌లో పురోగతి ఉన్నదని, ఆ ఆదేశం ప్రకారం, ఆగస్టు 1, 2025న జారీ చేయబడే ముసాయిదా ఓటర్ల జాబితాలో గణన ఫారాలు అందిన ప్రస్తుత ఓటర్ల పేర్లు ఉంటాయని సిఇఒ ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఈ ప్రస్తుత ఓటర్లు మొదట తమ గణన ఫారాలను సమర్పించిన తర్వాత కూడా పత్రాలను సమర్పించడానికి సమయం ఉంటుందని, అన్ని కార్యకలాపాలు ఇసిఐ ఆదేశం ప్రకారం కచ్చితంగా జరుగుతాయని సిఇఒ చెప్పారు. అవసరమైన పత్రాలు లేని వారు సంబంధిత అధికారులకు వారి గణన ఫారాలను మాత్రమే సమర్పించవచ్చు అని వార్తాపత్రికలలో ఇసిఐ ప్రకటన వెలువడిన తరువాత దానిపై స్పష్టతనిచ్చారు. రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో మాత్రమే నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌ను ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకించాయి. వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జూలై 9న రాష్ట్రంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి.



### హత్యాయత్నం కేసులో

## ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్

**అహ్మదాబాద్:** హత్యాయత్నం కేసులో గుజరాత్ ఆప్ ఎమ్మెల్యేను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ పంచాయతీ కార్యకర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆప్ ఎమ్మెల్యే చైతర్ వాసవను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. శనివారం రాత్రి వాసవ నియోజకవర్గం దేడియాపాడులో జరిగిన సమావేశంలో ఘర్షణ నెలకొంది. స్థానిక సమన్వయ కమిటీ 'ఆప్నో తాలూకో వైబ్రంట్ తాలూకో' (ఏటీవీటీ)లో నియామకం కోసం తన నామినీని నిర్లక్ష్యం చేశారంటూ ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. పంచాయతీ మహిళా ప్రెసిడెంట్‌ను దుర్భాషలాడటంతో పాటు పంచాయతీ అధ్యక్షుడిపై దాడికి దిగినట్లు ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆస్తులను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అయితే ముందుగా తనపై మొబైల్ ఫోన్ విసిరారని, తలకి గాయాలయ్యాయని, అనంతరం గాజు గ్లాస్‌తో కొట్టేందుకు యత్నించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరెస్ట్‌ను ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఖండించారు. విశావదర్ ఉప ఎన్నికలో ఆప్ ఇటీవల విజయం సాధించడంతో ఆప్ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార దాడిగా అభివర్ణించారు. దాడులతో ఆప్‌ను భయపెట్టాలని భావిస్తే అది తప్పని అన్నారు.

## 27కు చేరిన కరాచీ భవన మృతుల సంఖ్య

**కరాచీ :** పాకిస్థాన్ నగరం కరాచీలో మూడు రోజుల క్రితం భవనం కుప్పకూలిన ప్రమాదంలో మృతులసంఖ్య 27కు పెరిగింది. సహాయబృందాలు ముమ్మరంగా శిథిలాలను తొలగించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి. శిథిలాల నుండి సిబ్బంది మృతదేహాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండవచ్చు. కరాచీలో ఐదు అంతస్తుల భవనం గడచిన శుక్రవారంనాడు కుప్పకూలింది. 1974లో నిర్మించిన ఈ భవనాన్ని ఖాళీచేయాలని ఆదేశిస్తూ, దీనిని కుప్పకూలే భవనాల జాబితాలో ప్రభుత్వం చేర్చింది. కరాచీ ల్యారీ ప్రాంతంలో ఈ భవనం ఉంది. ఈ ప్రాంతం పాకిస్థాన్‌లో హింస చెలరేగే అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల జాబితాలో ఉంది. ఈ భవనంలో నివసించడం అంత క్షేమం కాదని 2022 నుండి 2024 వరకూ నివాసితులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసినాగానీ ఎవ్వరూ లక్ష్యపెట్టలేదని అధికారులు చెప్పారు. ఐతే భవనం యజమానులు, స్థలం యజమానులు మాత్రం తమకు ఎలాంటి నోటీసులూ అందలేదని చెబుతున్నారు. తన కుమార్తె ఇంకా శిథిలాల్లోనే ఉండిపోయిందని 54 సంవత్సరాల వయసుగల తండ్రి దేవ్‌రాజ్ విలపిస్తూ చెప్పారు.

## దేశ నేర రాజధానిగా బిహార్

### ప్రభుత్వాన్ని మార్చేందుకే కాకుండా

### రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఓటేయండి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల కాల్చి చంపడంతో కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ స్పందించారు. బిజెపి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కలిసి బీహార్‌ను 'భారతదేశ నేర రాజధాని'గా మార్చారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్ర మే కాకుండా, రాష్ట్రాన్ని కాపాడటానికి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హాజీపూర్‌లో తన కొడుకును దుండగులు కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత, ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు కాల్చి చంపాడని పోలీసులు శనివారం తెలిపారు. కాగా, రాహుల్‌గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'నేడు బిహార్ దోపిడీ, తుపాకీ కాల్పులు, హత్యల నీడలో జీవిస్తోంది. నేరాలు ఇక్కడ కొత్త సాధారణ స్థితికి చేరుకున్నాయి. ప్రభు త్వం పూర్తిగా విఫలమైంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'బిహార్ సోదరసోదరీమణులారా ఈ అన్యాయాన్ని ఇక సహించలేము. మీ పిల్లలను రక్షించలేని ప్రభుత్వం... మీ భవిష్యత్తుకు కూడా బాధ్యత వహించ దు' అని రాహుల్ ఆవేదన చెందారు. ప్రతి హత్య, ప్రతి దోపిడీ, ప్రతి బుల్లెట్ మార్పు కోసం కేకలు వేస్తోందని అన్నా రు. ఇప్పుడు కొత్త బిహార్‌ను చూసేందు కు సమయం వచ్చిందని, ఈ కాలంలో భయం కాకుండా పురోగతి ఉంటోందన్నారు. ఈసారి ఓటు ప్రభుత్వాన్ని మా ర్చడం కోసం మాత్రమే కాకుండా, బిహార్‌ను కాపాడటం కోసం వేయాలని ఆయన సూచించారు. వ్యాపారవేత్త హత్యపై జరుగుతున్న దర్యాప్తును పర్యవేక్షించడానికి స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, సెంట్రల్ డిస్ట్రిక్ట్ పోలీస్ స్క్వాడ్‌లతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఘటన జరగడం రాజకీ య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఎస్ఐఆర్‌పై 'సుప్రీం'కు మహువా మొయిత్రా

**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు... స్పెషల్ ఓటర్ల జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ని ర్వహించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని వివిధ నిబంధనలు ఉల్లంఘిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోందని... గత నెల 24న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఆమె పిటిషన్‌లో అభ్యర్థించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. బీహార్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ జరుగుతోందని... ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1), 21, 325, 328, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 ఎన్నికల నమోదు నియమాలు, 1960లోని నిబంధనలను ఉల్లంఘించినట్లేనన్నారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే దేశంలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బీహార్‌తో పాటు బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయడాన్ని నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని మహువా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నా... గతంలో అనేకసార్లు ఓటు వేసిన ఓటర్లంతా తమ అర్హతను నిరూపించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంటుందని... ఇది ఆర్టికల్ 326కి విరుద్ధమని పేర్కొన్నారు. మొయిత్రా తరపున న్యాయవాది నేహా రతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాల్ చేస్తూ ఏడీఆర్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది.



**ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహం**

రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోగస్ ఓట్ల ఏరివేతలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. ఈ ప్రక్రియను వేగవంతంగా సాగేందుకు కృషిచేస్తున్న ఎన్నికల సిబ్బంది ఒక్కొక్కరికి రూ. ఆరువేలు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.

## ఎఫ్-35 యుద్ధ విమానానికి మరమ్మతులు



**తిరువనంతపురం:** కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన యుద్ధ విమానం ఎఫ్35బీకి మరమ్మతు చేసేందుకు, విమానాన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. యుద్ధవిమానం మరమ్మతు పనులు చేసేందుకు బ్రిటన్ నుంచి 24 మంది ఏవియేషన్ ఇంజినీర్ల బందం ప్రత్యేక పరికరాలతో ఆదివారం కేరళ చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులు చేయడానికి దానిని హ్యాంగర్‌కు తరలించారు. రానున్న రోజుల్లో దీన్ని సీ17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో తరలించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన అన్ని మరమ్మతులు, భద్రతా తనిఖీల తర్వాత విమానం తిరిగి సేవలు ప్రారంభిస్తుందని బ్రిటిష్ హైకమిషన్ అధికారి తెలిపారు. తద్వారా ఇతర విమానాల షెడ్యూల్ నిర్వహణకు ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. కేరళ విమానాశ్రయంలో ఉన్న ఫైటర్ జెట్ ఎఫ్35 బీ విమానానికి భారీ భద్రత కల్పించామని, సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది కాపలాగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. గత నెల ఇండో-యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్35బీ విమానంలో సమస్య తలెత్తింది. దీంతో జూన్ 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరతతో దీన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉన్నట్లు ఆ తర్వాత బ్రిటన్ అధికారులు వెల్లడించారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. మరమ్మతులు నిర్వహించినా విమానం మొరాయించడంతో అప్పటి నుంచి దాదాపు ఈ ఫైటర్‌జెట్ ఎయిర్‌పోర్టులోనే ఉంది.


## ఇతర రాష్ట్రాలకూ భాషా ఉద్యమం వ్యాప్తి:స్టాలిన్



**చెన్నై:** జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా, హిందీ భాష రుద్దడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్నారు. హిందీ భాషకు వ్యతిరేకంగా థాక్రే సోదరులు ఒక్కటయ్యారు. ఈ కలయికను స్టాలిన్ స్వాగతించారు. తమిళనాడులో ప్రస్తుతం ఉన్న ద్విభాషాతమిళం, ఇంగ్లీష్ అమలులో ఉంది. అయితే, బిజెపి ప్రభుత్వం హిందీని తమిళనాడుపై విధిస్తోందని స్టాలిన్ ఆరోపిస్తున్నారు. థాక్రేల ర్యాలీ తర్వాత ఎక్స్‌లో స్టాలిన్ కీలక పోస్ట్ పెట్టారు. భాషా హక్కుల కోసం పోరాటం రాష్ట్ర సరిహద్దులు దాటిందని, మహారాష్ట్రలో ఊపు కనిపిస్తోందని ఆయన అన్నారు. 'హిందీ విధించడాన్ని ఓడించడానికి డీఎంకె, తమిళనాడు ప్రజలు తరతరాలుగా సాగుతున్న భాషా హక్కుల పోరాటం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటింది. మహారాష్ట్రలో నిరసన తుపానులా ఎగిసిపడుతుంది' అని స్టాలిన్ అన్నారు. 'తమిళనాడు పాఠశాలల్లో హిందీని మూడవ భాషగా బోధిస్తేనే నిధులు కేటాయిస్తామని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా, అరాచకంగా వ్యవహరించే బిజెపి... అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ప్రజల తిరుగుబాటు భయంతో రెండవసారి వెనక్కి తగ్గవలసి వచ్చింది' అని స్టాలిన్ అన్నారు.

## సామాజిక సమానత్వంలో భారత్ భేష్

### కేంద్ర సామాజిక సంక్షేమ శాఖ ప్రకటన




**న్యూఢిల్లీ:** అత్యంత సామాజిక సమానత్వం ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నో అభివద్ధి చెందిన దేశాలు సహా 167 దేశాల కంటే మెరుగైన స్థానం సంపాదించింది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక, సంక్షేమ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించే చర్యలు, ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోనే ఈ సమానత్వం సాధ్యమైందని చెప్పుకొచ్చింది. మొత్తం 171 దేశాలతో కూడిన జీని ఇండెక్స్‌లో భారత్ 25.5 పాయింట్లతో స్లోవాక్ రిపబ్లిక్ (24.1), స్లొవేనియా(24.3), బెలారస్ (24.4) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. భారత స్కోరు 2011లో 28.8 పాయింట్లుగా ఉండగా... 2022 నాటికి 25.5 పాయింట్లకు మెరుగుపడిందని వివరించింది. జీని ఇండెక్స్‌లో బ్రిటన్ (32.4), చైనా (35.7), అమెరికా (41.8) మనకన్నా వెనుకబడ్డాయని పేర్కొంది. 'భారత ఆర్థిక పురోగతి పౌరుల మధ్య సమానంగా ఉందని ఈ నివేదిక వెల్లడించింది. పేదరికం తగ్గింపు, విస్తతంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, జన్‌ధన్ యోజన, ఆధార్ వంటివాటితో నేరుగా సంక్షేమ పథకాల నగదు బదిలీ, ఆయుష్మాన్ భారత్‌తో వైద్య సదుపాయం వంటివి దీనికి కారణం. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 2011 నుంచి 2023 మధ్య 17.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం 16.2 శాతం నుంచి 2.3 శాతానికి తగ్గింది' అని సామాజిక సంక్షేమశాఖ ప్రకటనలో పేర్కొంది.

## ప్రాణం తీసిన అక్రమ సంబంధం

**నాగపూర్:** గ్యాంగ్ లీడర్ భార్యతో వివాహేతర సంబంధం ఓ వ్యక్తి కొంపముంచింది. ఆమె మరణం అతడి చావుకు వచ్చింది. 40 మంది ఉన్న ఆ గ్యాంగ్ అతడి కోసం వెంటాడుతోంది. ప్రాణ భయంతో ఆ వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఇప్ప గ్యాంగ్‌కు పోలీసు రికార్డుల్లో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పేరుంది. అర్షద్ టోపి అనే వ్యక్తి ఆ గ్యాంగులో సభ్యుడిగా ఉన్నాడు. అతడు ఏకంగా ఆ గ్యాంగ్ లీడర్ భార్యతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు. ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుస్తూ ఉండేవారు. బయట తిరుగుతూ ఉండేవారు. గురువారం ఇద్దరూ బైకు మీద బయటకు వెళ్లారు. వారు ప్రయాణిస్తున్న బైకు ప్రమాదానికి గురైంది. గ్యాంగ్ లీడర్ భార్య తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. అర్షద్ మాత్రం చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. భార్య చనిపోవటంతో ఇప్పుడు గ్యాంగ్ లీడర్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తన భార్యకు, అర్షద్‌కు సంబంధం ఉందని తెలియటంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. తన భార్య చావుకు అర్షద్ కారణమని గ్యాంగ్ లీడర్ భావించాడు. అతడ్ని చంపి పగ తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. గ్యాంగ్ మొత్తం అర్షద్‌కు వ్యతిరేకంగా మారింది. అతడ్ని వెతికిపట్టుకుని చంపాలని నిర్ణయించుకున్నారు. ఇప్ప గ్యాంగ్ అర్షద్ కోసం గాలిస్తోంది. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియటంతో అర్షద్ డీసీపీ ఆఫీస్‌కు వెళ్లాడు. పోలీసులను కలిసిన తర్వాత అర్షద్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇప్ప గ్యాంగ్ అతడిని పట్టుకోవడానికి వేటాడుతోంది.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్ 2025/26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం అని ఉడిత డిస్టెన్స్ అకాడమీ అధ్యక్షురాలు పాశం అలివేలు జూరార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసిన వారు పదో తరగతి దరఖాస్తు చేసుకోవచ్చని, పది పాసైన వారు ఇంటర్ ఒక్క సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. ఈ అవ కాశం మళ్లీ రాదని వెంటనే అడ్మిషన్ తీసుకోవాలని వారు కోరారు. ఇంటర్ లో గ్రూప్ ఎంపీసీ, బైపిసి, ఆర్ట్స్ ఇంగ్లీష్, తెలుగు మీడియం ఉర్దూలో అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. పదవ తరగతికి రాయడం చదవడం వచ్చి 14 సంవత్సరాలు నిండిన వారు పదవ తరగతి పూర్తి చేసుకునే అవ కాశం కలదు అని అన్నారు. రెగ్యులర్ టెన్త్ ఇంటర్ విద్యార్థులు మీరు ఫెయిల్ అయిన సబ్జెక్టులు ఓపెన్ లో రాసుకునే అవకాశం ఉందన్నారు. అడ్మిషన్లకై మరిన్ని వివరాలకు ఉడిత డిస్టెన్స్ అకాడమీ గాయత్రి గర్ల్స్ జూనియర్ కాలేజ్ ఎదురుగా, కొత్త బస్టాండ్ పక్కన, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా. ఫోన్ నెంబర్లు :7013210945, 8555009457 కు సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



**ప్రజాపక్షం/మునుగోడు/చండూరు:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం, నగదు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం మునుగోడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని పుట్టపాక జడ్పీ హెచ్ఎస్ లో చదివిన విద్యార్థులు ముగ్గురు విద్యార్థులు మొదటి బహుమతి కె. రీతిక 15వేలు , ద్వితీయ బహుమతి కె. యశ్వంత్ 10వేలు , మూడవ బహుమతి జి.లక్ష్మీ ప్రణతి 7500 రూపాయలతో పాటు షీల్డ్ లను కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మీ , ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



## వీరోచిత పోరాట త్యాగానికి ప్రతీక మొహర్రం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** వీరోచిత పోరాటాల త్యాగానికి ప్రతీక మొహరం పండుగ అనీ కుల, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా జరుపుకునే పండుగలో పాల్గొనడం సంతోషంగా ఉందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం ఆయన జూలూరు గ్రామంలోని పీర్ల ప్రార్థన మందిరాన్ని ఆయన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అంజయ్య గౌడ్‌లతో కలిసి సందర్శించి దట్టిని సమర్పించి పూలమాలలు వేసి ప్రార్థన చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు కోసం ఐక్యంగా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. ఉపాధ్యక్షులు చింతల శ్రీశైలం, పిల్లాయి పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ సతీష్ చారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు భూషణం గౌడ్, మెట్టు రామ్ రెడ్డి, తోట బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గ్యార సందీప్, సయ్యద్ ఎజాస్, ముస్లిం మత పెద్దలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేర నియంత్రణకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్ అన్నారు. ఆదివారం ఆయన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి కేసుల వివరాలు, రికార్డులు, స్టేషన్ ఆవరణను పరిశీలించి మాట్లాడారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అన్నారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ మోతీరాం, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొహర్రం మతసామరస్యానికి ప్రతీక

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇడికూడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మొహరం పండుగలో పాల్గొని సవారి ఫీర్లకు దట్టిలు కట్టి శారాను సమర్పించారు. అనంతరం సవారి ఎత్తి ప్రజలను ఉత్తేజరిచారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మట్లాడుతూ పీర్ల పండుగ హిందు ముస్లింలు ఐక్యమత్యంగా ఉంటూ అనందోత్సవాల మధ్య జరుపుకునే పండుగ అని అన్నారు. ఈకార్యక్రమంలో ముస్లీం పెద్ద ఎండి ఘని , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొరిమి ఓంకారం , మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రఖేఖర్‌గౌడ్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్ , పల్లె వెంకన్న, గంట సత్యం , కడారి లక్ష్మణ్ , కోడి గిరిబాబు , ఎఎంసి వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిపాల్గొన్నారు.

## మండలంలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యుల పర్యటన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని రేఖ తండాలో ఆదివారం నేషనల్ లెవెల్ మానేటరింగ్ (ఎన్‌ఎల్‌ఎం) టీం సభ్యులు పర్యటించి పలు పనులను రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు సలీం కుమార్, సలియోన్ పర్యటించి రేఖ తండాలో ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించి అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు ఈ సందర్భంగా గ్రామంలో టీజీఎస్ కింద మంజూరైన పనులు, తోటల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో రైతులు ఉపాధి హామీ కింద విడుదలయ్యే పండ్ల తోటలో ఉపయోగించుకోవాలని అన్నారు. గ్రామాలలో మునగ తోటలో పెంపకం ద్వారా కుటుంబ సభ్యులకు మొత్తం ఉపాధి కలుగుతుందని మంచి ఆదాయ అవకాశాలు కూడా ఉంటాయని తెలియజేశారు. నేడు ఈ టీం సభ్యులు మండలంలోని రేఖ తండాలో పర్యటించనున్నట్లు తెలిపారు. వారి వెంట జిల్లా గ్రామీణ ఉపాధి అధికారి నవీన్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీ ఓ ఝాన్సీ, ఏపీవో వెంకటేశం, ఏపీఎం వినోద్ కుమార్, వేయి రామకృష్ణ ఉన్నారు.

## సాగర్ బ్యాక్ వాటర్‌లో పడి యువకుడు గల్లంతు



**ప్రజాపక్షం/చందంపేట:** సాగర్ బ్యాక్ వాటర్‌లో పడి యువకుడు గల్లంతు అయిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని వైజాక్ కాలనీలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని లింగంపల్లి కి చెందిన అనిల్ తన స్నేహితులతో కలిసి ఆదివారం మండల పరిధిలోని వైజాక్ కాలనీలోని సాగర్‌బ్యాక్ వాటర్ విహార యాత్రకు రావడం జరిగింది. ఈ క్రమంలో స్నానం చేద్దామని నీటిలోకి స్నేహితులతో కలిసి దిగిన అనిల్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

### అభివృద్ధి పనుల పరిశీలన, ఇందిరమ్మ లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఆలేరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వాటి పురోగతి వివరాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య గుడ్ మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం ఆలేరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నేరుగా పరిశీలన చేయడానికి గుడ్ మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఆలేరు పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన అండర్ పాస్ బ్రిడ్జి పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారం, 15 రోజులు, నెలరోజుల వారీగా టార్గెట్ నిర్ణయించుకొని దానికి అనుగుణంగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభయహస్తం పథకంలో భాగంగా నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. ఆలేరు పట్టణంలో మంజూరైన ఇండ్ల నిర్మాణంలో ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లకు పైగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇండ్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు బిల్డింగ్ నిర్మాణ మెటీరియల్ రేట్లు పెంచకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. తమ సొంతింటి కల సాకారం అవుతున్న సందర్భంగా ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆలేరు పట్టణంలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

## మోదీ నియంతృత్వ పోకడలను అడ్డుకుందాం




### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కార్పోరేట్ శక్తులకు అమ్ముతున్న ప్రధాని నరేంద్రమోదీ నియంతృత్వ పోకడలను అడ్డుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలో ఎఐటియుసి, ఎఎన్‌టియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, బిఆర్‌ఎస్‌కెవి ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 9న జరిగే ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో సగటు ఒక కుటుంబం బతకడానికి కనీసం 26వేల రూపాయలు కావాలని అన్నారు. విద్య, వైద్యం, ప్రజా రవాణా ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలన్నారు. రైతు పండించిన పంటకు కనీసం మద్దతు ధర అమలు చేయాలన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌ని పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముత్యాలు, ఐఎన్‌టియుసి నాయకులు ఉప్ప శ్రీను, ఐఎఫ్‌టియు నాయకులు వక్కంతుల నర్సింహరావు, బిఆర్‌ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, పిడియం రాష్ట్ర కన్వీనర్ అంజయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి లతీఫ్, కార్మిక సంఘాల నాయకులు ఉదయగిరి, కర్ల సుందర్‌బాబు, రమణ పాల్గొన్నారు.




### 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ మద్దతు : బెజవాడ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** 9న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సిపిఐ జిల్లా పార్టీ మద్దతు తెలియజేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కామ్రేడ్ ధర్మబిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని విధానాన్ని ఎత్తివేసి కార్మికుల సమ్మె హక్కుకు కాలరాసే విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు సైదులు పాల్గొన్నారు.




## దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సంఘటితం

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎఐటియుసి దేవరకొండ నియోజకవర్గ సమావేశం స్థానిక ఆదివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా జూలై 09న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను కార్మికులు ఏకమై జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 100 సంవత్సరాలకు పైగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా తీసుకురావడం జరుగుతుందని కార్మికుల హక్కులను కాలరాసే ఈ 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మెలోకి వస్తున్నాయని కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మల్లయ్య, మైనోద్దిన్, లింగమయ్య, దేవయ్య, జవహర్, శంకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



### దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సైదిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక,రైతు వ్యతిరేఖ విధానాలకు నిరసనగా జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల సబ్బండ వర్గాలు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ సమితి సమావేశం లెనిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలోసైదిరెడ్డి మాట్లాడుతూ కేంద్రలో మోడీ 3 వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లు గా తీసుకువచ్చి పెట్టుబడి దారుల కొమ్ము కాస్తూ కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మదార్, ప్రద్యుమ్నా రెడ్డి, గుండె రవి, పాండయ్య, యూసుఫ్, బాసాని వెంకటయ్య, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానం




**ప్రజా పక్షం/హాలియా:** హనుమకొండ జిల్లాలో ఈనెల 5,6 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 600 మీటర్ల పరుగు పందెంలో హాలియాలోని ఆకాంక్ష పాఠశాల కు చెందిన విద్యార్థి పవన్ కుమార్ మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ కు పాఠశాల యాజమాన్యం విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, డైరెక్టర్ ఉన్నం శీను బాబు, వీటి ఆవుల చంద్రశేఖర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కరీం ఖాన్ తదితరులు ఉన్నారు.

## గుట్టపై నిర్మిస్తున్న రోడ్డును వెంటనే ఆపాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మౌలాన ఎహసానోద్దీన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడు రోడ్ లో ఉన్న ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లతీపుల్లా షా ఖద్రీ దర్గకు ప్రస్తుతం ఉన్న మేట్ల మార్గంతో కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని కోరిన విధంగా రోడ్డు మంజూరు చేయించారని గుర్తు చేశారు. మునుగోడు బైపాస్ రోడ్డు నుంచి గుట్టపైనకి రోడ్డు వేస్తున్న భూమివక్ఫ్ బోర్డుకు చెందినది కాబట్టిన వక్ఫ్ బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా రోడ్డు వేయడం సరికాదన్నారు. గుట్ట వెనకభాగంలోని బ్రహ్మగారి, దుర్గామాత ఆలయం వద్దకు దారిని ఏర్పాటు చేడం కోసం తప్పదర్గా కోసం కాదని అనుమానం వ్యక్తం చేశారు. పట్టణంలో అనేక చోట్ల వక్ఫ్ బోర్డుకు చెందిన భూమలు ఆక్రమణలకు గురౌతున్నాయని తాము ఇప్పటికే వక్ఫ్‌బోర్డు సీఈవోకు పర్యాదు చేశామని తెలిపారు. పట్టణంలో ఎన్నో సమస్యలు వచ్చినా అధికారులు పెద్దల సమక్షంలో చర్చించి పరిస్కరించుకున్నామని గుర్తు చేశారు. అధికారులు సరైన విదంగా వ్యవరించక పోవడం వల్లనే సమస్య వస్తుందని తెలిపారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షడు రజియోద్దీన్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకలు వెంచర్లో వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమి ఉందని పిర్యాదు చేస్తే సర్వే సందర్భంగా పోలీసలు దగ్గరుండి చూసుకున్నారని చెప్పారు. సర్వే పూర్తి చేయాల్సి ఉండగా వెంచర్కోసం సర్వే నివేదిక తీసుకున్నారని తెలిపారు. ఈ సమేశంలో ముస్లీం పెద్దలు ఖలీం, హపీజ్ఖాన్, హషం తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దు



**ప్రజాపక్షం/కోదాడ:** జిల్లాలో వానకాలం రైతులు సాగు చేస్తున్న పంటలకు సరిపోను యూరియా అందుబాటులో ఉందని డీలర్లు యాదావిధిగా యూరియా అమ్మకాలు జరుపుతారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు, వ్యవసాయ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఫర్టిలైజర్ షాపు యాజమానులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నారని, నేటి నుండి యధావిధిగా యూరియా అమ్మకాలు జరుగుతాయని అన్నారు. రైతులు ఇప్పుడు వరిసాగు విత్తనాలు వేస్తున్నారని యూరియా వేసే సమయం రాలేదని ముందస్తుగా యూరియా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు రైతులకు సకాలంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే విధంగా యూరియా అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందేందుకు కారకులైన వారిపై యూరియాను బ్లాక్ చేసిన అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఒక్క యూరియా బస్తా అమ్మితే 30 రూపాయలు లాస్ వస్తున్నందున తాము యూరియా సరఫరా ఏసి కంపెనీలపై ఒత్తిడి తెచ్చేందుకే తమ అసోసియేషన్ నాయకులంతా కలిసి సమావేశం ఏర్పాటు చేసి తీర్మాణం చేశామని, రైతులు కాని ప్రభుత్వం కాని ఇబ్బంది పెట్టే ఆలోచన తమకు లేదన్నారు. నేటి నుంచి యూరియా అమ్మకాలు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎవోలు రజని, రాజు, ఫర్టిలైజర్ డీలర్ ఉపాధ్యక్షులు జూలకంటి రామిరెడ్డి, డీలర్‌రామారావు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఐవిఎఫ్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలు చేపట్టామని ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల భద్రాద్రి రాములు పేర్కొన్నారు.ఇండియన్ వైష్ ఫడరేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని రామగిరి లో గ ల మల్టీస్పెషల్టీ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు జరిపి అవసరమున్న వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐ వి ఎఫ్ పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ఈ అవకాశం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్క వెంకయ్య,కోశాధికారి గోవిందు బాలరాజు,మహిళా అధ్యక్షురాలు కోమీరి శెట్టి రమ,సెక్రటరీ వందనపు జ్యోతి,ప్రోగ్రాం కన్వీనర్ పారపల్లి శ్రీనివాస్,నాయకులు కోటగిరి దైవ దినం,బండారు వెంకటేశ్వర్లు, బండారు జ్యోతి, తాళ్లపల్లి రాము, గుండా రమేష్, తాటిచెట్టు గోవర్ధన్ ,ఓరుగంటి పరమేశ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయికి బానిసలైన దొంగలు అరెస్ట్

### ఇద్దరు మైనర్ బాలురు, ఒక మహిళకు రిమాండ్
### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** గంజాయి తాగుటకు బానిసలై రాత్రి వేళలో తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనాలకి పాల్పడుతున్న ఇద్దరు మైనర్ బాలురు, ఒక నిందితుడని వారికి సహకరిస్తున్న ఒక మహిళని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో రీల్స్ కి అలవాటు పడి, గంజాయి కి అలవాటపడి దొంగతనాన్ని పాల్పడుతున్న వారిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుండి 17 తులాల బంగారం, 79 తులాల వెండి, 50 వేల విలువ గల 02 కిలోల గంజాయి ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు. మొత్తం విలువ 20 లక్షలు ఉంటుందని తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మికంగా తీసుకొన్న మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టుట చేధించుటలో భాగంగా గత నెల 30న గాలి యాదయ్య,రిటైర్డ్ ఆఫీసర్ తన ఇంటిలో 22 తులాల బంగారం, 80 తులాల వెండి దొంగతనం జరిగిందని ఫిర్యాదు ఇవ్వడం జరిగింది అన్నారు ఈ కేసును నార్కట్పల్లి సీఐ ఆధ్వర్యంలో ఎస్సై సిబ్బంది పలు బృంధాలు గా ఏర్పడి గాలిస్తున్న సమయం లో ఈనెల 6న నమ్మదగిన సమాచారం మేరకు నార్కెట్ పల్లి గ్రామ శివారులో గల రెడ్డయ్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ లో నలుగురు వ్యక్తులు నార్కెట్ పల్లి చుట్టు ప్రక్కల అవసరం ఉన్న వ్యక్తులకు గంజాయి అమ్మడం కొరకు ప్లాన్ చేస్తున్నారని సమాచారం మేరకు నార్కెట్‌పల్లి ఎస్ఐ డి.క్రాంతి కుమార్, సిబ్బందితో నార్కెట్ పల్లి గ్రామ శివారులో రెడ్డయ్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ దగ్గరలో వెళ్ళి అనుమానాస్పదంగా కనిపించిన పైన తెలిపిన నలుగురు వ్యక్తులను అంధులో ఒక ఆడ మనిషిలని పట్టుబడి చేసి వారిని విచారించగా అట్టి నిందితులు సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని ఒక పథకం ప్రకారం 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి గంజాయి ని తీసుకొని గంజాయి తాగే వారికి నార్కెట్ పల్లి చుట్టు ప్రక్కల అవసరం ఉన్న వ్యక్తులకు గంజాయిని అమ్మాలని ప్రయత్నిస్తుండగా గ్రామ శివారులో రెడ్డ య్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ లో నార్కెట్ పల్లి పోలీసు వారు పట్టుబడి చేసి నిం దితుల వద్ద నుండి 2 కేజిల గంజాయి, బంగారు గాజులు, బంగారు పుస్తెలతాడు, బంగారు నక్లెస్, సిల్వర్ కుంకుమ బారనిలు, బంగారు చెవి రింగ్స్, బంగారు సదా రింగ్, బంగారు మాటీలు, గోల్డ్ కాయిన్స్, వెండి పట్టాగొలుసులు, వెండి కాయిన్స్, వెండి విగ్రహాలను మొత్తం 17.1 తులాల బంగారం, 79 తు లాల వెండి1ద్విచక్ర వాహనన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## దుబ్బ రాజన్న ఆలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సారంగపూర్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్ల గ్రామంలోని శ్రీ దుబ్బరాజేశ్వర స్వామిదేవస్థానంలో ఆదివారం జగిత్యాల ఎంఎల్ఎ డాక్టర్ సంజయ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు రాజేంధర్‌రెడ్డి, మల్లారెడ్డి, నరసింహారెడ్డి, సురేంధర్, సుధాకర్‌రావు, శేఖర్‌గౌడ్, రామారావు, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు

## పండుగ పూట తాగునీటి కోసం మహిళల ఆందోళన

### ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండల పరిధిలోని చిన్న ముల్కనూర్ గ్రామంలో పండుగపూట మహిళలు తాగునీటి కోసం ఆందోళన చెందారు. తొలి ఏకాదశి పండుగ ఆదివారం రోజున నాలుగో వార్డులో త్రాగడానికి , వినియోగానికి చుక్కనీరు లేదంటూ మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఖాళీ బిందెలతో ముట్టడించారు. వెంటనే నీరు అందించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నీటి సరఫరా విషయంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శిలు శ్రద్ధ తీసుకుని నీరు వచ్చేలా సహకరించాలని కోరారు. ప్రజా సమస్యలను పట్టించుకునేది ఎవరని వారు ప్రశ్నించారు. నాలుగో వార్డులో గత మూడు నెలల నుంచి త్రాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు.

## అఖండ భజన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ 'ఆది'



**ప్రజాపక్షం/చందుర్తి:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చందుర్తి మండల కేంద్రం లోని మహాలక్ష్మి ఆలయం లో నిర్వహిస్తున్న 24 గంటల అఖండ భజన కార్యక్రమం లో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , బీజేపి నాయకులు ప్రతాప రామకృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తదితరులను ఆలయ కమిటీ అధ్యక్షులు బాసెట్టి భాస్కర్ శాలువా తో సన్మానించి స్వాగతం పలికారు.మండల కేంద్రం లోని మహాలక్ష్మి ఆలయం లో ఆలయ కమిటీ, స్థానిక సాదు సజ్జన భజన మండలి,గ్రామస్తుల ఆధ్వర్యం లో గత 21 సంవత్సరాలుగా 24 గంటలు అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయ 10 గంటల నుండి సోమవారం ఉదయం 10 గంటల వరకు నిరవధికంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు , రాజకీయ నాయకులు , కళాకారులు , మండలం లోని అన్ని గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారి దీవెనలు పొందారు.

## క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించిన ఎసిపి మడత రమేష్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** ఆదివారం రోజున గోదావరిఖని చౌరస్తాలో తెలంగాణ లైఫ్ సినిమా ఛానల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాపల్లి కుమార్ పటేల్ రచన దర్శకత్వం మరియు నిర్మాణంలో రక్షణ అనే లఘు చిత్రాన్ని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ చేతులమీదుగా క్లాత్ కొట్టి షూటింగ్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. రక్షణ అనే లఘు చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుంది. ఈ రోజుల్లో జరుగుతున్నటువంటి విప్లవం మరియు రౌడీయిజం చదువు ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకొని సమాజంలో రావాల్సిన మార్పు గురించి తీస్తున్నటువంటి ఈ చిత్రం నలుగురికి ఉపయోగ పడాలని సమాజంలో కొంతైనా మార్పు వస్తుందని ఆశిస్తూ తీస్తున్నటువంటి చిత్రం ఈ చిత్రం లో హీరోగా సంటి రమా కాంత్ , దామర రాజేష్, వనపర్తి ప్రభాస్, స్వరూప రాణి, నిక్కత్, నిర్మల ,రాజేశ్వరి, చైతన్య రాణి, జక్కుల స్వప్న, సిరిశెట్టి తిరుపతి గౌడ్, తదితర నటి నటీమణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారుడు దామర శంకర్, దయానంద్ గాంధీ, మ్యాజిక్ రాజా, చంద్రపాల్, కుమార్ యాదవ్ ,మేకల శ్రీకాంత్ ,పి ఎన్ పటేల్, ఉపేందర్, విజయ్ కుమార్, వంగ శ్రీనివాస్ గౌడ్, నాగభూషణం గౌడ్, డాక్టర్ శంకర్ లింగం, కళావతి, మధు, తదితరులు పాల్గొన్నారు.

## జూనోటిక్ వ్యాధులపై అవగాహన




**ప్రజాపక్షం/ధర్మపురి:** జిల్లా పశు వైద్య,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జంతువులు, మనుషుల మధ్య సంక్రమించే (జూనోటిక్)వ్యాధుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పశువైద్య కేంద్రం ఆవరణలో జూనోసెస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డా. బోనగిరి నరేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధర్మపురి వెటర్నరీ వైద్యులు డా.దుంపల వేణుగోపాల్ జంతువులు మనుషుల మధ్య సంక్రమించే 150కి పైగా జూనోటిక్ వ్యాధుల గురించి వివరించారు. జంతువులను,సంబందిత పదార్థాలను ముట్టినప్పుడు చేతులు, శరీర భాగాలను డిటర్జెంట్ సబ్బుతో శుభ్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

**లయన్స్ ఆధ్వర్యంలో సన్మానం**

జూనోసెస్ డే ను పురస్కరించుకుని ధర్మపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ సంచాలకులు డా. బోనగిరి నరేష్, ధర్మపురి వైద్యులు డా.వేణుగోపాల్, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మామిడాల రవీందర్, సెక్రటరీ సర్జారావు, కోశాధికారి పప్పుల శ్రీనివాస్, జోనల్ చైర్ పర్సన్ పిన్న శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మోహన్, రంగ హరినాథ్, శ్రీహరి, నర్సయ్య, జి.శ్రీనివాస్, లింగన్న పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రం లోని వన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పోచయ్య(65) అనే దినసరి కూలీ ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రోజు ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోచయ్యకు ఉన్న ఒక్కగానొక్క కూతురు తిరుమల, భార్య రాజవ్వ ఉండగా చిన్న తనం నుండి కూతురు అనారోగ్యంతో బాధపడుతుండడంతో, లక్షల్లో అప్పులు చేసి వైద్యం చేపించాడని, అనేక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషిస్తూన్నాడని తెలిపారు. చేసిన అప్పులు తీర్చలేక కళ్ల ముందే కూతురు అనారోగ్యంతో బాధపడుతుండగా తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది మృత దేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# సార్వత్రిక సమ్మెకు సహరించాలి: సిపిఐ

### ఎంఇఒకు సిపిఐ వినతి




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** జూలై తొమ్మిదో తారీఖున ఆల్ఇండియా కార్మిక సంఘాల పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు మండల విద్యాధికారి కృష్ణహరికి అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే పది వేల రూపాయల జీతం అమలు చేస్తామని చెప్పి నేటికి అమలుకు నోచుకోలేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిగేటి రాజశేఖర్,మిడ్‌డే కార్మికుల యూనియన్ మీసం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గత ఎనిమిది నెలల నుండి కోడిగుడ్ల డబ్బులు రాక అప్పులు చేసి విద్యార్థులకు రూపాయి అదనంగా చెల్లించి సొంత బిడ్డలుగా చూసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చేది ఆరు రూపాయలు ఐతే ఏడు రూపాయలు చెల్లించి పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ఇచ్చిన స్థానం మాకు ఇవ్వడం లేదని, కనీస గౌరవవేతనం లేదని నివ్వెర పోయారు. కొంత ప్రతినిధులు పని చేస్తే చేయండి లేదంటే విడిచిపెట్టండని జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికులకు ఎలాంటి విఘాతం కలిగించిన ఊరుకునేది లేదని వారి పట్ల సిపిఐ పార్టీ నిలబడి కొట్లడుందని చెప్పారు. కనీస వేతనం 26 వేలకు పెంచాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని మిడ్‌డే కార్మికుల పట్ల చిన్నచూపు చూడటం అమానుషం అన్నారు. అన్ని రకముల డిమాండ్లను పరిష్కరం చేయకపోతే ఆల్ఇండియా మిడ్‌డే మిషన్ కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉందని చెప్పారు. అరవై సంవత్సరాలు దాటిన వారికి రిటైర్మెంట్ ఇవ్వాలని కోరారు. దీనికి సానుకులంగా స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హామిఇచ్చారు. కార్మికులు చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. నర్సయ్య, లత, కొమురవ్వ, నర్సవ్వ, మణెమ్మ, రజిత, లావణ్య, రోజ, లక్ష్మి ప్రజాప్రతినిధుల సంఘాల జిల్లా సమితి నాయకులు పాల్గొన్నారు.

## బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచుల ఆర్థిక సంక్షోభం

### జిల్లా యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుందని ఆరోపణ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం లోని మల్లన్నపేట్ గ్రామంలో పల్లె దవాఖాన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, మండల అధికారులు స్పందించి నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని, పూర్తయిన నిర్మాణాలకు జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

## వేద పండిత విద్యార్థులకు పట్టాల పంపిణీ

### పట్టాలు పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ:** చతుర్వేద స్మార్త పరీక్షల్లో ఉతీర్ణత సాధించిన 157 మంది వేద పండిత విద్యార్థులకు పట్టాల పంపిణీ, పరీక్ష నిర్వహించిన వేద పండితులకు ఘన సన్మానం చేసి, ప్రశంస పత్రాలు అందజేసిన విప్. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజ రాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు లో భాగంగా వేద పండితులకు నిర్వహించిన చతుర్వేద స్మార్త పరీక్షల్లో ఉతీర్ణత సాధించిన 157 మంది వేద పండిత విద్యార్థులకు ఆదివారం, ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. పరీక్ష నిర్వహించిన వేద పండితులకు ఘన సన్మానం చేసి, ప్రశంస పత్రాలు అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేద పండిత విద్యార్థులకు నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలు తెలంగాణ రాష్ట్రంలో వేములవాడ లో ఏర్పాటు చేయడం అభినందనీయం. భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక. హైందవ సంస్కృతిలోని వేదాలను ప్రపంచంలోనే ఇతర దేశాలు ఆచరిస్తున్నాయి. అనేక ఆశ్రమాల్లో దేవాలయాల్లో భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. 47 కోట్లతో రోడ్డు వెడల్పు, 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేస్తున్నాం. 150 కొట్లు రాజన్న ఆలయ అభివృద్ధికి కేటాయించడం జరిగింది. వేలాదిగా వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం కోసం ముందుకు పోతున్నాం. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులకు టెండర్లు పిలుస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభం చేయడం జరుగుతుంది. రాజన్న ఆలయ విస్తరణ ఏ ఒక్కరి స్వంత ఎజెండా కాదు, ఇది రాజన్న భక్తుల ఎజెండ. ప్రతీ ఒక్కరి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు పోతాం. ఈ కార్యక్రమంలో ఈవో రాధా బాయ్, వివిధ దేవాలయాల వేద పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## మంత్రిని కలిసిన టిఎన్‌జిఓ నాయకులు



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తొలి ఏకాదశి పండుగ సంధర్భంగా టిఎన్‌జివోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిలు ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన కామన్ మెనూను వసతి గృహాలకు అమలు పరచడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న వసతి గృహ సంక్షేమాధికారుల పదోన్నతుల్లో ఏర్పడిన ప్రతిష్టంభన వంటి సమస్యలను విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి కమిషనర్లతో చర్చించి త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, జిల్లా నాయకులు మల్క రాజేశ్వర్ రావు, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చేందర్, జిల్లా అధ్యక్షుడు బోనాల రవి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం

### ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి నూతనంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా గోదావరిఖనికి వస్తున్న సందర్భంగా ఆదివారం రోజున సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం పలికింది. గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ నుంచి మార్కేండయ కాలనీ లోని ఆర్ కె గార్డెన్ వరకు జరిగిన ర్యాలీలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య వివేక్ వెంకటస్వామి వెంట ఉంటూ ర్యాలీ లో పాల్గొనడం జరిగింది, అనంతరం ఆర్ కె గార్డెన్ లో జరిగిన అభినందన సభలో ఏఐటియుసి పక్షాన వివేక్ వెంకటస్వామి ని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై. వి.రావు తో పాటు ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నృసింహుడి సన్నిధిలో మంత్రి అడ్లూరి పూజలు



**ప్రజాపక్షం/ధర్మపురి:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి వారిని ఆదివారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు జక్కు రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. తొలుత ప్రదానాలయం శ్రీ యోగానంద లక్ష్మి నృసింహుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం మంత్రి అన్ని అనుబంధ ఆలయాలలోని స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనంగా ఆశీర్వచనం చేయగా చైర్మన్ రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌లు స్వామి వారి శేషవస్త్రంతో మంత్రిని సన్మానించారు. అంతకు ముందు అనుబంధ దేవాలయం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ రుద్రాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు మహేందర్, రవీందర్, గణేష్, పవన్ కుమార్, సాయి కిరణ్, మల్లేష్, తిరుపతి, సౌజన్య,సీనియర్ అసిస్టెంట్ ఎ. శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ లావణ్య, దేవస్థానం మాజీ అధ్యక్షులు దినేష్, రాజేష్ పాల్గొన్నారు.


## బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మిర్యాల రవీందర్



**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి రెండవ ఎస్సైగా మిర్యాల రవీందర్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2024 బ్యాచ్‌కు చెందిన రవీందర్ కుమార్ ధర్మపురి ఠాణాలో ఎస్సై 2 గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ధర్మపురి సిఐ ఎలపాటి రాం నర్సింహా రెడ్డి, ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్‌లు రవీందర్ కుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రవీందర్‌కుమార్ పూల మొక్కను అందించారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పశు వైద్య కేంద్రం

### అధ్వానంగా ఆసుపత్రి ప్రాంగణం.. పట్టించుకోని అధికారులు




**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంటలోని పశు వైద్య కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పశువుల ఆరోగ్యం కోసం నిర్మించిన ప్రాథమిక పశు వైద్య కేంద్రం ప్రాంగణం పూర్తిగా అద్వాన్నంగా మారినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డులో రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఈ పశువైద్య కేంద్రం పూర్తిగా మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి అయ్యిందంటే చాలు మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తూ నానా హంగామా చేస్తున్నారు. పశువుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మందుబాబులు తాగుబోతుల అడ్డాగా మార్చారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని పశువైద్య కేంద్రంలో ఇదంతా జరుగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది. పశువైద్య కేంద్రం ఆవరణలో బీరుబాటిళ్లు, మద్యం సీసాలతో, తిన్న ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో అద్వాన్నంగా తయారయ్యింది. అసాంఘిక కార్యకలాపాలు సైతం జరుగుతున్నాయని తెలిసింది. పశువుల ఆసుపత్రిని ఆనుకుని ఒక దేవాలయం సైతం ఉంది. దేవాలయం ఆనుకునే ఇలాంటి కార్యకలాపాలు చేయడంపై పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## షేక్ ఫీర్మాబీ మృతి యూనియన్‌కు తీరని లోటు

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎఐటియుసి అనుబంధ వైద్య ఉద్యోగుల సంఘం తొలి తరం యూనియన్ నాయకురాలు షేక్ ఫీర్మాబీ ఆదివారం అస్తమించారు. కరీంనగర్ జిల్లాలో తొలి తరం వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు స్వర్గీయ మహమ్మద్ ముస్తఫా సతీమణి షేక్ ఫీర్మాబీ మరణం యూనియన్‌కు తీరనలి లోటని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామారావు, జిజిహెచ్ బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు సొడమల్ల సన్నీ ఎడ్వర్డ్‌లు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తొలి తరం వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు స్వర్గీయ ఎస్.పి.దయానంద్, రూబీ నారోణాలతో పాటు ముస్తఫా, షేక్ ఫీర్మాబీలు యూనియన్ బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని వారు తెలిపారు.

## రైతుల గోడు పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం / కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 46లో సుద్దాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు త్రోవ కబ్జా చేయడం వలన సుద్దాల, చంద్రగిరి, రామన్న పేట గ్రామస్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం జరుగుతుంది. అదే సర్వే నెంబర్ 46లో పట్టా భూమి ని సేద్యం చేసుకుంటున్న చిన్న సన్నకారు దళిత రైతులు అయినటువంటి మాసం దేవవ్వ, మాసం వజ్రవ్వ అనే రైతులకు దారి లేకుండా చేశారు.భూమి సేద్యం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు.ఈ పొలంలో పంట పండితే గాని జీవనం కొనసాగని పేద రైతుల్ని ఇబ్బందులు గురి చెస్తున్నారు. పలుమార్లు ప్రజావాణిలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లడానికి కబ్జా చేసిన దారిని తిరిగి ఎప్పటిలాగా ఉంచాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## చురుకుగా వరి నాట్లు



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్‌మండలంలో వరినాట్లు చురుకుగా సాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో రైతులు సాగుభూములను దున్నుకొన్నారు. వరి నారుపోసుకొని వర్షాలకోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మెట్ట భూములు రైతులు తొలకరి వర్షాలకు పసుపు, మొక్కజొన్న, సోయాబిన్ వేశారు.వర్షాలు జోరుగా పడడంతో రైతులు నాట్లు వేయసాగారు. బీహార్, నల్గొండ, కలకత్తా నుంచికూలీలు రావడంతో వరినాట్లు జోరందుకున్నాయి.

## అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

**ప్రజాపక్షం/గజ్వేల్:** సమాజంలో అట్టడుగున నిలిచిన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ కృషి చేసినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సర్దార్ ఖాన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక సమానత్వం కోసం, దళితుల అభ్యున్నతి కోసం పోరాడిన ఆయన దేశ సార్వభౌమత్వం కోసం కృషి చేసినట్లు గుర్తు చేశారు. దళితుల ఓటు హక్కు కోసం అమ్మ కమిషన్ ముందు వాదనలు వినిపించిన ఆయన బ్రిటిష్ పాలకుల చర్యలను నిరసిస్తూ పోరాటం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజార్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, నాయకులు సుఖేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నక్క రేగొండ గౌడ్, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, డాక్టర్ వహీద్, ఊడేం శ్రీనివాస్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, అజ్గర్, గుండు లక్ష్మణ్ జాంగిర్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

## అడవుల రక్షణకు సహకరించాలి



**ప్రజాపక్షం/జన్నారం :** అడవుల, వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని జన్నారం మండలంలోని ఇందన్ పల్లి రేంజ్ నూతన ఎఫ్ఆర్ఓ శ్రీధర్ చారి కోరారు. ఆదివారం ఇందన్ పల్లి ఎస్ఆర్ఎ క ఆర్యాలయంలో ఇంచార్జి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ నుండి ఆయన భాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. కలప అక్రమ రవాణా కాకుండా చేస్తామన్నారు. నూతన ఎఫ్ఆర్ఓకు కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు

**హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్**



**ప్రజాపక్షం/ హాజీపూర్ :** రహదారి ప్రమాదాలను తగ్గించాలన్న లక్ష్యంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాజీపూర్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఎన్‌హెచ్ 63 రహదారిపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి వేంపల్లి గ్రామం నుండి నర్సింగాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పొదలను, వాహనదారులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ మాట్లాడుతూ రహదారిని మరింత సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టామని, రోడ్డుకు అడ్డంగా పెరిగిన వృక్షాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగిస్తున్నామన్నారు. హాజీపూర్ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, మున్సిపల్ సిబ్బంది, హాజీపూర్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ చాంద్, హెడ్ కానిస్టేబుల్స్ శేఖర్, శ్రీనివాస్,కానిస్టేబుల్స్ పెట్టెంరాజేందర్, బాల్తు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉమాకాంత్‌పై వ్యాఖ్యలు ఉపసంహరణ

**ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్**

**ప్రజాపక్షం / రెబ్బెన :** డిజిఎం సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్‌పై గతంలో తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ తెలిపారు. ఆదివారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మే 26, 27 తేదీలలో ఉమాకాంత్‌పై అవినీతి, అక్రమాలు, భూదందాలు, కుంభకోణాలకు పాల్పడుతున్నారని తాను చేసిన ఆరోపణలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు ఉపేందర్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వల్ల ఉమాకాంత్ మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమాపణలు చెబుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటనతో గతంలో ఉమాకాంత్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వివాదం ముగిసినట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్యే రామరావ్ పటేల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/బైంసా :** మహాగాం గ్రామంలో 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి 2 కోట్ల 40 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో ఎమ్మెల్యే పవార్ రామరావ్‌పటేల్‌ను ఆదివారం మహాగాం గ్రామస్తులు సత్కరించారు. తాజా మాజీ సర్పంచ్ రాకేష్ ఆధ్వర్యంలో పెద్ద మొత్తం లో రైతులు వచ్చి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.తమ గ్రామం లో ఎమ్మెల్యే ఆయ్యాక సి.సి రోడ్ల నిర్మాణం కోసం 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసారన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విజయానందక్కు ఉత్తమ వైస్‌చైర్మన్ అవార్డు



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** సౌత్ కార్నివాల్‌లో జీలకార్ విజయానంద్‌కు ఉత్తమ వైస్‌చైర్మన్ అవార్డులు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 5, 6లలో విశాఖపట్నంలో కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో సౌత్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి 2 తెలుగు రాష్ట్రాలతో పాటు 14 రాష్ట్రాలకు చెందిన 15క్లబ్‌లు పాల్గొన్నాయి. ఇందూరుకు చెందిన విజయానంద్ జెసిఐ అలుమ్ని క్లబ్ ఇండియా జోన్ 12(తెలంగాణ, కర్ణాటక)లో వైస్‌చైర్మన్ (పబ్లిక్ రిలేషన్ పోగ్రాం, శిక్షణ విభాగం కోచింగ్ మెంటరింగ్)గా వ్యవహరిస్తున్నారు. విజయానంద్‌కు ఉత్తమ జోన్‌వైస్‌చైర్మన్‌గా అతను వ్యవహరిస్తున్న ఉత్తమ శిక్షణ విభాగం కోచింగ్ మెంటారింగ్, పబ్లిక్ రిలేషన్ కార్యక్రమంలకు కూడా అవార్డులు లభించాయి. అవార్డులను ఇండియా నేషనల్ చైర్మన్ అంజలి బాత్ర గుప్తా, నేషనల్ వైస్‌చైర్మన్ జైకుమార్ అందజేశారు. నేషనల్ వైస్‌చైర్మన్ మనోజ్ టక్కర్, నేషనల్ కోఆర్డినేటర్ జివిఎన్.రాజు. జోన్ వైస్‌చైర్మన్లు నవీన్ చావల్ల, మహేష్ గోలేచ్చ, శ్రీనివాస్ వీరబొమ్మ, జోన్ అధికారులు వినయ్, చైతన్య, సంతోష్ పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటిలో ఆరుగురికి సీట్లు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులకు త్రిబుల్ ఐటీ బాసరలో సీట్లు రావడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి డి.సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీహెచ్ఎస్ తిమ్మాపూర్ విద్యార్థిని పివి.అస్మిత, నల్ల సాయి కుమార్ జడ్‌పిహెచ్ఎస్ శెట్పల్లి, విద్యార్థిని యు.సాహిత్య, జడ్పిహెచ్ఎస్ సుంకెట్ విద్యార్థినులు బండి అనుశ్రీ అంకం శ్రీహిత, వేముల నిహారిక లకు త్రిబుల్ ఐటీ బాసరలో సీట్లు రావడం సంతోషంగా ఉందన్నారు. త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి డి.సమ్మిరెడ్డి అభినందించారు. అలాగే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# అభివృద్ధి పథంలో చెన్నూర్



**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రజాపక్షం/ కోటపల్లి/ చెన్నూర్ :** చెన్నూరు నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మైనింగ్, కార్మిక శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం కోటపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి వివేక్ పంపిణీ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఎన్నికల తర్వాత ప్రతిరోజూ మార్నింగ్ వాక్ సమయంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నా. ప్రతీ గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేశాం. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే మా సంకల్పం. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉచిత ఇసుక కూడా అందిస్తాం అని అన్నారు. అనంతరం కోటపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆర్ఓఆర్ వాటర్ ప్లాం ట్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, ఇన్నాళ్లూ నిర్లక్ష్యం ఎదుర్కొన్న ప్రజలకు మౌలిక వసతులు అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చురుగ్గా పని చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉచిత ఇళ్లు, బస్సులు, విద్యుత్, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని తెలిపారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, చెన్నూరులో ఎక్కడా మాఫియా లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అయినా ప్రతిపక్ష నాయకులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి తప్పుడు వార్తలపై పోలీసులు నిఘా పెట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి**

**చెన్నూర్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు దేవుడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, సమృద్ధిగా ఉండాలని, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నూరులోని మదన పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి రాష్ట్ర ప్రజలందరికీ తొలి ఏకాదశి మొహరం పండుగల శుభాకాంక్షలు తెలిపారు. తొలి ఏకాదశి పండగల శుభారంభమని పేర్కొన్న మంత్రి, రాష్ట్ర అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఒకప్పుడు అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణను అన్ని రంగాల్లో ముందుండే రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను నిష్టతో అమలు చేస్తుందని పునరుద్ఘాటించారు.



# దేశ విచ్ఛిన్నమే మోదీ ప్రధాన ఎజెండా




**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** దేశ విచ్ఛిన్నమె మోడీ ప్రధాన అజెండా అని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎఐవైఎఫ్ జనరల్ జిల్లా బాడీ సమావేశం రంజిత్ అధ్యక్షతన నిర్వహించగా శ్రీకాంత్ మాట్లాడారు. దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి విచ్ఛిన్నం ద్వారా రాజ్యపాలన చేయాలని దేశంలో నివసించాలంటే ఆర్ఎస్ఎస్ అనుమతి అవసరం అనేలా నీచ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న మోడీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశ పౌరులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మోడీ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని బీజేపీ ఎన్నికల ముసాయిదాలో ప్రకటించారు. కానీ మోడీ మూడో సారి అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదని తాను చెప్పిన ఏటా 2 కోట్ల ప్రకారం ఇప్పటికీ 12 సంవత్సరాల కాలంలో 24 కోట్ల ఉద్యోగాలు భర్తీ కావలని మోడీ మాటలన్ని నీటి మూటలేనని వారు ఎద్దేవా చేశారు. మోడీలా మారాలంటే దేశ సమైక్యతను దెబ్బ తీసే విధానాలను అనుసరించి మత ఉన్మాద రాజకీయాలను ప్రోత్సహించడమేనని, ఈ విధానాలను దేశ యువత అంగీకరించటానికి సిద్ధంగా లేరని వారు ఉద్ఘాటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఎఐవైఎఫ్ యువతను మంచి సమాజం వైపు సన్నద్ధం చేయడానికి కృషి చేస్తున్నదని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజాస్వామ్య యుతంగా అమలు కోసం పోరాటాలను ఉధృతం చేస్తుందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నామన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.రంజిత్, ఉపాధ్యక్షులు రమేష్‌చారి, రఘురాంనాయక్, సాయికిరణ్, మధుయాదవ్, జిల్లా కార్యదర్శి సాయితేజ, సహాయ కార్యదర్శులు కండ్లకోయ ప్రసాద్, రమేష్, కోశాధికారి నాగేష్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, రక్షిత్, కిరణ్, సునీల్, సాయిలు, ఆకాష్, రమేష్‌లను ఎన్నుకున్నామన్నారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు.ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బాధనకుర్తి గ్రామంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని,బాధనకుర్తి గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.గ్రామాల్లో రోడ్డు,డ్రైనేజీ,నీటి సమస్యలను పరిష్కరించి,ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు.ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్,మున్సిల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తున్నారు



**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు**

**ప్రజాపక్షం / తాండూరు :** కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న 4 లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు పూర్తిగా మాయమవుతాయని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తీవ్రంగా విమర్శించారు. జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగిన సమావేశంలో మేకల దాసు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికులకు హక్కులు లేకుండా చేయడమేనని ఆరోపించారు. కొత్త లేబర్ కోడ్‌లు కార్పొరేట్ వ్యాపార వర్గాలకు మాత్రమే అనుకూలంగా ఉంటాయని, కార్మికులు మాత్రం తమ హక్కులను కోల్పోతారని వివరించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ బయ్యా మొగిలి, తాండూర్ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బాణేష్, మాజీ ఎంపిపి కామెర మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, ఆర్గనైజేషన్ కార్యదర్శి వాసాల నాగరాజు, మండల కోశాధికారి పట్టి శంకర్, మండల కార్యవర్గ సభ్యురాలు దాసరి లక్ష్మి, శాఖ కార్యదర్శి కొండ సాయి కుమార్, హమాలీ యూనియన్ సభ్యులు తాని శ్రీనివాస్, కామెర దుర్గయ్య, మెట్టుపల్లి ధర్మయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం

**మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితెందర్‌గౌడ్**



**ప్రజాపక్షం/రామాయంపేట:** బిఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపనలు అర్థరహితమని రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మెన్ పల్లె జితెందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముమ్మాటికి పద్మాదేవేందర్‌రెడ్డి తెచ్చిన టియుఎఫ్ఐడిసి నిదులతోనే శిలాఫలకాలు వేసి శంఖుస్థాపనలు చేస్తున్నారని అన్నారు. గత 19 నెలల్లో ఈనిదులు తప్ప కొత్తగా ఏమి తెచ్చారో తెలుపాలన్నారు. ముందు గెలికి ఖయ్యం పెట్టుకుందే మీరని అన్నారు. తాము అభివృద్ధి చేయలేదనడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పదవులను త్యాగం చేసిన చరిత్ర పద్మాదేవేందర్‌రెడ్డిది అన్నారు. బెదిరింపులకు భయపడేవారిమి కాదని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలన్నారు. అభివృద్ధి చేస్తామంటే సహకరిస్తామేతప్ప ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. రెవెన్యూ డివిజన్ తెచ్చింది తామేనని, దమ్ముంటే గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చేది తమ ప్రభుత్వమేనని, మీరు తేకుంటే తామే తీసుకువస్తామన్నారు. రామాయంపేట నియోజకవర్గం పోవడానికి పద్మాదేవేందర్ రెడ్డి కారణం అనడం సరికాదన్నారు. అప్పుడు రాష్ట్రంలో, కేంద్రంలో మీ ప్రభుత్వమే ఉందన్న విషయం మరిచిపోవదన్నారు. రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి తీసుకువస్తామంటే తాము పార్టీలకు అతీతంగా సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రాథమిక సహకార సం ఘం చైర్మెన్ బాదె చంద్రం, నాయకులు బసన్నపల్లి రాజుయాదవ్, ఉమా మహేశ్వర్, ఎస్కే హైమద్, పోచమ్మల ఐలయ్య, హస్నోద్దీన్, భూమ మల్లేశం, మర్కు దత్తు, విద్యాకర్‌రాజు, కన్నాపురం క్రిష్నా గౌడ్, చింతల రాములు, శ్రీకాంత్‌సాగర్, నరేందర్‌రెడ్డి, బాను, ఒద్ది స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికీ ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయమే



**ప్రజాపక్షం / ఆర్మూర్ :** ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఆదర్శవంతమైనదని మిత్రమండలి సభ్యులు ఖాందేష్ శ్రీనివాస్, గుజరాతి నివేదన్, ప్రవీణ్‌పవార్, డిజె దయానంద్ అన్నారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలోని ఖాందేశ్ కాంప్లెక్సులో ఆదివారం ఇటీవల నియామకమైన క్షత్రియ సమాజ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు సహస్రార్జున ఆత్మీయ మిత్ర మండలి ఆధ్వర్యంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ క్షత్రియ కులస్తులైన యువత కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమింపబడడం అభినందనీయమన్నారు. క్షత్రియ విద్యార్థులు, యువత వీరిని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ర్యాంకులు సాధించి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన పవార్ కృపా నక్షత్రతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియామకమైన విశ్వనాథ్ రాజరాజేశ్వరి, కర్తన్ అఖిల, జోబిడె నాగశ్రీ, ఘటడి గీత, చౌల్ శ్రీనివాస్ (చంటి), వాగ్లే దినేష్, ఖోడె శ్రీనివాస్, గటడి రామకృష్ణ, హజారి జగన్నాథ్‌లను పూలమాలలు, శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంగీత ఖాందేశ్, లోటస్ పాఠశాల కరస్పాండెంట్ అంబిక, మిత్రమండలి సభ్యులు జెస్సు ఆనంద్, సాత్ పుతే శ్రీనివాస్, బోబిడె గంగాకిషన్, షికారి రాజు, బోచ్కర్ వేణు, బారడ్ ప్రవీణ్, సంతని విజయ్, గట్టడి రాజేశ్, అల్జాపూర్ రాజేశ్, హజారి ఆనంద్ పాల్గొన్నారు.

# పనిగంటల పెంపు 'జిఒ 282' రద్దు చేయాల్సిందే

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య**



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పనిగంటలు పెంచుతు తెచ్చిన జీవో 282ను వెంటనే రద్దుచేయాలని లేనిపక్షంలో సచివాలయం ముట్టడిచేస్తామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఆదివారం ఏఐటియుసి ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని ఎన్‌టిఆర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ కార్యదర్శి తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార సముదాయాల్లో పనిగంటలను ఎనిమిది గంటల నుంచి 10 గంటలకు పెంచుతు జీవో 282 తీసుకొచ్చినందుకు నిరసనగా జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక పక్క గత ఎనిమిది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, కార్మికుల వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తుంటే, బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం కార్మిక సంఘాల ఆందోళనకు వెనక్కి తగ్గి 12 గంటల పని విధానాన్ని అమలు చేయడానికి భయపడుతున్నసందర్భంలో, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 8 గంటల పని గంటలను రోజుకు 10 గంటలకు పెంచడమన్నది తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిజెపి బాటలో నడుస్తుందనడానికి నిదర్శనమన్నారు. కార్మిక సంఘాలు అన్ని కలిసి జేఏసిని ఏర్పాటు చేసిన పోరాడుతున్న తరుణంలో జేఏసిలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సంఘం కూడా ఉండి పని గంటలు పెంచడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైన ప్రజల పక్షాన పనిచేస్తున్నామని, ఇది ప్రజల ప్రభుత్వం అని ప్రగల్బాలు పలుకుతు ఆచరణలో బిజెపి ప్రభుత్వం వలె యాజమాన్యాలకి అనుకూలంగా చట్టాలు చేయడం సిగ్గుచేటన్నారు. శనివారం దొడ్డిదారిన తెచ్చిన ఈ జీవోను రద్దుచేయకుంటే రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం, అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు చక్రపాణి, భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, స్వప్న, లాయక్, సాయిలు, భానుచందర్, తిరుపతిరెడ్డి, సాయన్న, కైసర్, లక్ష్మణ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఎల్బీగా ఔటైన స్టోక్స్..

### టెయిలెండర్లను చుట్టేయడమే ఆలస్యం!




బర్మింగ్‌హామ్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. వర్షం కారణంగా ఐదో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనా ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పేలా లేదు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే ఓలీ పోప్(24)ను క్లీన్‌బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ (458) వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఊహకందని బంతితో హ్యారీ బ్రూక్(23)ను ఎల్బీగా వెనక్కి పంపి టీమిండియాను గెలుపు వాకిట నిలిపాడు. అయితే.. కెప్టెన్ బెన్ స్టోక్స్(35), జేమీ స్మిత్ (32 నాటౌట్)లు డిఫెన్స్ ఆడుతూ విసిగించారు. ఈ జోడీని విడదీసేందుకు గిల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. చివరకు వాషింగ్టన్ సుందర్ బ్రేకిచ్చాడు. లంచ్‌కు ముందు ఓవర్లో స్టోక్స్ ఎల్బీగా ఔటయ్యాడు. అంతే.. భారత శిబిరంలో సంబురాలు మిన్నంటాయి. భోజన విరామం తర్వాత టెయిలెండర్లను చుట్టేస్తే గిల్ సేన చరిత్ర సృష్టించడం ఖాయం.
ఆకాశ్ పలుమార్లు వికెట్ తీసేలా కనిపించగా.. స్మిత్ అతికష్టమ్మీద వికెట్ కాపాడుకున్నాడు. కాస్త కుదురుకున్నాక ఇద్దరు బౌండరీలతో 50 ప్లస్ భాగస్వామ్యంతో వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే.. స్పిన్నర్లను రంగంలోకి దింపిన గిల్ ఫలితం రాబట్టాడు. లంచ్‌కు ముందు వాషింగ్టన్ సుందర్ వేసిన ఓవర్లో స్టోక్స్ డిఫెన్స్ ఆడబోయి ఎల్బీగా ఔటయ్యాడు. దాంతో, 153 వద్ద ఇంగ్లాండ్ ఆరో వికెట్ కోల్పోయింది. ఇక మిగిలింది టెయిలెండర్లు మాత్రమే. వీళ్లను భారత బౌలర్లు చుట్టేశారంటే ఎడ్జ్‌బాస్టన్‌లో చిరస్మరణీయ విజయం సొంతమైనట్టే.

## ఒలింపిక్స్ ఆతిథ్యంపై అనిశ్చితి..

### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహణకు భారత్ రెడీ






ఒలింపిక్స్ హక్కుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న భారత్ మరో మెగా టోర్నీ నిర్వహణ దిశగా పావులు కదుపుతోంది. 2036 విశ్వ క్రీడల హక్కుల కోసం ప్రయత్నిస్తూనే.. మరో వైపు ప్రతిష్ఠాత్మక వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్యానికి ఇండియా సిద్ధమవుతోంది. రెండేళ్లకోసారి జరిగే ఈ మెగా క్రీడా పండుగకు హోస్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయనుంది భారత్. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో ఆతిథ్యమిచ్చే దేశాల పేర్లను ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలోనే భారత బృందం రెండింటో ఒక్కటోర్నీ రైట్స్ అయినా సాధించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ విషయాన్ని ఆదివారం జాతీయ అథ్లెటిక్ సమాఖ్య అధికార ప్రతినిధి అడిల్లె సుమరివిల్లా ధ్రువీకరించాడు.
వరల్డ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అడిల్లె బెంగళూరులో జూన్ 5 న జరిగిన నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి సీజన్ ప్రారంభోత్సవానికి విచ్చేశాడు. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై స్పందించాడు. 'వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నాం. అందుకే.. 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయాలనుకుంటున్నాం. అయితే.. తదుపరి హోస్ట్ ఎంపిక ప్రక్రియ మొదలవ్వడానికి ఇంకా సమయం ఉంది. కాబట్టి మేము పక్కాగా హోస్టింగ్ రైట్స్ కోసం ప్రయత్నిస్తాం. హక్కులు దక్కించుకున్న దేశాల పేర్లను 2026 సెప్టెంబర్‌లో డబ్ల్యూఎఫ్ వెల్లడిస్తుంది. సో.. మాకు ఈ రెండిటిలో ఏదో ఒక టోర్నీ ఆతిథ్యానికి ఆమోదం లభించినా సంతోషమే. మరో విషయం.. మేము ఇప్పటికే జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 2028 రైట్స్ కోసం అవసరమైన అన్ని పత్రాలు సమర్పించాం' అని అడిల్లె వివరించాడు.



తన పేరుతో నిర్వహించిన 'ఎన్‌సీ క్లాసిక్' టోర్నీలో నీరజ్ చోప్రా ఛాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అతడు ఈటెను 86.18 మీటర్ల దూరం విసిరాడు. కెన్యా అథ్లెట్ జులియస్ యెగొ 84.51 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, రుమేశ్ పథిరగె (శ్రీలంక) 84.34 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు.

## చరిత్ర సృష్టించిన కెన్యా అథ్లెట్

### 13 నిమిషాల్లోనే 5 వేల మీటర్లు..




ట్రాక్ మీద తన ఆధిపత్యాన్ని చాటిన కెన్యా అథ్లెట్ బియట్రిక్ చెబెట్ చరిత్ర సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలతో మెరిసిన ఆమె ఈసారి 5 వేల మీటర్ల పరుగును కేవలం 13 నిమిషాల్లోనే పూర్తి చేసి వరల్డ్ రికార్డు నెలకొల్పింది. అమెరికాలోని యుగెనేలో శనివారం జరిగిన ప్రొఫెంటెన్ క్లాసిక్‌లో చెబెట్ చిరుతలా దౌడు తీసింది. ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురి చేస్తూ గమ్యస్థానం వైపు దూసుకెళ్లిన ఆమె 13 నిమిషాల 58.06 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. సంచలన వేగంతో పరుగు తీసిన చెబెట్ ఇథియోపియా రన్నర్ గుడాఫ్ సెగే పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేసింది. రెండేళ్ల క్రితం ఇదే వేదికపై గుడాఫ్ 14:00.21 టైమింగ్‌తో 5 వేల మీటర్ల పరుగును పూర్తి చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో చెబెట్ దేశానికి రెండు గోల్డ్ మెడల్స్ అందించింది. 5 వేల,10 వేల మీటర్ల పరుగులో పసిడి పతకంతో కెన్యా గర్వపడేలా చేసింది. గత నెలలో రోమ్‌లో 5 వేల మీటర్ల రన్‌లో పాల్గొన్న ఆమె 14:06.39 టైమింగ్‌తో రేసును ముగించింది. ఈసారి ప్రెఫొంటెన్ క్లాసిక్‌లో తన ప్రదర్శనను మెరుగుపర్చుకున్న చెబెట్ రికార్డులు బద్ధలు కొడుతూ విజేతగా నిలిచింది.

# ఫోకస్

# ఆరోగ్యం

## నిర్లక్ష్యం ప్రాణం తీస్తుంది!



ఆరోగ్యం విషయంలో ఏ చిన్నపాటి నిర్లక్ష్యమైనా ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తుందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల కబడ్డీ ఆటగాడు బ్రిజేష్ సోలంకి మృతి స్పష్టం చేస్తున్నది. రాబిస్ వ్యాధి సోకడంతో, అత్యంత తీవ్రమైన అనారోగ్యానికి గురై అతను ప్రాణాలు కోల్పోయిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. కాలువలో పడిన కుక్కపిల్లను రక్షించే క్రమంలో అది కొరకడంతో బ్రిజేష్‌కు చిన్నగాయమైంది. ఆ సంఘటనను అతను ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే, క్రమంగా రాబిస్ వ్యాధి లక్షణాలు కనిపించడంతో, జూన్ 26న అలీగఢ్‌లోని ఖుర్జా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికీ వ్యాధి ముదిరిందని వైద్యులు ప్రకటించారు. చికిత్స కొనసాగుతుండగానే, వ్యాధి లక్షణాలు తీవ్రమై, చివరికి బ్రిజేష్ మృతి చెందాడు. వ్యాధుల విషయంలో ఏ అంశాన్నీ తేలిగ్గా తీసుకోరాదని ఇలాంటి ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యాధి లక్షణాలను ప్రస్తావిస్తే, రాబిస్ ఒక ప్రమాదకరమైన వైరస్ వల్ల మనుషులకు సంక్రమిస్తుంది. ఇది ప్రధానంగా ప్రాణాలు పొడచేసే జంతువుల కాటు లేదా స్క్రాచ్ ద్వారా మనుషులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధిని కలిగించే వైరస్ పేరు 'రాబిస్ లిస్సావైరస్'. సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది మానవులలో మానసికస్థితి మార్పులు, కోమా, చివరికి మరణానికి దారితీస్తుంది. కుక్కలు, కోతులు, నక్కలు, గబ్బిలాలు తదితరాల కాటు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఆయా జంతువుల నోటి లాలాజలం మనిషి శరీరంలోకి గాయం లేదా నోరు లేదా కళ్ల ద్వారా వెళ్లడం ఈ వ్యాధి సోకడానికి ప్రధాన కారణం. ఎక్కువగా రాబిస్ ఉన్న జంతువుల కాటు వల్ల వ్యాధి వస్తుంది. రాబిస్ వైరస్ నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. అది మెదడులోకి ప్రవేశించి జీవితాంతానికి హాని చేస్తుంది.


**సాధారణ లక్షణాలు:** జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట, గాయపడ్డ చోట వద్ద నొప్పి, మంట.

**వ్యాధి తీవ్రమైనప్పుడు కనిపించే లక్షణాలు:** నీటి భయం (హైడ్రోఫోబియా), గాలి భయం (ఏరోఫోబియా), మానసిక స్థితిలో మార్పులు, తీవ్రమైన ఆందోళన, ఆలాంటి ఆలోచన లేకుండా మొండిగా వ్యవహరించడం, పక్షవాతం, కోమా. చివరికి ఈ లక్షణాలతో వ్యాధిగ్రస్థుడు ప్రాణాలు కోల్పోతాడు.

**పరీక్షలు:** మెదడు, మెదడు శుక్లాలు (సిఎస్ఎఫ్) పరీక్ష, గాయమైన ప్రాంతం నుంచి నమూనాలు తీసుకొని వైరస్‌ను గుర్తించడం, శరీర ఉష్ణోగ్రత, నాడీ వ్యవస్థ పనితీరును బట్టి అంచనా వేస్తారు.

**చికిత్స:** ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్ప రాబిస్ వ్యాధికి సరైన చికిత్స లేదు. ఒకసారి లక్షణాలు ప్రారంభమైన తర్వాత వ్యాధిని అదుపుచేయడం లేదా తగ్గించడం దాదాపు అసాధ్యం. కాబట్టి, కుక్క లేదా మరేదైనా జంతువు కరచినప్పుడు వెంటనే వైద్యం చేయించుకోవాలి. యాంటీ రాబిస్ ఇంజక్షన్ తప్పనిసరి. ప్రధానంగా ప్రోఫిలాక్టిక్ వ్యాక్సినేషన్ (రోగం వచ్చే ముందు ఇచ్చే టీకాలు), తక్షణ చికిత్స అవసరం. జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని స్వచ్ఛమైన నీటితో, సబ్బుతో కనీసం 15 నిమిషాలపాటు శుభ్రం చేయాలి. ఆ వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. రాబిస్ వ్యాక్సిన్‌ను జంతువు కరచిన రోజు, ఆ తర్వాత 3, 7, 14, 28వ రోజు తీసుకోవాలి లేదా వైద్యులు సూచించిన విధానాన్ని అనుసరించాలి. కొన్ని సందర్భాల్లో రాబిస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఆర్ఐజి) అవసరమవుతుంది.
ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడమే రాబిస్ వ్యాధి సోకకుండా, వ్యాపించకుండా ఉండడానికి ప్రధానం. మన చుట్టుపక్కల ఎక్కువగా కనిపించే కుక్కలు, పిల్లులకు వ్యాక్సిన్ వేయించాలి. జంతువులు కరచినప్పుడు, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చికిత్స తీసుకోవాలి. వీధి కుక్కల నుంచి దూరంగా ఉండాలి. రాబిస్ రోగుల రక్తం, శ్వాస, లాలాజలం తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మన దేశంలో ఏటా సుమారు 20,000 మంది రాబిస్ వ్యాధి కారణంగా చనిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. కుక్కలు, పిల్లులు, ఇతర జంతువులు కరచినప్పుడు తక్షణమే సరైన చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే, పర్యవసానం ఎలావుంటుందనేది బ్రిజేష్ ఇతివృత్తం స్పష్టం చేస్తున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి, ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడే అవకాశం కోసం పోటీపడుతున్న అతని అకాల మరణం దురదృష్టకరం... అత్యంత బాధాకరం.

### జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులే అధికం!



అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎద్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మ జీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను జునోటిక్ వ్యాధులుగా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మ జీవులు, 60 వరకు పరాన్న జీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. ప్రపంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది. దాదాపు 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మ జీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజల వద్ద పెంపుడు జంతువులు ఉన్నాయి. వాటితో పాటు, ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## దోపిడీ రహిత సమాజమే లక్ష్యం




### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి/శేరిలింగంపల్లి :** నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసమే భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి మండల సిపిఐ 4వ మహాసభ ఆదివారం ఇజ్జత్‌నగర్‌లో జరిగింది. ఈ మహాసభలో సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్న పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పోరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతుందని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వారి మద్దతు ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ ఎక్కువ కేటాయించడం, వెనక బడిన రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అన్నారు. గత ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రజాపోరాటాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించుకోవడానికి జాగలేని పేదలకు 60 గజాల చొప్పున ఇంటి జాగాను కేటాయించాలని కోరారు.

**నూతన సమితి ఎన్నిక...**
అనంతరం మహాసభలో సిపిఐ శేరిలింగంపల్లి నూతన మండల సమితిని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రకటించారు. శేరిలింగంపల్లి సిపిఐ మండల సమితి కార్యదర్శిగా టి.రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సహాయ కార్యదర్శిగా కె చందు యాదవ్‌తో పాటు 15 మంది కార్యవర్గ, 31మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రకటించారు.

## బయ్యారం ఉక్కు మానుకోట హక్కు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బయ్యారం ఉక్కు మానుకోట ప్రజల హక్కు అని, తెలంగాణ రాష్ట్ర విభజన చట్టం అమలు చేసేదాకా సిపిఐ ఉద్యమిస్తుందని, జిల్లా సమగ్రాభివృద్ధికి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని మహబూబాబాద్ జిల్లా కురవిలో పోగుల శ్రీనివాస్ గౌడ్ ప్రాంగణం ఓం ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిపిఐ జిల్లా మహాసభల రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. వందేళ్ళ చరిత్ర కలిగిన సిపిఐ సుదీర్ఘ ప్రయాణంలో శ్రమజీవుల కోసం ప్రజలను నిత్యం చైతన్య పరుస్తూ, పేదల పక్షాన నిలిచి పోరాడుతోందన్నారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ అనేక ఆందోళనా కార్యక్రమాలు చేశామని, విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఆనాటి బిఆర్ఎస్, బిజెపి విధానాలను ఎండగట్టామని విజయసారథి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో రెండు చోట్ల ప్రభుత్వ భూములను గుర్తించి పేదలతో గుడిసెలు వేయించామని, ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ పక్షాన ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కురవి ప్రభుత్వ భూముల్లో పేదలచే గుడిసెలు వేయించి భూపోరాటాలు కొనసాగిస్తున్నట్లు, సిపిఐ జిల్లా 4వ మహాసభల నాటికి ప్రతి మండలంలో పార్టీ కమిటీలు, శాఖలు ఏర్పాటుచేసుకుని పార్టీ బలోపేతానికి, మహాసభ తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి పార్టీని ముందుకు తీసుకువెళ్ళాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లు, మున్సిపాలిటీలో వార్డుల్లో సిపిఐ పక్షాన సత్తా చాటాలని జిల్లా సెక్రటరి విజయసారథి పిలుపునిచ్చారు. కార్యదర్శి నివేదికను ప్రతినిధుల సభ చప్పట్లతో ఆమోదించింది.

**సిపిఐ ప్రతినిధులకు డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ సందేశం...** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ సిపిఐ మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభల ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులుగా ప్రతినిధుల సభకు సౌహార్ద సందేశాన్ని పంపించారు. సందేశాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ప్రతినిధుల సభలో చదివి వినిపించారు. వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావాలని సందేశం ద్వారా ఆకాంక్షించారు. ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు అరుణపతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య ఎగురవేశారు. అమరవీరుల స్థూపం వద్ద ముఖ్య అతిథులు, జిల్లా సిపిఐ నేతలు, ప్రతినిధులు నివాళులర్పించారు. రేషపల్లి నవీన్, తుర్క రమేష్, మామిండ్ల సాంబలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరావు, కరణం రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, పాండురంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి వ్యతిరేకంగా పోరాడుదాం




### సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** అవినీతినికి వ్యతిరేకంగా పోరాడదామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు పిలుపునిచ్చారు.. సివిల్ వ్యవహారాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది ఎస్ఐలపై తక్షణమే జిల్లా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ గద్వాల జిల్లా కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాల ఒత్తిళ్లకు తలొగ్గి కొంతమంది పోలీసు అధికారులు ప్రజలకు ఇబ్బందుల కలిగిస్తున్నారని ఈ మధ్య జరిగిన సంఘటనలే ఉదాహరణ అన్నారు. కొంతమంది ఎస్ఐలు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై జిల్లా పోలీస్ యంత్రంగం తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండలాల్లో ఇంటలిజెన్సీ నిఘా పెంచాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన సివిల్ భూతగాదాల కేసులపైన సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. చాలా మండలాల్లో ప్రజలు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు బలైపోతున్నారని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రాజకీయ నాయకుల పైన మాత్రం పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ గ్రామాల్లో మండలాల్లో వచ్చిన ఫిర్యాదులపై దృష్టి పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే, పోలీసులపై ఒత్తిడి తెచ్చే నాయకులకు గుర్తించి వారి పట్ల కఠినంగా వ్యవహించాలని డిమాండ్ చేశారు. పోలీస్ అధికారులు అవినీతికి దూరంగా ఉండి అవినీతిని జిల్లా నుండి తరిమికొట్టడానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆంజనేయులు తెలిపారు.

## మోదీ పాలనలో ఉద్యోగ అవకాశాలు ఏవీ?

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

### ఎర్రజెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించిన పువ్వాడ






**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో పదవీ విరమణలు తప్పా రిక్రూట్‌మెంట్స్ లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రభుత్వరంగంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు కేంద్రప్రభుత్వం ప్రయత్నించకపోగా, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేయడంతో కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర ఐదవ మహాసభ ఆదివారం సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో జరిగింది. సభకు ముందు నగరంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి మహాసభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మహాసభలో బాగం హేమంతరావు మాట్లాడు తూ బిజెపి పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని దేశ సంపదను ప్రైవేటుకు దారాదత్తం చేయడంలో మోదీ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. మోదీ పదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు 114 శాతం పెరిగాయని, తలసరి ఆదాయం తగ్గి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 మాసాలు గడిచిన ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్‌కు సిపిఐ కట్టుబడి ఉందన్నారు. అధికారం కోసం బిజెపి కలలు కంటుందని, చైతన్యవంతమైన తెలంగాణలో బిజెపి కల నెరవేరదన్నారు. పార్టీ విస్తరణే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు.

**సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు : పువ్వాడ**
సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు ఉన్నాయని ఈ స్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు.మహాసభలో ప్రారంభ ఉపన్యాసం చేసిన పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలపడితే సమాజానికి శ్రేయస్కారమన్నారు. బలపడేందుకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించుకోవాలని పువ్వాడ సూచించారు. యువతరానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆహుతులను ఆహ్వానించారు. మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మినారాయణ, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మోహన్‌రావు, జాకీర్ పాల్గొనగా మహాసభకు వరదా నర్సింహారావు, కె.సతీష్‌రెడ్డి, నామ విజయ్‌కుమార్, ఆముదాల వెంకన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

**భారీ ప్రదర్శన :** సిపిఐ నగర మహాసభలను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కోలాట, డప్పుదళాలతో వందలాది మంది సిపిఐ కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొన్నారు. సిపిఐ ప్రదర్శనతో పట్టణం అరుణ పతాక రెపరెపలతో కొత్త శోభను సంతరించుకుంది.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి

మున్సిపాలిటీ కమిషనర్ సుష్మ

**ప్రజాపక్షం/పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని నివాస గృహాల మధ్యలో గల ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని పరకాల మున్సిపాలిటీ కమిషనర్ సుష్మ పట్టణ ప్రజలను కోరారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున నివాసాల మధ్యలో ఉండబడిన ఖాళీ ఇంటి స్థలాలలో యజమానులు పిచ్చి మొక్కలు తొలగింపు తో పాటు గుంతలలో మొరం నింపాలన్నారు. పిచ్చి మొక్కలు, వర్షపు నిలువ ఉండటం వలన దోమల బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆమె అన్నారు. దానివలన ఆయా ప్రాంతాలలో ఉండబడిన ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. పరకాల పట్టణంలో ప్లాట్లు కొని ఇతర మండలాల్లో ఉన్న భూ యజమానులు వారి స్థలాలలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. లేనియెడల మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పరకాల మున్సిపాలిటీ కమిషనర్ సుష్మ తెలిపారు.

## సిఎస్ఎటి ఉచిత శిక్షణకు దరఖాస్తు ఆహ్వానం

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం బంజార హిల్స్ హైదరాబాద్ నందు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సిఎస్ఎటి) 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు నిరుద్యోగులైన, అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల వారు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ సంచాలకులు డాక్టర్ కె. జగన్ మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షిక ఆదాయం 3లక్షలు మించకుండా ఉన్నటువంటి వారు http://tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో మాత్రమే ఈనెల 07వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న ఉదయం 10.30 నుంచి 1.30వరకు యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాల సుబేదారి హన్మకొండ నందు ఎంపిక పరీక్షా నిర్వహించడం జరుగుతుందని, ప్రవేశ పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ప్రవేశం కల్పించి ఎస్‌సి స్టడీ సర్కిల్ బంజార హిల్స్ హైదరాబాద్‌లో సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత వసతి భోజనంతో కూడిన 10 నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావునా అర్హులైన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## బిటెక్ విద్యార్థిని హాసినికి సహాయం

రూ. లక్షా 7వేల ఫీజు చెల్లింపు




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** విద్యఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అనంతసాగర్ ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వరంగల్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని కొంగల హాసినికి కళాశాల ఫీజు నిమిత్తం అమెరికాలో ఉంటున్న కొండపల్లి దీప్తి ఆర్థిక సహకారంతో రూ.1,07,000 (లక్షా ఏడు వేయిలు)ల చెక్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్, ఒయాసిస్ ఆశ్రమ నిర్వాహకులు ఒద్దిరాజు ప్రకాష్‌లు అందించారు. వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో జరిగిన సమావేశంలో బిల్ల మహేందర్ మాట్లాడుతూ పౌండేషన్ విన్నపం మేరకు హాసినిని దత్తత తీసుకొని ప్రతి సంవత్సరం ఫీజు చెల్లిస్తూ విద్యాభివృద్ధి కోసం పాటుపడడం చాలా అభినందనీయమని, ఈ సందర్భంగా బాలికల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న దీప్తికి ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఫౌండేషన్ గౌరవ సలహాదారులు గురిజాల తిరుపతి రెడ్డి, సభ్యులు వెల్దండి లీల, టి. నర్సింగరావు, వైద్యుల వాణిరాణి, కదుదుల సో మన్న, ఉదయ్, కార్తీకరాజు, కాంచనపల్లి అనిత, మహ్మద్ రఫీ, కొక్కుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లోనే పురుడుపోసిన ఆపద్బాంధవుడు



**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** పురిటినొప్పులతో బాధపడుతూ దట్టమైన అడవిలో కనీసం రోడ్డు మార్గం కూడా లేని వాగులు దాటుకొని కారు చీకట్లో ఓపికతో వేసిన అడుగులు వారిని అంబులెన్స్ వచ్చి రక్షిస్తుందని వివరాల్లోకి వెళితే ఏటూరునాగారం మండలం వీరాపురం గ్రామానికి సమీపంలోని దట్టమైన అడవిలో కోయగుంపుకు చెందని సోలం భొజ్జె(26) మొదటి కాన్పు పురిటి నొప్పులు రావడంతో 108కి కాల్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న 108 ఏటూరునాగారం సిబ్బంది శివలింగం ప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని గర్భిణీ స్త్రీని రోడ్డు మార్గం వరకు తీసుకురావడానికి చేయూతనిచ్చారు. గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో వీరాపురం ఊరి చివరిలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన ఈఎంటి శివలింగం ప్రసాద్ సుఖ ప్రసవం చెయగా పండంగి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనంద భాష్పాలను రాల్చింది. తల్లి బిడ్డలకు కావాల్సిన మందులు అందించి, మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించి విషయాన్ని వైద్యులకు వివరించి ఆసుపత్రిలో చేర్పించారు. బయట ప్రపంచానికి దూరంలో ఉన్న గొత్తికోయ కుటుంబానికి భరోసాగా నిలిచి సుఖ ప్రసవం చేసిన అంబులెన్స్ సిబ్బందికి గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రిపుల్ ఐటి బాసరలో సీటు సాధించిన రాయపర్తి విద్యార్థిని

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని జిల్లా పరిసత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని మర్రి రక్షిత 10వ తరగతిలో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి బాసర ట్రిబుల్ ఐటిలో సీటు సాధించడం జరిగింది. విద్యార్థిని రక్షితను పాఠశాల హెచ్‌ఎం, డిసిఇబి సెక్రటరీ గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## అనాథ పిల్లలకు అండగా గండ్ర



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బానోత్ చందన దేవేందర్ భార్యా భర్తలు ఇద్దరూ మరణించగా అనాథ పిల్లలకు అండగా నిలిచాడు. వారి పెద్ద కుమారుడు రిషి చదువు కోసం భూపాలపల్లి మైనారిటీ స్కూల్లో అడ్మిషన్ ఇప్పించి వారి ఉన్నత చదువులకి అండగా ఉంటామని చెప్పిన మాటను ఆచరణలో పెట్టడం జరిగింది. వారి ఉన్నత చదువులు పూర్తి అయ్యే వరకు పూర్తి బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట సంతోష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:**ఇంకుడు గుంతలే ఇంటికి చెరువుల లాంటివి. వాటి వలన భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరు ఇందులో బాగస్వాములై భూగర్భ జలాలు పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. జిల్లాలో భూగర్భ జలాల పెంపు కోసం మన జిల్లామన నీరు అనే బృహత్తర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ పంచభూతాల్లో మానవ మనుగడకు ప్రధానమైంది గాలీ నీరు అన్నారు. కలుషితం లేని గాలీ, నీరు దొరకాలంటే చెట్లను విరివిరిగా పెంచడమే కాకుండా నీటి బొట్టును వృధా కాకుండ కాపాడడం ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఇళ్లు కాలనీ, గ్రామం, మండలం, జిల్లా ఇలా వివిధ స్థాయిలో నుండి వాటిని రక్షించుకుంటేనే మన రాష్ట్రం సుభిక్షంగా పచ్చదనంగా ఈ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో జనగామ జిల్లాలో స్వచ్ఛమైన గాలి కోసం విరివిగా మొక్కలు పెంచుతున్నామని, అలాంగే వర్షపు నీటిని ఓడిసి పట్టేందుకు మన జిల్లామన నీరు అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. చుక్కనీరు వృధా కాకుండా తక్కువ ఖర్చుతో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు వారసత్వ సంపదగా భూములు ఆస్తులు, ఉండేవి, ఇప్పుడు గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా మన భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, కలుషితం లేని నీరు అందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మన చుట్టూ పచ్చదనం ఉండాలని, ఆ పచ్చదనం కోసం ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 30లక్షల మొక్కలు నాటడడం లక్ష్యంగా పెట్టుకొని విజయవంతంగా జరిగేందుకు వివిధ శాఖల అధికారులు కార్యాచరణ రూపొండించడం జరిగిందన్నారు. పచ్చదనం వల వర్షాపాతం నమోదుతో కూడా విపరీతమైన మార్పులు వస్తాయని, దీనికి సాగు, తాగు నీరే మూలాదారం అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షపు నీరు వృధా కాకుండా ప్రతి బొట్టు భూమికి ఇంకాలి అన్న లక్ష్యంతో తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపటామన్నారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక ఇంకుడు గుం త, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలు, హాస్పటల్స్‌లో ఎక్కడ వీలుంటే అక్కడ ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**జిల్లాలో 5వేల ఇంకుడు గుంతలు :**జిల్లాలో ఐదు వేల ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయితీ సిబ్బంది కీలక పాత్ర పోస్తుందని, గ్రామాల్లో వృధాగా ఉండే బండరాళ్ల శిథిలావస్థ భవనాలను తొలగించినిర్మాణాలు చేపటాద్దలన్నారు.

## అందాల సోయగం.. బొగత



**ప్రజాపక్షం/వాజేడు :**తెలంగాణ నయాగరా జలపాతంగా పేరుగాంచిన బొగత జలపాతం అందాల సోయగంగా కనువిందు చేస్తుంది. ఆ అటవీ ప్రాంతంలో పక్షుల కేరింతల నడుము జలసవ్వడిలా బొగత అందాలు పర్యాటకులని మంత్రముగ్ధులను చేస్తుంది.ములుగు జిల్లా వాజేడుమండలంలో చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతానికి ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ రాష్ట్రాల జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు బొగత జలపాతంలో జలకల సంతరించుకుంది. పర్యాటకులు ఈతలు కొడుతూ సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:**ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం వాజేడు మండలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పర్యటన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.

## ఎన్ఐటిలో కెనరా బ్యాంకు మెగా ప్లాంటేషన్




**ప్రజాపక్షం/కాజీపేట :** కెనరా బ్యాంకు 120వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాజీపేటలోని జాతీయ విద్యా సాంకేతిక సంస్థ (ఎన్ఐటి)లో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండలోని కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఐటి డైరెక్టర్, ప్రొఫెసర్లు, కెనరా బ్యాంకు అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బందికి బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ పంకజ్ కుమార్, సంజీవ్ కుమార్ బిజె, బ్రాంచ్ మేనేజర్ లు తలారి శ్రీనివాస్, బిస్వజిత్, రాజ్ నారాయణ్, రాజ్ కుమార్, శంకర్ నారాయణ్, బి.రాజేశ్, ఎన్ఐటి ప్రొఫెసర్లు డి. శ్రీనివాసాచార్య, పివి సురేష్, కిరణ్ కుమార్,మురళీమోహన్, వి. రాంసాగర్, కేఎస్ రాజ్ మోహన్, కెనరా బ్యాంకు బ్యాంకు మేనేజర్లు ,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ డేటా ఎరేజ్ బాధ్యులపై కఠిన చర్యలు

విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేక రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

పాలిటెక్నిక్ విద్యార్థుల జెఏసి రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం గడిచిపోయినా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో పర్యవేక్షణ కరువై అధికారుల్లో తీవ్ర అలసత్వం పెరిగిందని, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యా సంవత్సరపు పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ తీవ్ర గందరగోళంగా మారిందని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జెఏసి రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ తేదీనుండి మొదలు, కౌన్సిలింగ్, సీట్ అలాట్మెంట్ తేదీల షెడ్యూల్ ప్రకటనలవరకూ అధికారులు నిర్లక్షంగానే వ్యవహరించారని, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 04వ తేదీలోపే జరగాల్సియున్న పాలిసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపులు నేటికీ జరగలేదని తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికై జరుగుతున్న పాలిసెట్ 2025 కౌన్సిలింగ్ ప్రక్రియలో మొదటి విడత అడ్మిషన్ల కేటాయింపు సీట్ అలాట్మెంట్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 04వ తేదీలోపు జరుగకపోవడంతో విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో ఆందోళన, అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. మరోవైపు పాలిసెట్ డేటా ఎరేజ్ అయిందని వస్తున్న వార్తలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. కావున, విద్యాశాఖను తనవద్దే ఉంచుకుని పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంపట్ల తక్షణమే స్పందించి పాలిసెట్ సీట్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తిచేయించేందుకు కృషిచేయాలని విద్యార్థుల తరుపున, తల్లిదండ్రుల తరుపున మేకల అక్షయ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. పాలిసెట్ సీట్ల కేటాయింపు ఆలస్యానికి కారణమని వస్తున్న 'డేటా ఎరేజ్?' వార్తలు నిజమైతే సంబంధిత సాంకేతిక విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## దేశవ్యాప్త సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడెలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కార్మిక సంఘాల నాయకుల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుసుమ శ్యాంసుందర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల శ్రమనుదోచే లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న నరేంద్ర మోదీ కార్మికులకు అనుకూలంగా ఉన్న కొద్దీ చట్టాలను మార్చి వారి శ్రమను దోచుకోవడం సరైనది కాదని తెలిపారు. ధరలను నియంత్రించాలనీ తెలిపారు. సోమవారం వేయి స్తంభాల గుడి నుండి కలెక్టరేట్ వరకు జరిగే బైక్ ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు తాను, కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, కాంగ్రెస్ శ్రేణులు కూడా సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## చెరువు మరమ్మతు పనులు ప్రారంభించిన సొంటి రెడ్డి



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అలంకాని పేట ఊర చెరువు మరమ్మతులు ప్రారంభించిన టిపిసిసి సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకే రైతన్నల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గ్రామంలో అతి పెద్ద చెరువు అయినా ఉర చెరువుకు స్థానిక శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి ఇటీవల మంజూరు చేయించిన నిధులతో చెరువు మరమ్మతులు చేస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కీ అశోక్, నర్సంపేట న్యాయస్థాన ఎజిపి బండి శివకుమార్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,కాంగ్రెస్ నేతలు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సముద్రాల కనకయ్య, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎడంపాక ప్రకాశం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులు గాజుల కృష్ణ, మాజీ ఎంపిటిసి మాదాసు రామ్మూర్తి, మాజీ సర్పంచి ఎడ్ల కృష్ణయ్య, సముద్రాల మల్లయ్య, కోల నరేష్, దయాకర్ ,అన్వేష్, యాకయ్య సొల్లేటి రాజు, సమ్మయ్య, మంగిశెట్టి కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బీరన్న బోనాలకు హాజరైన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :**వరంగల్ నగరంలోని కరీమాబాద్ బీరన్న గుడి నందు బీరన్న బోనాలకు హాజరైనా మంత్రి కొండా సురేఖ ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరే కృష్ణ ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న స్వామిని కొలుస్తారని తెలిపారు. కురుమ కులస్తులు భక్తిశ్రద్ధలతో పూర్వీకుల కానివ్వండి వస్తున్న ఆనవాయితీని ప్రతి ఏటా తొలి ఏకాదశినాడు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం విశేషం అని తెలిపారు.

**బోనం ఎత్తడం ఒక ప్రత్యేకత అయితే ఇక్కడ గొర్రెను కురమ పూజారులు గావ్ పట్టడం మరో ప్రత్యేకత**

వరంగల్లులో తొలి బొనం బీరన్నకే కావడం సంతోషంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బోనాల జాతరకు ప్రభుత్వం నుండి అన్ని సహాయ సాహకారాలు అందుతున్నాయని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇక్కడ జరుగుతున్న బీరన్న గుడిలో కూడా వచ్చేటటువంటి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. రాష్ట్రంలో మొదటి బోనం వరంగల్ భద్రకాలిదే అనుకున్నా, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సంకల్పం ఆగింది. మళ్లీ పునరాలోచన చేసి ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ తో పాటు బీరన్న గుడి ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరే కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, కమిటీ సభ్యులు నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ పల్లం పద్మా రవి, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపాల నవీన్, రాజ్, ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనారు.

## చికిత్స పొందుతున్న సోమయ్యను పరామర్శించిన ఝాన్సీరెడ్డి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్ తండ్రి సోమ సత్తయ్య ఇటీవల అనారోగ్యానికి గురి కాగా చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా విషయం తెలుసుకున్న టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి సోమయ్యను పరామర్శించారు. సోమయ్య ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా ఝాన్సీరెడ్డి వెళ్లి ఆరోగ్య పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందని సోమయ్యను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. ఝాన్సీరెడ్డి వెంట మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోశ్, సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్ రావు, పెదగాని సోమయ్య, ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో జనని మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, మహిళలతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలు ఆత్మగౌరవంతో బతుకుతారని తమ ప్రభుత్వం నమ్ముతోందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధంగా, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలయ్యపల్లి బిఆర్ఎస్ నాయకులు**

కొత్తపల్లిగోరి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, పార్టీలో చేరిన వారిలో వంగ యాదగిరి, వంగ కుమారస్వామి, దుండబోయిన భిక్షపతి, బట్టు రమేష్, వంగ రాజు తదితరులు పార్టీ లో చేరారు.

## ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** వరంగల్ హెడ్ పోస్టాఫీస్ లో పనిచేసే ఉద్యోగుల లో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను అందజేయడం జరిగింది. జఫర్‌గడ్ సబ్ పోస్టాఫీస్‌ఓ పనిచేసే ఎండి అంకూస్‌కి రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్ చేయించడంలో మొదటి స్థానంలో నిలవడం జరిగింది. దీంతో వరంగల్ పోస్టల్ సూపరిండెంట్ రవి కుమార్, వరంగల్ నార్త్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ సైదా అంకూస్‌కు అవార్డు ప్రదానం చేయడం జరిగింది. గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించడంలో ఎంక్షి అంకూస్ వరుసగా 7 సంవత్సరాలు మొదటి స్థానంలో నిలవడం విశేషం.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ‘ఉద్దీపకము-2’ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:ఉద్దీపకము 2 పుస్తకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని బంగారు చెలక పంచాయితీ చింత పెంటిగూడెంలో హై లెవల్ బ్రిడ్జీ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పిఒను మంత్రి అభినందించారు. గిరిజన విద్యార్థుల మేలకు కోసం ప్రత్యేక పుస్తకాలు అచ్చు వేయించి వారి చదువులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయడం గర్వకారణం అన్నారు. ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, ఇరిగేషన్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు పలువురున్నారు.



## ఎఐటియుసి గ్రామపంచాయతీ వర్కర్స్ నూతన కమిటీ



ప్రజాపక్షం/సుజాతనగర్;ఎఐటియుసిగ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్లో ఎఐటియుసిజిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుజాతనగర్ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా లాలు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, గౌరవ సలహాదారుడుగా గణేష్, కాంతారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా దుర్గా, సహాయ కార్యదర్శిగా బాలు, లక్ష్మి ,ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితో పాటు మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతను ఇచ్చినందుకు గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

## డాక్టర్ రుద్ర గౌతమ్‌కు మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మంలోని సురక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్, ప్రముఖ ఎండి (జనరల్ ఫిజీషియన్) డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్ మెడికల్ ఎక్స్‌లెన్స్ 2025 అవార్డును పొందారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ హరిచందన చేతుల మీదుగా డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్ మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఖమ్మం సురక్ష సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు, ఉచితంగా మందులు డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్ ఆధ్వర్యంలో అ ందజేశారు. సుమారు 30 వేల మందికి వివిధ రకాల వైద్య సేవలను ఆ యన అందించారు. డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్ అందించిన సేవలకు గు ర్తింపుగా మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు పొందారు. అవార్డు పొందిన డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్‌ను నగరంలోని ప్రముఖ వైద్యులు, పుర ప్రముఖులు, ఆసుపత్రి సహచరవైద్యులు,సిబ్బందితదితరులు అభినందనలు తెలిపా రు.

## ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలి

ప్రజాపక్షం/భద్రాచలం : నేడు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అధికాలుపై నమ్మకంతో ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుండి తరలి వచ్చి దరఖాస్తులు అందిస్తుంటారని, ప్రజలనమ్మకాన్ని ఒమ్ముచేయకుండా అధికారులు విధిగా హాజరై సమస్యల పరిష్కరానికి కృషి చేయాలన్నారు.

## రాంబాబు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: బంగారుచెలక గ్రామంలో ఇటీవల మృతి చెందిన చోడవరపు రాంబాబు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. దశదిన కార్యక్రమంలో భాగంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్‌తో కలిసి ఆ గృహానికి చేరుకున్న ఆయన రాంబాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ సానుభూతి పరుడిగా ఉన్న రాంబాబు మంచి మనసున్న వాడని చెప్పారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడం బాధాకరమని, మనోధైర్యంతోఉండాలని చెబుతూ కుటుంబానికి సంతాపాన్ని సానుభూతిని ప్రకటించారు.

## ఘనంగా డా.బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

పూలమాల వేసి నివాళులర్పించిన డా.మట్టా దయానంద్



ప్రజాపక్షం/సత్తుపల్లి:- భారత దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై , జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుజలా రాణి, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరు:మణుగూరు మండల పరిధిలోని సమితి సింగారం పంచాయతీ, గుట్ట మల్లారం పంచాయతీలో ఆదివారం సుమారు కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ శంకుస్థాపనకార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒశ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాల్వంచలో ‘కబ్జా డేగలు’

అక్రమ కట్టడాలు అరికట్టడంలో అధికారుల చోద్యం* పెద్ద ఎత్తున చేతులు మారిన ముడుపులు

* చట్టం ఉన్నోడి చుట్టమాయె ...

ప్రజాపక్షం/పాల్వంచ: దినదినాభివృద్ధి చెందుతున్న పాల్వంచలో ప్రభుత్వ భూములను చెరబడుతున్న అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కలెక్టర్ కార్యాలయం నిర్మాణంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీనితో కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. నిలువరించాల్సిన అధికార గణం వారికి లోపాయికారిగా వత్తాసు పలుకుతుండటంతో ప్రభుత్వం అసైన్డ్ భూముల్లో బడాబాబులు పాగా వేస్తున్నారు. వెంచర్లు వేసి దర్జాగా విక్రయిస్తున్నారు. అక్రమంగా కొల్లగొట్టిన సంపాదనతో అందిన కాడికి దోచుకొంటున్నారు. ఖాళీజాగా కనబడితే కబ్జా చేస్తున్నారు. పాల్వంచలో ఓ కళాశాల దగ్గర 817 అసైన్డ్ భూమిలో ఒ కెటిపిఎస్ ఎడిఇ స్థాయి అధికారి ఓ భారీ భవంతిని అక్రమంగా నిర్మిస్తున్నారు. కళ్ళెదుట కనపడుతున్నా కన్నెత్తి చూడటం లేదని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై విమర్శలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులు ఇచ్చే ముడుపులకు ఆశపడి అటువైపు చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు మూడు వేల ఎకరాలున్న సర్వే నెంబర్ 817 అక్రమార్కులకు వరంగా మారింది. దీనితో దొంగ పత్రాలు సృష్టించి భూ ఆక్రమణలకు తెరలేపుతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అనధికారికంగా వెంచర్లు వేసి విచ్చల విడిగా సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా కెఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో అసైన్డ్ భూమిని ఆక్రమించిన కెటిపిఎస్ఎడిఈఇ స్థాయి అధికారి ఒకరు రాజసౌధాన్ని తలదన్నే రీతిలో భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. దీని వెనుక అధికారుల ప్రమేయం ఉందని , అక్రమార్కులు పెద్ద ఎత్తున అందించిన ముడుపులను పుచ్చుకొన్న సంభంధిత అధికార గణం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఓ నిరు



పేద తన కనీస అవసరాల కోసం చిన్న ఇల్లు నిర్మాణం చేసుకుంటే అనుమతులు లేవని కూల్చివేతలకు సిద్ధపడుతున్న మున్సిపాలిటి అధికారులు బడాబాబులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోనేందుకు వెనకాడటంలో మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు. చట్టం ఉన్నోడి చుట్టమయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అందుబాటులోకి రాని టిపిఒ :**

ఈ విషయంపై కార్పొరేషన్ పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయ టిపిఒ నవీన్ కుమార్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

## జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివనావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: జన్కో యాజమాన్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలిఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ కెటిపిఎస్ వద్ద బాధితులు చేపట్టిన నిరసన శిబిరాన్ని ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషాతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేటిపిఎస్ 6వ దశ స్థానిక నిర్మాణ కార్మికులకు, కెటిపిఎస్ ఐడి నెంబర్లుకు, ఆర్టిజన్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్మికులకు అండగా సిపిఐ ఉంటుందని, యాజమాన్యం ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. ఈ సమస్యను కెటిపిఎస్ యాజమాన్యం దృష్టికి తీసుకెళతామని. ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేని నిరసన కారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుమల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కోసం పోరాడేది ఎఐటియుసినే

జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య



ప్రజాపక్షం/సుజాతనగర్:కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ అన్ని తక్షణమే రెగ్యులేషన్ చేయాలి అనిఎఐటియుసిజిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్లో సుజాతనగర్ గ్రామపంచాయతీ వర్కర్స్ ఎఐటియుసి మండల మహాసభ కూరపాటి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఒక కార్మిక కుటుంబం బతకాలంటే కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు. ఇవ్వాళ మార్కెట్లో ఉన్న రేట్లు కనుగుణంగా కార్మికులు కూడా వేతనాలు పెంచాల్సిన అవసరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశానికి తోడ్పడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకూడదని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా రవాణా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలి. ప్రైవేటుపరం చేయకూడదన్నారు. ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అమలుచేసి నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పండించే పంటకి గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. పనికిహార పథకం కింద అదేవిధంగా గ్రామ పంచాయతీలు పనిచేసే కార్మికులకి ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామపంచాయతీలో పని చేస్తే కార్మికులకి చేతికి గ్లౌజులు, కాళ్లకు బూట్లు, ముక్కుకు మా స్కో, సబ్బులు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు లేక ప్రైవేట్ పాఠశాల సాధిస్తున్న విద్యార్థులకు ఫీజు కట్టలేక, యూనిఫామ్స్ బుక్స్ కొనలేక, ఇల్లు కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు, ఎఐటియుసి సుజాతనగర్ మండల అధ్యక్ష కార్యదర్శుడు ,సిపిఐ మండల కార్యదర్శి , సహాయ కార్యదర్శి , రైతు సంఘం జిల్లా నాయకులు , ఎ ఐటియుసివర్కింగ్ ప్రెసిడెంట్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ , మాజీ ఎంపిటిసి గణేష్, ఎఐటియుసి, ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులు మహాసభలో పాల్గొన్నారు.

## ఎక్సలెంట్ అవార్డు అందుకున్న విద్యార్థులు



ప్రజాపక్షం/మణుగూరు:మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో చదువుకొని సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు విద్యార్థులు తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ వారు అందజేసిన ఎక్సెంట్ అవార్డులను శనివారం హైదరాబాద్ లో అందుకున్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత ప్రభుత్వ ఐటిఐ ల్లో చదువుకుని ఉన్నత ప్రభుత్వ రంగా సంస్థ ల్లో ఉద్యోగం పొందిన విద్యార్థులను కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఘనంగా సన్మానం చేశారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండడం అభినందనీయమని పలువురు కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఐటిఐ ల ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ప్రభుత్వ ఐటిఐ నుంచి అవారులు పొందిన ఎలక్ట్రిషన్ విద్యార్థి ఎస్ డి సమీర్, జె. ద్వారకామయిలను ఐటిఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ జి రవి లు అభినందించారు.

## బిసిలకు చట్టబద్ధత రిజర్వేషన్

రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పార్టీల రిజర్వేషన్ కాకుండా బిసిలకు చట్టబద్ధత రిజర్వేషన్ కల్పించాలని రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్ తెలిపారు. పూలే అంబేద్కర్ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి గెస్ట్‌హౌజ్ నందు లింగనబోయిన లక్ష్మ ణ్ అధ్యక్షతన బిసి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. 42 శా తం రిజర్వేషన్ అమలు తర్వాతనే స్థానిక సం స్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిసిలకు ఏమాత్రం రిజర్వేషన్లు ఇచ్చే చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. తక్షణం అసెంబ్లీలో జిఒ పాస్ చేయాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ విద్య, ఉపాధి రంగాల్లో కూడా అమలు చేయాలన్నారు. ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అగ్ర కులాల్లో పేదల శాతాన్ని లెక్కించి అంత మేరకు అమలు చేయాలన్నారు. వెనకబడిన తరగతులు ఐక్యమై బహుజన రాజ్యం సాధించుకుంటేనే బహుజనుల విముక్తి ఉందన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్‌జెసి కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతంలో ఒకే ఒక సామాజిక వర్గం అన్ని రంగాల్లో విస్తరించిందన్నారు. అందుకే క్రింద కులాలకు ఆత్మ గౌరవం లేకుండా బతకాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అందుకే బహుజన కులాలు ఐక్యమై ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీను, బహుజన పొలిటికల్ రాష్ట్ర నాయకులు పోరకంటి రాంబాబు, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యుక్త వయస్సులోనే వ్యాధులు

బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు పవన్‌కుమార్



ప్రజాపక్షం/బోనకల్: 30 ఏళ్లు దాటితే నూటికి 20 మందికి బిపి, షుగర్ బారిన పడుతున్నారని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ టి పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్‌కుమార్ మాట్లాడుతూ మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల మార్పులతో 30 ఏండ్లు దాటగానే బిపి, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 30 ఏండ్లు దాటిన వారికి నాన్ కమ్యూనికబుల్ డిసిజస్‌పై (ఎన్‌సిడి) హెల్త్ డిపార్ట్‌మెంట్ సర్వే నిర్వహిస్తుందని అన్నారు. ఈ సర్వేలో నూటికి 20 మందికి పైగా బిపి, షుగర్ బారిన పడుతున్నారని, ఏటా బిపి, షుగర్ వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతున్నట్లు సర్వేలో వెల్లడైందని అన్నారు. దీనికి ప్రధాన కారణం జీవనశైలిలో వచ్చిన మార్పులేనని అన్నారు. శరీరానికి తగిన శ్రమ లేకపోవడం, అధికంగా ఒత్తిడికి గురవ్వడం, తీసుకునే ఆహారం జంక్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్ వాటికి అలవాటు పడి రోగాలను కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్యసేవలు అభినందనీయమని, ట్రస్ట్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ క్యాంపులో వైద్యులు టి పవన్‌కుమార్ 100 పేషంట్లకు వైద్యసేవలు అందించగా, నెలకు సరిపడ మందులను బికెఎంయూ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ పగిడిపల్లి యేసు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, ఏలూరి పూర్ణచంద్రరావు, కొంగర కృష్ణయ్య, సిపిఎం నాయకులు బోయినపల్లి వీరబాబు, బూర్గుల అప్పాచారి, షేక్ ఖాదర్‌బాబు, క్యాంపు సహయకులు యంగల గిరి, యంగల ఉజ్వల్‌చరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనే సిపిఐ లక్ష్యం

సిపిఐ మధిర మండల మహాసభలో జమ్ముల జితేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/మధిర : సమసమాజ స్థాపనే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధిర క్లబ్‌లో సిపిఐ మధిర మండల 18వ మహాసభ పెరుమాళ్లపల్లి ప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. మహాసభల ప్రారంభ సూచికగా నల్లబోతు రత్తమ్మ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందన్నారు. బిజెపి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు, త్రాగునీరు, విద్య, వైద్యం మరింత మెరుగుపర్చాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా విజయాలు సాధించలేమని ప్రజా సమస్యల కోసం పార్టీశ్రేణులు నిరంతరం పోరాటాలు సాగించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, ఏపూరి రవీందర్ తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, జిల్లా సమితి సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్ క్రీడల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ప్రజాపక్షం/పాల్వంచ : హన్మకొండ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో జిల్లా క్రీడాకారులు 20 మంది పాల్గొన్నారు. మెరుగైన ప్రతిభ కనభరిచి మూడు రజిత, రెండు కాంస్యం మొత్తం ఐదు పథకాలు సాధించారు. ఈ సంధర్భంగా జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కిడ్స్ జావెలిన్ త్రో లో రజిత పథకం సాధించిన కొత్తగూడెంకు చెందిన సిహెచ్. కృతిక, కిన్నెరసాని, కాచనపల్లికి చెందిన డి. లోకేష్, వై. శృతిహాసన్, త్రయాతలాన్‌లో రజిత పథకాలు, 60 మీటర్ల పరుగుపందెంలో భద్రాచలానికి చెందిన కాంస్య పథకం ట్రైయాతలాన్‌లో కాంస్య పథకాన్ని సాధించిన కిన్నెరసానికి చెందిన కే. దిలీప్ లతో పాటుగా కోచ్‌లు డి. మల్లిఖార్జున్, పి. నాగేంధర్, జే. నాగరాజు, గిరి ప్రసాద్, ప్రసాద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్ ప్రసాద్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాక్రిష్ణ, జనరల్ సెక్రటరి కే. మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతర పోరాటం

జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు




ప్రజాపక్షం/కల్లూరు:దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పార్టీ అని, పేదలు, దళితులు, కార్మికులు, కష్టజీవులు, బడుగు, బలహీన వర్గాల పట్ల వారి సమస్యల పరిష్కారం పట్ల నిరంతరం నికచ్చిగా పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, సిపిఐ పార్టీని ఆదరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు అన్నారు. మహాసభ వేము రాంబాబు అధ్యక్షతన విజ్ఞాన్ స్కూల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ అనేక త్యాగాలు అనేక పోరాటాలు నిర్వహించిందని కమ్యూనిస్టు పార్టీ త్యాగాల వెలుగులు దేశానికి సంపూర్ణ స్వతంత్రం కోసం నినదించి పోరాడిందని దేశంలో నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల వ్యవసాయ కూలీల పొట్ట కొట్టేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఇట్టి ప్రయత్నాన్ని వ్యవసాయ కార్మికులు, పేదలు అడ్డుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రావి శివరామకృష్ణ, సత్తుపల్లి నియోజకవర్గం సెక్రటరీ దండు ఆదినారాయణలు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సిపిఐ అని, ప్రజల సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు ముందుండి పోరాడుతుందని అందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ మహాసభలో వేము రాంబాబు, దయాకర్, బాగా సత్యవతి, నెంబర్ రామకృష్ణ, యోబు, పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్, యద్దనపూడి పిచ్చయ్య, పొగడ్ల భద్రయ్య, ఖమ్మంపాడు వెంకటలక్ష్మి, కోల మాధవరావు, ఉప్పర్ నాగమణి, బాణావత్ రేణుక, అలివేలు, అప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## ఓం శాంతి శాంతి శాంతిః
# పోస్టర్ రిలీజ్




సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్న తరుణ్ భాస్కర్ మరో ఆసక్తికరమైన సినిమాలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈషా రెబ్బా కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఎ ఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. 2డి యానిమేషన్ స్టయిల్‌లో ప్రజెంట్ చేసిన కాన్సెప్ట్ వీడియోతో పాటు ఆకట్టుకునే టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేయడంతో తరుణ్ భాస్కర్ ప్రమోషన్ మొదలు పెట్టాడు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ పోస్టర్ అమ్మాయి , అబ్బాయి జంట చేతులను చూపించడం ఆసక్తికరంగా వుంది. 'ఓం శాంతి శాంతి శాంతిః' అనే టైటిల్ ను నామకరణం చేశారు ఈషాను కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయిగా, తరుణ్‌ను వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా పరిచయం చేశారు. వారి పెళ్లి తర్వాత కథ ఎలా మలుపు తిరుగుతుంది. ఇద్దరి మధ్య వాగ్వాదాలు, గొడవలు ఎలా వచ్చాయి. ఎలా పరిష్కారమైయ్యాయి వంటి కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించారు. హ్యూమర్, కల్చర్, రిలేషన్షిప్ డ్రామాతో అందరినీ అలరించబోతున్నామని , ఆగస్టు 1న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తరుణ్ భాస్కర్ తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా 'ది 100' ట్రైలర్ విడుదల

ఆర్‌కె సాగర్ హీరోగా కెఆర్‌ఐఎ ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై నిర్మించిన 'ది 100' చిత్రం ట్రైలర్‌ను ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. రమేష్ కరుటూరి, వెంకి పుషడపు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ సినిమాకు రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. 'జీవితంలో జరిగిపోయినది మనం మార్చలేము, కానీ జరగబోయేదాన్ని ఖచ్చితంగా ఆపగలం' అనే విక్రాంత్ ఐపీఎస్ వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఆయుధాన్ని ఎప్పుడూ ఉపయోగించకూడదనే రూల్ పెట్టుకుంటాడు. కానీ ఆత్మరక్షణ కోసం, అతను తాను ఆయుధంగా చూసుకోవడం ప్రారంభిస్తాడు. వ్యవస్థలోని శక్తివంతమైన వ్యక్తుల మద్దతుతో క్రూరమైన దొంగల ముఠా అతని జీవితంలో ఒక పెద్ద సవాలు ఎదురౌతుంది. అతని సొంత డిపార్ట్మెంటర్ కూడా అతనిపై ఆరోపణలు చేసి, చివరికి అతన్ని సస్పెండ్ చేస్తుంది. ఒకప్పుడు ఆయుధం తీసుకెళ్లనని శపథం చేసిన వ్యక్తి ఆయుధం తీసుకోవడం తప్ప వేరే మార్గం లేని పరిస్థితుల్లోకి వస్తాడు.ఇదే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఆర్‌కె సాగర్.. విక్రాంత్ ఐపీఎస్‌గా ఫిట్‌గా కనిపిస్తారు. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించింది.

# ఫిలిం ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలి

**చిన్న నిర్మాతల ఏకగ్రీవ తీర్మానం**
**నేడు ఛాంబర్‌కు నిర్మాతల వినతి**



తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను వాయిదా వేసేందుకు కొందరు తమ స్వార్థంతో ప్రయత్నిస్తున్నారని అసోసియేషన్‌లోని పలువురు చిన్న నిర్మాతలు ఆరోపించారు. తెలుగు ఫిలింఛాంబర్ మాజీ ప్రెసిడెంట్ బసిరెడ్డి, తెలుగు ఫిలింఛాంబర్ ప్రొడ్యూసర్స్ సెక్టార్ మాజీ చైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలుగు ఫిలింఛాంబర్ ప్రొడ్యూసర్ సెక్టార్ ఈసీ మెంబర్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతల సమావేశం జరిగింది. ఈ నెలతో ప్రస్తుత ఫిలిం ఛాంబర్ బాడీ గడువు ముగుస్తున్నందున వెంటనే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి కార్యాలయంలో సమావేశమైన నిర్మాతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారం రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరపాలని, అయితే ఇప్పుడున్న వారినే కంటిన్యూ చేయాలని కొందరు తమ సొంత ఎజెండా పెట్టుకుని ప్రతిపాదించడం సరికాదన్నారు. ఇప్పుడున్న బాడీనే కొనసాగుతుందని కొందరు మీడియాల్లో దిగజారుడు ప్రచారం చేస్తున్నారని ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని, ఎన్నికలు అడ్డుకోవాలని చూసే వారి ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు. నేడు ఉదయం 10.30 గంటలకు నిర్మాతలు బసిరెడ్డి, డా.ప్రతాని రామకృష్ణ గౌడ ఆధ్వర్యంలో నిర్మాతలందరూ కలసి తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మెమొరాండం సమర్పించనున్నారు. కాబట్టి నిర్మాతలంతా ఈ మెమొరాండం సమర్పణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నిర్మాతలు రమేష్ నాయుడు, లయన్ సాయి వెంకట్, కె.సురేష్ బాబు, బోడపాటి మురళి, రవీంద్ర గోపాల్ జి.సుదర్శన్ రావు, గురురాజ్, వింజమూరి మధు, శంకర్ గౌడ్ భానూరు నాగరాజు, బండారు అమర్, పిఎల్ కె.రెడ్డి, రంగా రవీంద్ర గుప్త (బుల్లెట్ రవి), మున్నవర్ అలీ, మిత్తాన ఈశ్వర్, ఆర్‌విఎన్ వరప్రసాద్, వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విదేశాల్లో వరుణ్ తేజ్ షూటింగ్



నాగబాబు తనయుడు వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్ పదిహేనవ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ విదేశాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్ త్వరలోనే విడుదల చేయనున్నారు. ప్రస్తుతానికి వరుణ్ తేజ్ పేస్ సరిగ్గా కనిపించి కనిపించినట్లు, చేతి మీద టాటూతో ఒక పోస్టర్‌ను మీడియాకు విడుదల చేశారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. హైదరాబాద్, అనంతపురం షెడ్యూల్స్ తర్వాత షూటింగ్ ఇప్పుడు విదేశాల్లో షెడ్యూల్ శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్ తో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీంతో ఈ ఎనభై శాతం షూటింగ్ పూర్తవుతుంది. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# 'టికెట్ కొట్టు.. ఐఫోన్ పట్టు'
## 'వర్జిన్ బాయ్స్' ట్రైలర్ లాంచ్




రాజ్ గురు బ్యానర్‌పై దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో ఆవిష్కరించారు. ఈ చిత్రంలో మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జేడీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. బబ్లు, కౌశల్ మంద, ఆర్జె సూర్య, సుజిత్ కుమార్, కేదార్ శంకర్, ఆర్జె శరన్, శీతల్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమా టికెట్ కొన్న 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని ఈ ట్రైలర్ లాంచ్ సందర్భంగా చిత్ర బృందం తెలిపింది. మనీ రైన్ ఇన్ థియేటర్స్ అనే కాన్సెప్ట్‌తో కొన్ని థియేటర్లలో డబ్బు మీపై వర్షంలో కురిసి ఆ డబ్బు ప్రేక్షకులు సొంతం చేసుకోవచ్చు అంటూ తెలిపారు. 11న వర్జిన్ బాయ్స్ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# పాట చిత్రీకరణలో 'ది గర్ల్ ఫ్రెండ్'

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రశ్మిక, దీక్షిత్ శెట్టిపై పాట చిత్రీకరిస్తున్నారు. టాకీ పార్ట్ దాదాపుగా పూర్తయ్యింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నారు. ఈ చిత్రంలోని పాటను ఈ నెలలోనే విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్, సంగీతం హేషమ్ అబ్దుల్ వాహబ్ అందిస్తున్నారు.

# దుమ్ము రేపుతున్న పాట




సౌత్ ఇండియన్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో విడుదల చేసిన చికిటూ పాట సోషల్ మీడియాలో దుమ్ము దులుపుతోంది. బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ కూడా ఇందులో అత్యంత కీలమైన పాత్రను పోషించారు. యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ కథతో ఈ కూలీ సినిమాను తెరకెక్కించారు. లోకేష్ కనగ రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున ఇందులో ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కూడా ఓ అద్భుతమైన పాత్రను పోషించారు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమాలోని చికిటూ అనే పాట విడుదలైన కొద్ది గంటల్లోనే 2.5 మిలియన్స్ వ్యూస్ దాటిందని దర్శకుడు లోకేష్ కనగ రాజ్ తెలిపారు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రజనీకాంత్‌ను చాలా కొత్తగా చూపించమని దర్శకుడు అన్నారు.

# బాలిక దారుణ హత్య (మొదటి పేజీ తరువాయి)

వారి ఇంటి సంఘంలోని మరొకరి ఇంటి బాత్రూంలో అతి దారుణంగా రక్తపు మడుగులో కనిపించడంతో స్థానిక, కుటుంబసభ్యులు హుటాహుటిన కోరుట్ల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో కోరుట్ల పట్టణంలో దారుణ ఘటన సంచలనం రేపింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటన జరిగిన ఇంటి యజమాని ఫోన్ చేయగా తను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నానని చెప్పినట్లు సమాచారం అందింది. పోలీసుల వివరాల మేరకు ఆదర్శనగర్‌లో నివాసముంటున్న ఆకుల రాములునవీన దంపతులకు కొడుకు కూతురు ఉన్నారు. ఆడుకోవడానికి వెళ్లిన పాప ఇంకా రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానికులు పోలీసులు వెతుకుతుండగా అదే కాలనీకి ఒడుపల్లి విజయ్ అనే వ్యక్తి ఇంటి బాత్రూంలో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. ఆ ఇంటి యజమాని ఇంట్లో లేనని చెప్పడంతో ఎస్పీ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రాత్రి మొత్తం ఎస్పీతో పాటు పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ టీం మొత్తం అన్ని కోణాల్లో వెతికి దర్యాప్తు చేయగా డాగ్ స్క్వాడ్ ద్వారా అంతకుడి కోసం వెతకగా హితిక్ష సొంత చిన్నమ్మ ఆకుల మమత అతి దారుణంగా హత్య చేసినట్లు అంతకురాలిగా అనుమానిస్తున్నారు.. ఆకుల మమత కూడా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మమత బాలికను హత్యచేసిన తర్వాత తాను వేసుకున్న బట్టలకు రక్తపు మరకలు ఉండడంతో ఎక్కడ అనుమానం వచ్చి దొరికిపోతానని హత్య చేసిన వెంటనే తన ఇంటికి చేరుకొని తను వేసుకున్న రక్తపు మరకల బట్టలు వాషింగ్ మిషన్‌లో వేయడంతో వాసన పసిగట్టిన డాగ్ స్క్వాడ్ పోలీస్ టీం, క్లూస్ టీం పోలీసులు నేరుగా వాషింగ్ మిషన్ వద్దకు చేరుకొగా రక్తపు మరకలతో ఉన్న ఆ యొక్క బట్టలు ఎవరివని పరిశీలించగా హితిక్ష చిన్నమ్మ ఆకుల మమత బట్టలుగా గుర్తించారు. మమతను అదుపులోకి తీసుకొని పోలీసులు తనదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టగా హత్య చేయడానికి గల కారణం ఆకుల నవీనపై కసీతో ద్వేషంతో తాన కూతురు హితక్షపై తానే కత్తితో అతి దారుణంగా హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం... ఆకుల మమత ఒకరే హత్య చేశారా ఇంకెవరైన సహకరించారా అనే కోణంలో క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కొన్ని గంటల్లో ఛేదించిన పోలీసులు

ఘటనజరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను స్థానికులు, కోరుట్ల పట్టణ ప్రజలు అభినందించారు. ఈ కేసులో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌తో పాటు డిఎస్‌పి అడ్డూరి రాములు, కోరుట్ల మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్‌బాబు, అనిల్‌కుమార్, కోరుట్ల ఎస్సై చిరంజీవి, మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్, మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ డాగ్ స్క్వాడ్‌టీ, పోలీస్ సిబ్బంది తదితరులు ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించారు.

# ఎలాన్ మస్క్ కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా దేశంలో రిజిస్టర్ చేసుకోలేదు, ఆవిర్భవించలేదు. ఈరోజున 'అమెరికాన్ పార్టీ' ఆవిర్భవించింది. మీ స్వేచ్ఛను మీకు తిరిగి ఇవ్వడంకోసమే పార్టీ ఆవిర్భవించింది' అని ఎక్స్ వేదికగా ఆదివారం ఎలాన్‌మస్క్ పోస్టింగ్ పెట్టారు. 'అవినీతి వృథాఖర్చులతో మనదేశం దివాళాతీసే స్థితికి వచ్చినప్పుడు, మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నట్లు కాదు, ఏకస్వామ్య, ఏకైక పార్టీ పాలనలో జీవిస్తున్నట్టే' అని టెస్లా, స్పేస్ ఎక్స్ సిఇఓ మస్క్ పేర్కొన్నారు. 'డాడ్జ్'తో తెగదెంపులు చేసుకున్న తర్వాత మొదటిసారి మస్క్ తన రాజకీయ ఆశయాన్ని, అభిప్రాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అమెరికాలో ఒక కొత్త పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా?లేదా? అనే విషయంపై ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయ సేకరణ కూడా చేశారు. ఈ ఫలితాలను ఆయన ప్రకటిస్తూ, మెజారిటీ తీర్పుతో పార్టీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అమెరికన్ ప్రజలకు వారి స్వాతంత్ర్యాన్ని తిరిగి ఇచ్చేందుకే ఈ కొత్త పార్టీ ఆవిర్భవించిందని మస్క్ ప్రకటించారు. డోనాల్డ్ ట్రంప్‌తో రాసుకు పూసుకు తిరిగిన మస్క్ సంబంధాలు చెడిపోతున్న సంకేతాలు కనిపించిన తరుణంలోనే ఆయన కొత్త పార్టీ విషయం మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' సెనేట్‌లో చర్చకు రాగానే ఈ విషయంపై స్పష్టత వచ్చింది. ఒక వేళ బిల్లు ఆమోదం పొందితే ఆ మరునాడే తన పార్టీ ఆవిర్భవిస్తుందని ఐదు రోజులక్రితమే మస్క్ ప్రకటించారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధికార రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి ట్రంప్‌కు ఆయనే ప్రధాన దాతగా వ్యవహరించారు. ఇటీవలికాలం వరకు ఆయనకు సన్నిహిత సలహాదారుడుగా వ్యవహరించారు. ప్రభుత్వంలో పొదుపు చర్యలకు నాయకత్వం వహించిన మస్క్ తర్వాత ట్రంప్ 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'ను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనివల్ల ఫెడరల్ బడ్జెట్‌లో ట్రిలియన్ డాలర్ల మేరకు తీవ్రమైన లోటు ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. చివరకు అమెరికా కాంగ్రెస్ ఉభయసభల్లో చాలా స్వల్ప తేడాతో ఈ బిల్లు గట్టెక్కి చట్టరూపం తీసుకుంది. ఈ బిల్లు కారణంగానే ఎలాన్ మస్క్–ట్రంప్ మధ్య విభేదాలు తారాస్థాయికి వెళ్ళి చివరకు ఇద్దరూ విరోధులుగా మారారు. ఐతే ట్రంప్ కూడా తీవ్రంగా స్పందిస్తూ, ప్రభుత్వం అనేక రాయితీలు, భారీ రుణాలు ఇవ్వబట్టే ఎలాన్‌మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించగలిగారని, మస్క్ కంపెనీలకు ఇచ్చిన సామూహిక కాంట్రాక్టులను తమ ప్రభుత్వం పునఃసమీక్షిస్తుందని ప్రకటించారు.

# అధికారం కోసం మతాల మధ్య బిజెపి మంటలు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నరసింహ**




**ప్రజా పక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వంఅధికారం కోసం దేశ ప్రజల మధ్య మతం చిచ్చు పెడుతూ ఎంతకైనా బరితెగించి పరిపాలన సాగిస్తోంది సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి. నరసింహ ఆరోపించారు. సిపిఐ గౌలిపుర డివిజన్ 4వ మహాసభ జి.చంద్రమోహన్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస హై స్కూల్లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈటి నరసింహ మాట్లాడుతూ దేశంలో మోడీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని దానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలే నిదర్శనమన్నారు. కుల,మత పూనాదులపై అధికార భవనాలు నిర్మించడం కొంతకాలం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తానంటే చైతన్యం నిండిన జనం చూస్తూ ఊరుకోరన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ ఇప్పటి వరకు ఎంఐఎం పార్టీ నాయకులపై ఎందుకు ఈడి,ఐటీ దాడులు చేయించలేదని ప్రశ్నించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రశ్నించే హక్కులను కాళ్ళరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్ మాట్లాడుతూ కారల్ మార్క్స్, లెనిన్‌ల ప్రభావం వల్ల భారత దేశంలో 1925 సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి నాటి నుండి నేటి వరకు బ్రిటిష్ పాలనను పారద్రోలి, నిరంకుశ నిజామును తరిమేసి, తెలంగాణ సాధన పోరాటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ గౌలిపుర డివిజన్ మాజీ కార్యదర్శి ఎన్ ఆర్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గౌలిపుర డివిజన్ పరిధిలోని వివిధ సమస్యపై ప్రజల పక్షాన నిలబడి పోరాటం చెయ్యాలని కోరారు. జి.చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం కార్యకర్తల, ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ మహాసభలో సిపిఐ నగర కౌన్సిల్ సభ్యుడు అటుకుల రాజు, పి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### గౌలిపుర డివిజన్ కార్యదర్శిగా గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ ఎన్నిక

సిపిఐ గౌలిపుర డివిజన్ కార్యదర్శిగా జి.చంద్రమోహన్ గౌడ్ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సహాయ కార్యదర్శులుగా అటుకుల రాజు, పి.సునీల్‌లను ఎనిమిది మంది సభ్యులతో కార్యవర్గం, 13 మంది సభ్యులతో నూతన కౌన్సిల్ ఏర్పాటు చేశారు.


# కార్మిక శాఖ మంత్రి వివేక్‌కు టిజిఒ ఘన సన్మానం



**ప్రజా పక్షం/హైదరాబాద్ :** కార్మిక ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామిని తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్ ఆదివారం మార్యదపూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా మంత్రివివేక్‌ను కృష్ణ యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కార్మిక ఉపాధిశాఖ మంత్రివివేక్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు(ఐటిఐ)లను బలోపితం చేయడానికి ఎనలేని కృషి చేస్తున్నారని కృష్ణ యాదవ్ ప్రశంసించారు.

# చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)



సంపాదించిందని ప్రచారం ప్రారంభించిందని జైరామ్ రమేశ్ విమర్శించారు. దేశంలో పేదరికం నిష్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు సమానత్వం సాధించిన దేశాల జాబితాలో చేరామని ఏ దేశం కూడా చెప్పుకోవడం సమర్థనీయం కాదని ఆయన విమర్శించారు. భారతదేశంలో వేతన అసమానతలు చాలా హెచ్చుస్థాయిలో ఉన్నాయన్న విషయాన్ని ప్రపంచబ్యాంకు నివేదిక ప్రముఖంగా ప్రస్తావించిందని ఆయన చెప్పారు. భారత్‌లో సగంమంది వేతనజీవులలో పదీశాతం మంది, అట్టడుగు వేతనజీవులకంటే 13రెట్లు ఎక్కువగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో సంపాదించారని నివేదిక తెలియజేసిందని చెప్పారు. అంతకంటే ముఖ్యంగా వినియోగంలో అసమానతలను కూడా ప్రభుత్వ గణాంకాలు మరుగుపరచి తక్కువచేసి చూపించి ఉండవచ్చునన్నారు. శాంపిల్ సర్వేలో ఈ గణాంకాలను తారుమారు చేసి ఉండవచ్చునన్నారు. వినియోగదారుల కొనుగోలుశక్తి సామర్థ్యాలలో ఉన్న సమానత్వాన్ని చూసేటప్పుడు 2021 నాటి కారకాలను 2017 నాటి కారకాలతో పోలిస్తే పేదరికం నిష్పత్తి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు నివేదికను ఉటంకిస్తూ జైరామ్ రమేశ్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న సవాళ్ళను గత కాలంపు నివేదికలతో పోల్చి చూసేందుకు ప్రజలలో శాంపిల్ సర్వే చేసేటప్పుడు ఇచ్చే ప్రశ్నల జాబితాలో మార్పులు, సర్వే అమలు, 2022–23లో ఇంటింటి వినియోగ వ్యయాల శాంపిల్ సర్వేలో మార్పులు జరిగాయని కూడా నివేదిక పేర్కొందని చెప్పారు. దిగువ మధ్య తరగతి ఆదాయాలు పొందే దేశంగా ఉన్న భారత్‌లో సంపాదన పేదరికం కొలమాన నిష్పత్తిలో ఒక రోజుకు 3.65 డాలర్లుగా ఉందని, తద్వారా 2022లో భారత్‌లో పేదరికం నిష్పత్తి ఈ నివేదికలో చాలా ఎక్కువగా 28.1 శాతంగా ఉందని పేర్కొన్నారు. అందువల్ల మనదేశంలో పేదరికం, అసమానతలు చాలా హెచ్చుస్థాయిలో ఉన్నాయన్న విషయం ఈ నివేదిక ప్రకారం స్పష్టం అవుతోందని జైరామ్ రమేశ్ చెప్పారు. 28.1 శాతం పేదరికం ఉంటే, తమ దేశం ప్రపంచంలో సమానత్వం సాధించిన దేశాల జాబితాలో ఉందని ఏ దేశం కూడా చెప్పుకోలేదని, అలా చెప్పుకోవడం సమర్థనీయం కాదని అన్నారు. భారతదేశ ప్రస్తుత పాలకులు అనేక సదుపాయాలను ప్రజల నుండి లాగేసుకున్నారని, అందువల్ల కూడా దేశంలో పేదరికం హెచ్చుస్థాయిలో ఉందనడం సమర్థనీయమేనన్నారు. ఉపాధిహామీ పథకం, జాతీయ ఆహార భద్రతా చట్టం వంటి సంక్షేమ వ్యవస్థలను వదిలేశారని, ప్రతికూల ప్రభావాలనుండి తట్టుకుని నిలబడాలంటే ఈ పథకాలను కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనాలు పెంచాలని కాంగ్రెస్‌పార్టీ ఎంతోకాలంగా డిమాండ్ చేస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ పరిస్థితుల కారణంగా దేశంలో పదికోట్లమంది ప్రజలు కొత్తగా జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకి వచ్చారన్నారు. దేశంలో పెరుగుతున్న పేదరికంపై సరైన అవగాహన లేదని, బాహాటత్వ విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరించడంలేదని విమర్శించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com